16-4Pg1exHMNWJQEG 1 ONG_16-4Pg1exHMNWJQEG.qxd 16/Apr/26 12:12 AM Page 1


ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

ఒంగోలు

fb.com/vaartha Digital

Published from Ongole, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

16-4-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 75 పేజీలు: 12 వెల: 6.50


వికసిత్ భారత్‌కు 9 సూత్రాలు: ప్రధాని మోడీ

9లో

డీలిమిటేషన్ పేరుతో దక్షిణాదికి ద్రోహం: స్టాలిన్

# టిడిపి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లోకేష్

**పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శులుగా కింజారపు రామ్మోహన్ నాయుడు, బైరెడ్డి శబరి, కిలారు రాజేష్**

**పొలిట్‌బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీలను ప్రకటించిన టిడిపి**

**కమిటీల కూర్పులో బడుగు, బలహీన వర్గాలకు పెద్దపీట**

**పొలిట్‌బ్యూరోలో సామాన్య కార్యకర్తలకు చోటు కల్పించిన అధిష్ఠానం**

**మహిళలకు, యువతకు ప్రాధాన్యతనిస్తూ నూతన కమిటీల ఏర్పాటు**



**విజయవాడ, ఏప్రిల్ 15,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగుదేశం పార్టీలో సరికొత్త మార్పులు చోటు చేసుకున్నాయి.పార్టీలో యువతకు, మహిళలకు అత్యధిక ప్రాధాన్యత కల్పించారు.ఇందులో భాగంగా నూతన నాయకత్వానికి, కొత్త సమీకరణాలకు టీడీపీ అధిష్ఠానం శ్రీకారం చుట్టింది. పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా పొలిట్ బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీలను ప్రకటించింది. ఈ పునర్ వ్యవస్థీకరణలో అత్యంత ముఖ్యమైన నిర్ణయంగా, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఏపీ మంత్రి నారా లోకేశ్‌ను నియమించారు. ఈ మేరకు టీడీపీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న నారా లోకేశ్‌కు ప్రమోషన్ వచ్చిందనే చెప్పాలి నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పార్టీ అధిష్టానం కొత్త బాధ్యతలు అప్పగించింది. టీడీపీ చరిత్రలో ఇప్పటివరకు వర్కింగ్ ప్రెసిడెంట్ హోదా లేదు. తొలిసారిగా కీలక పదవిని సృష్టించింది. ఇక టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శులుగా కింజరపు రామ్మోహననాయుడు, బైరెడ్డి శబరి, కిలారు రాజేష్‌లు నియమితులయ్యారు. సీనియర్ల అనుభవానికి, యువత ఉత్సాహానికి సమ ప్రాధాన్యం ఇస్తూ, సామాజిక కోణంలో కమిటీలను కూర్పు చేసినట్లు ఆయన తెలిపారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు నాయుడు అన్ని సమీకరణాలను బేరీజు వేసుకుని ఈ కసరత్తు చేశారని పల్లా పేర్కొన్నారు. 29 మందితో పొలిట్‌బ్యూరో, 31 మందితో జాతీయ కమిటీ, 185 మందితో రాష్ట్ర కమిటీని ఏర్పాటు చేశారు. పార్టీకి విధేయులుగా ఉంటూ, కష్టపడి పనిచేసిన వారికి ఈ నియామకాల్లో పెద్దపీట వేశామని స్పష్టం చేశారు. గతానికి భిన్నంగా, క్షేత్రస్థాయి కార్య కర్తలకు సైతం అత్యున్నత పదవులు కట్టబెడుతూ చంద్రబాబు సంచలన నిర్ణయం తీసుకున్నారని అన్నారు. గజపతినగరం మండల పార్టీ అధ్యక్షురాలు గంట్యాడ శ్రీదేవి, మంగళగిరి క్లస్టర్ ఇన్‌చార్జి గుత్తికొండ ధనుంజయ్‌కు నేరుగా పొలిట్‌బ్యూరోలో స్థానం కల్పించడమే ఇందుకు నిదర్శనమని వివరించారు. ఈ కమిటీల కూర్పులో సామాజిక న్యాయానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు స్పష్టమవుతోంది. 185 మంది సభ్యులున్న రాష్ట్ర కమిటీలో 122 మంది బడుగు,బలహీన వర్గాల వారేనని పల్లా తెలిపారు. ఇందులో బీసీలకు 77 (40 ), ఎస్సీలకు 25 (25 ), ఎస్టీలకు 7 (3.8 ), మైనార్టీలకు 13 (7)చొప్పున స్థానాలు కల్పించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా మహిళలకు పెద్దపీట వేశారు.

>>2



బుధవారం అన్న క్యాంటీన్‌లో వడ్డన చేస్తున్న సిఎం చంద్రబాబు

## అన్నార్తులకు అండగా అన్న క్యాంటీన్లు

2లో

# ఇంటర్‌లో బాలికల హవా

**ఫస్టియర్-77%, సెకండియర్-81%, ఉత్తీర్ణత**

**ద్వితీయంలో 92%తో కృష్ణ ఫస్ట్, గుంటూరు సెకండ్**

**20 నుంచి 27 దాకా రీకౌంటింగ్‌కు అవకాశం**

**విజయవాడ,ఏప్రిల్ 15,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలు వెల్లడయ్యాయి, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఈ ఫలితాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా గత 12 ఏళ్లలోనే అత్యధిక ఉత్తీర్ణత శాతం ఈ ఏడాది ఫలితాల్లో నమోదైందని మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ జూనియర్ కళాశాలల్లో గణనీయమైన పురోగతి కనిపించిందన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రథమ సంవత్సరం ఉత్తీర్ణత శాతం 54 శాతంగా నమోదై గత 12 ఏళ్లలో అత్యధికంగా నిలిచిందన్నారు. ద్వితీయ సంవత్సరంలో 68 శాతం ఉత్తీర్ణత శాతం నమోదు కావడం కూడా గత 12 ఏళ్లలో రెండో అత్యుత్తమ ఫలితంగా నిలిచిందని తెలిపారు. ఈ విజయానికి విద్యార్థుల కృషి, ప్రిన్సిపాళ్లు, జూనియర్ లెక్చరర్ల శ్రమతో పాటు అన్ని వర్గాల సమిష్టి కృషి కారణమైందని అభినందించారు. ఇక ఫలితాల వివరాలను ఇంటర్ బోర్డు డైరెక్టర్ రంజిత్ భాష వివరించారు. ప్రథమ సంవత్సరం 77 శాతం మంది, ద్వితీయ సంవత్సరంలో 81 శాతం ఉత్తీర్ణత సాధించారు. రెండింటిలోనూ బాలికలే పై చేయి సాధించారు. మొదటి సంవత్సరానికి సంబంధించి గత 12 ఏళ్లలో అత్యధిక ఉత్తీర్ణత శాతం నమోదు కాగా ద్వితీయ సంవత్సరంలో రెండో అత్యధిక ఉత్తీర్ణత శాతం కావటం విశేషం. ఈ సారి విజయం సాధించలేకపోయిన విద్యార్థులు నిరుత్సాహపడకుండా ఒక పాఠంగా తీసుకుని మరింత కృషి చేసి తిరిగి విజయాన్ని సాధించాలని మంత్రి లోకేశ్ సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం విద్యార్థులకు మానసికంగా తోడ్పాటునందించాలని కోరారు. ఇంటర్మీడియట్ ఫలితాల్లో మొదటి సంవత్సరం బాలుర 72శాతం, బాలికలు 81 శాతం ఉత్తీర్ణత సాధించారు. రెండో సంవత్సరం బాలురు 76శాతం, బాలికలు 85 శాతం ఉత్తీర్ణులయ్యారు. మొదటి ఏడాది 4,71,864మంది పరీక్షలకు హాజరుకాగా 3,61,526 మంది ఉత్తీర్ణత సాధించారు. రెండో ఏడాది 4,46,537 మంది పరీక్షలు రాయగా 3,59,816 మంది ఉత్తీర్ణత సాధించారు.వొకేషనల్ కోర్సులకు సంబంధించి మొదటి ఏడాది 38, 443మంది పరీక్ష రాయగా 23,569మంది పాస్ అయి 61 శాతం ఉతీ ర్ణతసాధించారు. రెండో ఏడాది ఒకేషనల్ కోర్సుల్లో 33,852 మంది

>>2



బుధవారం పేలుడు ధాటికి ధ్వంసమైన ఇంటి పరిసరాలను పరిశీలిస్తున్న పోలీసులు

# కదిరిలో భారీ పేలుడు

**మహిళ సహా నలుగురు అక్కడికక్కడే మృతి**

**21 మందికి తీవ్రగాయాలు, ఒకరి పరిస్థితి విషమం**

**జెలిటిక్స్ పేలుడువల్లే దుర్ఘటన**


**క్షతగాత్రులను పరామర్శించిన ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్**

**కదిరి, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:** శ్రీసత్యసాయి జిల్లా కదిరి రూరల్ మండలం కుమ్మరవాండ్లపల్లిలో విషాధం నెలకొంది. జెలిటిక్స్ పేలుడు భారీగా సంభవించడంతో 3 ఇంట్లు దగ్ధం కాగా ప్రమాదంలో మహిళతో సహా నలుగురు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మరో 21 మందికి తీవ్ర గాయాలు కాగా కదిరి ప్రభుత్వ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందిస్తున్నారు. ప్రమాదంలో విశ్వ నాథ్‌రెడ్డి, మాబున్నీసా, అస్లాం, మధులు మృతి చెందగా, అశోక్ అనే యువకుని పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతులందరూ నిరుపేదలు కావడంతో కుమ్మరవాండ్ల పల్లిలో విషాధ ఛాయలు అలుముకున్నాయి. స్థానికులు పోలీ సులు తెలిపిన వివరాల మేరకు తెలంగాణ రాష్ట్రం కొత్తగూడెంకు చెందిన వెంకన్న గత 10 సం వత్సరాల క్రితం కుమ్మరవాండ్లపల్లిలో

>>2

## బీహార్ సిఎంగా సామ్రాట్ చౌదరి ప్రమాణం

2లో



బుధవారం ధరణికోటలో అన్న క్యాంటీన్ ప్రారంభిస్తున్న సిఎం చంద్రబాబు

# అన్నార్తులకు అండగా అన్న క్యాంటీన్లు

## ధరణికోటలో అన్న క్యాంటీన్ ప్రారంభించిన సిఎం చంద్రబాబు

### రాష్ట్రంలో 269కి చేరిక

**విజయవాడ ఏప్రిల్ 15, ప్రభాతవార్తప్రతినిధి:** పేదల ఆకలి తీరిస్తేనే అభివృద్ధి సాధించినట్టు విశ్వసిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఎంత అభివృద్ధి సాధించినా పేదలకు పట్టెడన్నం లేకపోతే అది వృధా అని ఆయన వ్యాఖ్యానించారు. అందుకే రాష్ట్రవ్యాప్తంగా అన్నార్తుల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసినట్టు వివరించారు. పలనాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గం, ధరణికోటలో కార్మికులతో కలిసి సీఎం చంద్రబాబు అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. ధరణికోటలో ఏర్పాటు చేసిన రూరల్ అన్న క్యాంటీన్ ప్రారంభించిన అనంతరం రూ.5 వెచ్చించి టోకెన్ కొనుగోలు చేసిన ముఖ్యమంత్రి కార్మికులతో కలిసి భోజనం చేశారు. అంతకముందు క్యాంటీన్‌కు వచ్చిన పేదలు, కార్మికులకు ఆయన స్వయంగా భోజనం వడ్డించారు. లబ్దిదారులతో ముచ్చటిస్తూ అన్న క్యాంటీన్‌లోనే సీఎం ఆహారాన్ని తీసుకున్నారు. అన్న క్యాంటీన్లలో అందిస్తున్న భోజనం రుచి, శుభ్రత, నాణ్యతల గురించి ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. దీనిపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "కడుపు నిండితేనే నిజమైన అభివృద్ధి నేను నమ్ముతాను. అందుకే పేదవాడి ఆకలికి తీర్చడానికి ప్రజాప్రభుత్వం అన్న క్యాంటీన్లు తెచ్చింది. పేదవాడికి పట్టెడన్నం పెట్టడమే నా రాజకీయం అని ఎన్టీఆర్ రూ.2 లకే కిలో బియ్యం ఇచ్చి ఆహార భద్రత పథకానికి నాంది పలికారు. నిత్యాన్నదాతగా డొక్కా సీతమ్మ పేరు అజరామరం. ఆకలి అన్న వాళ్ల కాదనకుండా అన్నం పెట్టడం మన సంస్కృతిలోనే ఉంది. సంక్షేమం అనేది తెలుగుదేశం పార్టీ సిద్దాంతంలోనే ఉంది. నాటి రెండు రూపాయల కిలో బియ్యం నుంచి నేటి అన్నా క్యాంటీన్ల వరకు ఆహార భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. 2024లో అధికారంలోకి రాగానే రాష్ట్ర వ్యాప్తంగా అన్నక్యాంటీన్లు ఏర్పాటు చేశాం. ముందుగా పట్టణ ప్రాంతాల్లో అన్నక్యాంటీన్లు ప్రారంభించాం. ఇవాల్టి నుంచే గ్రామీణ ప్రాంతాల్లో 62 అన్నక్యాంటీన్లు అందుబాటులోకి వచ్చాయి. ఇప్పటికే పట్టణాల్లో 204, గ్రామాల్లో 65 కలిపి ఈ సంఖ్య 269కి పెరిగింది. త్వరలో మరో 5 క్యాంటీన్లు సిద్ధం అవుతున్నాయని" సీఎం స్పష్టం చేశారు.

**అక్షయ పాత్రకు అభినందనలు:**
'అన్న క్యాంటీన్లకు నిరంతరం ఆహార సరఫరా చేస్తున్న అక్షయపాత్ర ఫౌండేషన్‌ను అభినందిస్తున్నాను. 25 ఏళ్లుగా ఈ ఫౌండేషన్ 500 కోట్ల భోజనాలను సరఫరా చేసింది. అన్న క్యాంటీన్లలో రూ.5కే అందిస్తున్న భోజనం పేద వాళ్లు, ఆటోడ్రైవర్లు, ముఠా కార్మికులు, కూలీలకు ఆసరాగా నిలుస్తోంది. అన్నక్యాంటీన్ల ఏర్పాటుతో వారి డబ్బు ఆదా అయ్యి ఇతర అవస రాలకు ఉపయోగపడుతుంది. ఒక్కో అన్నా క్యాంటీన్‌లో రోజుకు సగటున 1,013 మంది ఆహారాన్ని తీసుకుంటున్నారు. దీని నిర్వహణ కోసం రూ.26,250 ఖర్చు అవుతుంది. ప్రస్తుతం రాష్ట్రంలోని అన్న క్యాంటీన్ల ద్వారా రోజుకు 2.10 లక్షల మంది భోజనాలు చేస్తున్నారు. దీనికోసం రోజుకు రూ.54 లక్షలకు పైగా వ్యయం అవుతోంది. ఇప్పుడు కొత్తగా పెట్టిన 62 గ్రామీణ అన్న కాంటీన్లలో ఆహార సబ్సి డీకిరోజుకు మరో రూ.18లక్షలు, ఏడాదికి రూ.58 కోట్లు అవుతుంది. కొత్త క్యాంటీన్ల నిర్మాణానికి రూ.43కోట్ల వ్యయం అయ్యింది. గడచిన 21నెలల్లో అన్నక్యాంటీన్లలో 8.80 కోట్ల భోజనాలు చేశారు. ఇప్పటి వరకూ అన్నక్యాంటీన్ సబ్సిడీకోసంరూ.243 కోట్ల మేర ఖర్చు చేశాం" అని ముఖ్యమంత్రి అన్నారు.

**పేదల పొట్టగొట్టిన గత పాలకులు:** "గత పాలకులు ఆకలి తీర్చే అన్నపూర్ణ వంటి అన్న క్యాంటీన్లపైనా దాడులు చేశారు. పేదల కడుపు నింపుతున్న పథకాన్ని నిలిపివేశారు. వ్యక్తులు, సంస్థలు స్వచ్ఛందంగా అన్నదానం చేస్తుంటే దానిలో మట్టి పోసి, దాడులు చేసి అడ్డుకున్నారు. వైసీపీకి కావాల్సింది విధ్వంసం, హింస, కూల్చడం, నరకడం, నాశనం చేయడమే. ఏ రాజకీయపార్టీ అయినా ప్రజలకు ఏం చేస్తామో చెబుతుంది. కానీ వైసీపీ మాత్రం రప్పా రప్పా చేస్తాం, 2029లో విధ్వంసం చూపిస్తాం అంటూ బెదిరింపులకు పాల్పడుతోంది. అందుకే ఆ పార్టీ పేరు గొడ్డలి పార్టీగా మార్చుకోవాలి. ఒక రాజకీయ పార్టీగా ఉండే అర్హత ఆ పార్టీకి లేదు అని "ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా ఇంఛార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే ప్రవీణ్, కలెక్టర్ కృతికా శుక్లా, తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లోకేష్

>> రాష్ట్ర కమిటీలో 50 మంది మహిళలకు అవకాశం ఇవ్వగా పొలిట్‌బ్యూరో, జాతీయ కమిటీ ల్లోనూ వారికి సముచిత స్థానం కల్పించారు. 2029ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని, నియోజకవర్గాల పున ర్విభజన, 33శాతం మహిళా రిజర్వేషన్లువంటి భవిష్యత్ పరిణామాలను అంచనా వేస్తూ ఈ కమి టీలను రూపొందించారని పల్లా శ్రీనివాసరావు వెల్లడించారు. ఈ నియామకాల ద్వారా నామినేటెడ్ పదవులు ఆశించిభంగపడిన వారికి న్యాయం చేశామని, పార్టీబలోపేతానికి ఈ మార్పులు దోహద పడతాయని ఆయన ధీమా వ్యక్తంచేశారు. 2029 ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని చంద్రబాబు కమిటీల కూర్పుచేశారు. యువ నాయకత్వానికి ప్రాధాన్యం ఇచ్చారు. నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణ, 33 శాతం మహిళారిజర్వేషన్ల నేపథ్యంలో కేటాయింపులుచేశారు. విధేయత, కష్టపడే తత్వం, అనుభవాన్ని పరిగణనలోకి తీసుకున్నారు. నామినేటెడ్ పోస్టుల్లో చోటు దక్కనివారికి పార్టీ పదవుల ద్వారా న్యాయం చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మహిళలకు పెద్ద పీట వేస్తూ కమిటీల కూర్పు చేశారు.

# ఇంటర్‌లో బాలికల హవా

>> పరీక్ష రాస్తే 25,151 మంది పాసై 74 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు.

**మే 21 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు :** ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 92 శాతంతో కృష్ణా, గుంటూరు 88 శాతం, ఎన్టీఆర్ జిల్లాలు 87 శాతంతో అగ్రస్థానంలో నిలిచాయి. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో చివరి స్థానంలో చిత్తూరు 71శాతం, వైఎస్సార్ 71 శాతం, అన్నమయ్య జిల్లాలు 67 శాతంతో నిలిచాయి. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో కృష్ణా 90 శాతం, గుంటూరు 88 శాతం, విశాఖ జిల్లాలు 85 శాతంతో అగ్రస్థానంలో నిలిచాయి. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో చివరి స్థానంలో వైఎస్సార్ 66 శాతం, నంద్యాల 66 శాతం, అన్నమయ్య జిల్లాలు 62 శాతంతో ఉన్నాయి.

**రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్:** కు ఏప్రిల్ 20 నుంచి 27వ తేదీ వరకూ అవకాశం ఉంది. మే 21 నుంచి జూన్ 4 వరకూ థియరీ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. జూన్ 7 నుంచి 11 వరకూ ప్రాక్టికల్ పరీక్షలు జరుగనున్నాయి. జూన్ 5న ఎథిక్స్, హ్యూమన్ వాల్యూ, జూన్ 6న పర్యావరణ విద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఫలితాలు ద్వారా పొందే అవకాశం ఉంది. మన మిత్ర వాట్సప్ నంబరు 9552300009 ద్వారాను ఫలితాలు చూసుకునే వెసులుబాటు కల్పించారు. ఫోన్ నంబరుకు హాయ్ అని సంక్షి ప్త సందేశం పంపించి, ఫలితాలు పొందే సదుపాయం కల్పించారు.



బుధవారం సిఎం క్యాంప్ కార్యాలయంలో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల నేతల భేటీ దృశ్యం

# మహిళా రిజర్వేషన్ బిల్లుకు కలిసి కట్టుగా మద్దతు

## సీఎం క్యాంప్ కార్యాలయంలో ఎన్డీయే భాగస్వామ్య పక్షాల నేతల భేటీ

**విజయవాడ,ఏప్రిల్ 15,ప్రభాతవార్తప్రతినిధి:** మహిళ రిజర్వేషన్ బిల్లుకు కలసి కట్టుగా మద్దతు తెలిపేం దుకు రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపు ఇచ్చారు. సీఎం క్యాంప్ కార్యాలయంలో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల నేతల భేటీ జరిగింది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు సమావేశంలో పలు అంశాలపై తమ అభిప్రాయాలు వ్యక్తం చేసారు. పార్లమెంటులో ప్రవేశపెడుతోన్న నారీ శక్తి వందన్ చట్ట సవరణ బిల్లుపై సమావేశంలో చర్చించారు. బిల్లు ఆమోదం పొందాక చేపట్టాల్సిన నారీ శక్తి విజయోత్సవాలు, కార్యాచరణపై ఎన్డీఏ పక్ష నేతల సమాలోచనలు చేసారు. ఇప్పటికే మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతివ్వాలని కోరుతూ రాష్ట్రంలోని వివిధ పార్టీల అధ్యక్షులకు, ఎంపీలకు ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు లేఖలు రాసారు.

# 40° పైనే ఉష్ణోగ్రతలు

**విజయవాడ ఏప్రిల్ 15 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ఎండ తీవ్ర ప్రభావం చూపుతుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. బుధవారం 275 మండలాలోల్ల 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు రికార్డు అయినట్లు ఆయన వెల్లడించారు. గురువారం మన్యం, పశ్చిమగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, పల్నాడు, మార్కాపురం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, కడప జిల్లాల్లో గరిష్ఠంగా 43-44డిగ్రీల సి, మధ్య ఉష్ణోగ్రతలు నమోదైందుకు అవకాశం ఉందన్నారు. వడగాలులు, ఎండ తీవ్రత, ఉక్కపోత పట్ల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శ్రీకాకుళం జిల్లా: బూర్జ, హిరమండలం, పాతపట్నం మండలాలు: విజయనగరం, గంట్యాడ, గుర్ల మెంటాడ, మెరకముడిదాం, నెల్లిమర్ల, రాజాం, రామభద్రాపురం, రేగిడి ఆమదాలవలస, సంతకవిటి తెర్లాం, వంగర మండలాలు పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట, గరుగుబిల్లి, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, కొమరాడ, కురుపాం, మక్కువ, పాచిపెంట, పాలకొండ, పార్వతీపురం, సాలూరు, సీతంపేట, సీతానగరం, వరఘట్టం మండలాలు అల్లూరి సీతారామారాజు జిల్లా అనంతగిరి మండలాల్లో తీవ్ర వడగాలులు, 67 మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందన్నారు.



# టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మరోమారు చింతకాయల విజయ్

## నిబద్ధతకు దక్కిన గుర్తింపు

**విశాఖపట్నం, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చింతకాయల విజయ్‌ను పార్టీ అధిష్టానం మరోసారి నియ మించింది. 2019 ఎన్నికల అనంతరం పార్టీ తీవ్ర కష్టకాలంలో ఉన్న సమయంలో జెండాను భుజాన వేసుకుని నిలబడిన యువ నాయ కులలో విజయ్ ఒకరు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఐటీడీపీ, సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి భయభ్రాంతులకు గురిచేసిన తరుణంలో, చంద్రబాబు, లోకేష్‌ల మార్గదర్శ కత్వంలో వారిని రక్షించే బాధ్యతను విజయ్ ధైర్యంగా స్వీకరించారు. చట్టపరంగా అలుపెర గని పోరాటం చేసి, సుమారు 228 మంది కార్యకర్తలకు బెయిల్ ఇప్పించి అండగా నిలిచారు. కార్యకర్తల కోసం అర్ధరాత్రి 2.30 వేళల్లో కూడా అందుబాటులో ఉండి ఆయన చేసిన కృషిని నారా లోకేష్ తన పాదయాత్రలో ప్రత్యేకంగా ప్రశంసించడం విశేషం. సంస్థాగత నిర్మాణంతో పాటు సాంకేతికతను పార్టీకి అను సంధానం చేయడంలో విజయ్ కీలక పాత్ర పో షించారు. ఐటీడీపీని రాష్ట్రవ్యాప్తంగా విస్తరిం చడమే కాకుండా, మన టీడీపీ యాప్‌ను విజయవంతంగా అమలు చేసి క్షేత్రస్థాయి కార్య కర్తలను నాయకత్వానికి చేరువ చేశారు. టెక్నా లజీ ఆధారిత మెంబర్‌షిప్ డ్రైవ్ బాధ్యతలను చంద్రబాబు నాయుడు స్వయంగా విజ య్‌కు అప్పగించడం ఆయనపై ఉన్న నమ్మకానికి నిదర్శనం. కోవిడ్ కష్టకాలంలో ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా సేవలు అందించడంతో పాటు జూమ్ కాన్ఫరెన్స్‌ల ద్వారా ప్రజలకు, పార్టీ శ్రేణులకు అండగా నిలిచారు. పదవుల కోసం ఆశపడ కుండా, కష్టకాలంలో కార్యకర్తల రక్షణే ధ్యే యంగా పనిచేసిన విజయ్‌కు తిరిగి ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పగించడం పట్ల పార్టీ శ్రేణుల్లో హర్షం వ్యక్తమవుతోంది. సాంకేతిక పరిజ్ఞానం, సంస్థాగత పట్టున్న విజయ్ వంటి నాయకులను భవిష్యత్తులో చట్టసభలకు పం పడం ద్వారా యువతకు, విధేయులకు పార్టీలో సముచిత స్థానం ఉంటుందనే బలమైన సందేశం వెళ్తుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.



బుధవారం సచివాలయంలో మీడియాతో మాట్లాడుతున్న సెన్సస్ అధికారి జె.నివాస్

# డిజిటల్ జనగణన 2027ప్రారంభం

## ఆంధ్రప్రదేశ్ జనగణన కార్యకలాపాల సంచాలకులు జె.నివాస్

**సచివాలయం,ఏప్రిల్ 15,ప్రభాతవార్త :** ప్రపంచంలోనే అతిపెద్ద గణాంక కార్యక్రమమైన జనగణన 2027 ప్రారంభానికి ఆంధ్రప్రదేశ్ రంగం సిద్దమైందని ఈనెల 16నుంచి మొదటి దశగా ఇండ్ల జాబితా మరియు ఇండ్ల గణన రాష్ట్రంలో ప్రారంభం కానుందని ఆంధ్రప్రదేశ్ జనగణన కార్యకలాపాల సంచాలకులు జె.నివాస్ తెలిపారు. దేశంలోనే అతిపెద్ద పరిపాలనా కార్యక్రమంగా నిలిచే ఈ జనగణన, ఈసారి పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించడంతో పాటు స్వీయ-గణన సదుపాయం కల్పించడం ద్వారా ప్రత్యేకతను సంతరించుకుందని ఆయన తెలిపారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలోని ప్రచార విభాగంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో విజయవాడ పిఐబి సంచాలకులు జి.సురేష్‌కుమార్‌తో కలసి ఆయన మాట్లాడుతూ భారతదేశంలో జనగణన ఒక రాజ్యాంగబద్ధమైన కార్యక్రమమని ఇది రాజ్యాంగంలోని 7వ షెడ్యూల్లో 69వ అంశంగా పేర్కొం బడిందన్నారు. 1948జనగణన చట్టం మరియు 1990నియమాల ప్రకారం ఇది నిర్వహించబడు తుం దన్నారు. సేకరించిన వ్యక్తిగత సమాచారం సెక్షన్ 15ప్రకారం పూర్తిగా గోప్యంగా ఉంచబడు తుందన్నారు. రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాల సహకారంతో ఈ ప్రక్రియ అమలు చేయబ డుతుందన్నారు. 2011లో చివరి జనగణన నిర్వహించగా, 2027లో జరగబోయేది 16వది కాగా, స్వాతంత్ర్యం తర్వాత 8వదని ఆయన తెలిపారు.

# టిడిపి జాతీయ ఉపాధ్యక్షుడిగా సానా సతీష్ బాబు



**విజయవాడ,ఏప్రిల్ 15,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబును పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా సానా సతీష్ బాబు పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమి టీలను ప్రకటించగా, మొత్తం 18 మంది సభ్యు లతో కూడిన జాతీయ ఉపాధ్యక్షుల బృందంలో సానా సతీష్ బాబుకు స్థానం కల్పిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాడర్ నుంచి లీడర్‌గా ఎదగడానికి అవకాశం తెలు గుదేశం పార్టీలోనే ఉంది. కష్టపడిన ప్రతి కార్య కర్తకు పార్టీ తప్పకుండా గుర్తింపు ఇస్తుంది" అని తెలిపారు. తన పై నమ్మకం ఉంచి ఈ బా ధ్యత అప్ప గించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## వారం - వర్జ్యం

16-04-2026, గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, కృష్ణపక్షం, అశ్విని కార్తె
చతుర్దశి రా.8.07
ఉత్తరాభాద్ర మ.1.54
వర్జ్యం : రా.12.57-రా.2.25
దు.ఉ.10.02-ఉ.10.52
2) మ.3.02-3.52
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:** రాజకీయనాయకులతో ముడిపడిఉన్న పనులను సాధ్యమైనంత త్వరగా ముగించుట చెప్పదగినది.

**వృషభం:** సంతానము విషయములో తీవ్రమైన ఆలోచనలు చేసి, కీలక నిర్ణయములను తీసుకుంటారు.

**మిథునం:** క్రమశిక్షణాయుతమైన జీవితానికి ప్రాముఖ్యతనిచ్చి లాభపడతారు. స్త్రీలతో విభేదాలు లాభించవు.

**కర్కాటకం:** ఊహించని ఆహ్వానాలు అందుతాయి. సంఘంలో గౌరవ ప్రతిష్ఠలు పెరుగుతాయి. ఋణాలు తీరుతాయి.

**సింహం:** ప్రేమ విషయములో నిదానం అవసరం. విదేశాల నుండి ఆహ్వానాలు అందుతాయి. నూతన ప్రయత్నాలు ఫలిస్తాయి.

**కన్య :** ఆత్మవిశ్వాసం, పట్టుదలతో ముందుకు సాగి పనులు పూర్తిచేస్తారు. పనులు నిదానంగా పూర్తిచేస్తారు.

**తుల :** ముఖ్యమైన వస్తువులు సకాలంలో కనబడకపోవడం కొంత ఇబ్బందిని కలిగిస్తుంది. సన్నిహితుల నుండి సమాచారాన్ని అందుకుంటారు.

**వృశ్చికం:** లక్ష్యసాధనలో ప్రతి బంధకాలు తప్పవు. భూవివాదాలు, కోర్టు కేసులు చికాకు పరుస్తాయి. బంధువుల కలయిక.

**ధనుస్సు:** ఆత్మీయుల సహకారంతో సమస్యలు కొంతవరకు తీరతాయి. గృహ నిర్మాణ యత్నాలలో తొందరపాటు వద్దు.

**మకరం:** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నా అవసరాలకు డబ్బు అందుతుంది. క్రయ విక్రయాలలో ప్రోత్సాహం.

**కుంభం:** శుభకార్య ప్రయత్నాలలో శుభ సూచనలు కనబడతాయి. ఇతరులకు మీవంతు సహాయం అందించగలుగుతారు.

**మీనం:** వ్యవహారాలలో విజయం సాధిస్తారు. మిత్రుల ద్వారా ధనలాభం పొందుతారు. ఉద్యోగులకు పదోన్నతులు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# మత్స్యకారుల సంక్షేమం విస్మరించిన ప్రభుత్వం

## మేం రాగానే సాగర్ డిఫెన్స్ కంపెనీని మరో చోటుకు తరలిస్తాం: జగన్



బుధవారం జువ్వలదిన్నె గ్రామంలో మత్స్యకారులతో ముఖాముఖిలో మాట్లాడుతున్న మాజీ సిఎం జగన్

**బిట్రగుంట (నెల్లూరు), ఏప్రిల్ 15, ప్రభాతవార్త :** రాష్ట్రంలో మత్స్యకారుల సంక్షేమాన్ని ముఖ్యమంత్రి చంద్ర బాబు నేతృత్వంలోని కూటమి సర్కార్ పూర్తిగా విస్మరించిందని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్సిపి రాష్ట్ర అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి విమర్శించారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా బోగోలు మండలం జువ్వలదిన్నె గ్రామంలో బుధవారం ఆయన షిప్పింగ్ హార్బర్‌ను సందర్శించి మత్స్యకారుల సమస్యలపై ముఖాముఖిగా మాట్లాడి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ ప్రభుత్వ హయాంలో మత్స్యకారుల సంక్షేమం కోసం వారు వలసలు వెళ్లకుండా నిరోధించేందుకు ఒకేసారి షిప్పింగ్ హార్బర్లు ఆరు ఫిష్ ల్యాండ్ సెంటర్లు 26 వేల కోట్ల రూపాయలు పెట్టుబడితో ప్రారంభించడం జరిగిందన్నారు. అందులో భాగంగా జువ్వలదిన్నె షిప్పింగ్ హార్బర్ 70 ఎకరాల్లో 289 కోట్ల రూపాయలతో రెండు సంవత్సరాల కిందట 90% శాతం పైగా పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటై రెండుసంవత్సరాలు పూర్తయిన జువ్వల దిన్నె షిప్పింగ్ హార్బర్‌ను భారత ప్రధాని నరేంద్ర మోడీ జాతికి అంకితం ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు మత్స్యకారులకు స్వాధీనపర్చలేదన్నారు. దీంతో ఎన్నో ఆశలు పెట్టుకున్న మత్స్యకారులు వారి ఉపాధి పై ఆందోళనచెందుతున్న సమయంలో, షిప్పింగ్ హార్బర్‌కు కేటాయించిన 70 ఎకరాల భూము ల్లో29.5ఎకరాలు సాగర్ డిఫెన్స్ ప్రైవేట్ కంపెనీకి దారాదత్తం చేయడం ఏమిటని ప్రశ్నించారు. తాము తిరిగి మూడు సంవత్సరాలలో మళ్లీ అధికారంలోకి వస్తామని అప్పుడు సాగర్ డిఫెన్స్ కంపెనీని మరోచోటకు తరలించి మత్స్యకారుల ఆస్తిని వారికే అప్పచెప్పుతామన్నారు. ఇదిలా ఉండగా ఇతర రాష్ట్రాలకు చెందిన మెరైన్ బోట్లు ఈ ప్రాంతంలో మత్స్య సంపదను దోచుకుంటుంటే మత్స్యకారులు ప్రాణాలు పణంగా పెట్టి 8 నెలల పాటు వాటిని కాపలా కాసారని అయితే రాష్ట్ర మంత్రి నారా లోకేష్ మార్చి 12న సాగర్ డిఫెన్స్ కంపెనీకి శంకుస్థాపన కొచ్చి వెళ్లిన తర్వాత ఆయన అనుమతితో ఈ ప్రాంతానికి చెందిన బీదా సోదరులు మరో ఇద్దరు కలిసి ఆ నాలుగు బోట్లను విడిపించేసారన్నారు. ఇందుకు సంబంధించిన కాల్ డేటాను కూడా ఆయన మత్స్యకారుల సమావేశంలో విలేకరులకు చూపించారు. ఈ సంఘటనపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి అసలైన బాధ్యులపై ప్రభుత్వం చర్యలు తీసుకోకుండా కేవలం కంటి తుడుపు చర్యగా పోలీస్ అధికారులను బదిలీ చేశారని విమర్శించారు. సభ వేదిక నుండి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉద్దేశించి జగన్మోహన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేస్తూ కళ్ళు మూసుకొని తెరుసుకునే లోగా మూడేళ్లు గడిచిపోతుందని మా ప్రభుత్వం వస్తుందని మీ బండారం అంతా బయట పెడతామని హెచ్చరించారు. చంద్రబాబు ప్రభుత్వం అన్ని రంగాల్లో పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ అని చెప్పి ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన తర్వాత తాము అమలు చేసిన సంక్షేమ పథకాలు అన్నీ కూడా రద్దు చేశారన్నారు. రాష్ట్రంలో ఏ ఒక్కరు కూడా సంతృప్తికరంగా లేరని పంటల బీమా అమలు కావడం లేదని, రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదని, మహిళలకు ప్రభుత్వ పథకాలు అందడం లేదని, విద్యా దీవెన అందడం లేదని, ఫీజు రీయింబర్స్మెంట్ అమలు కావడం లేదని, పేద ప్రజలకు ఆరోగ్యశ్రీ అంతక లక్షల రూపాయలు ప్రైవేట్ ఆస్పత్రికి అప్పులు చేసి ఖర్చు పెడుతున్నారని విమర్శించారు.

# కదిరిలో భారీ పేలుడు

>> ఓ ఇంటిని అద్దెకు తీసుకుని రోడ్లు, రాళ్లు కొడుతూ జీవనం సాగి స్తున్నారు. అయితే ఇంటిలో జెలిటిక్స్ ఉంచడంతో ఒక్కసారిగా ఇంటిలో మంటలు వ్యాపిం చడంతో అదుపు చేసేందుకు స్థానికులందరూ అక్కడికి పరుగులు పెట్టి మంటలు ఆర్పే ప్రయత్నం చేస్తుండగా ఒక్కసారిగా తీవ్రస్థాయిలో జెలిటిక్స్ పేలడంతో స్థానికులు ఎగిసి పడ్డారు. ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందగా, మంటలు పక్క ఇళ్లకు వ్యాపించడంతో మూడు ఇళ్లు పూర్తిగా దగ్ధం కాగా మరొక ఇల్లు పాక్షికంగా దెబ్బతినింది. పేలుడు జరిగిన ఇంటి పక్కలోనే నూతన భవనం నిర్మిస్తుండగా బేల్దారి పని చేయడానికి వచ్చిన నిరుపేదలు ఈ ఘటనలో మృతి చెందడం తీవ్ర విషాధాన్ని నింపింది. విషయం తెలుసుకున్న కదిరి డిఎస్పీ శివనారాయణస్వామి హుటాహుటిన తన సిబ్బంది, ఫైర్ సిబ్బందితో మంటలను అదుపు చేసేందుకు విశ్వ ప్రయత్నాలు చేశారు. మరింత ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా అద్దెకున్న తెలంగాణ రాష్ట్రం కొత్తగూడెంకు చెందిన వెంకన్న పరారీలో ఉన్నట్లు సమాచారం.

**బాధితులను పరామర్శించిన కదిరి ఎమ్మెల్యే కందికుంట :** జెలిటిక్స్ పేలుడు ఘటనలో మృతుల కుటుంబాలు, తీవ్రంగా గాయపడిన బాధితులను కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పరా మర్శించి వారు పడుతున్న వేదనను చూసి ఎమ్మెల్యే తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా అండగా ఉంటామని భరో సా కల్పించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అనంతరం ప్రమాద ఘటన ప్రదేశాన్ని ఎమ్మెల్యే అధికారులతో కలిసి పరిశీలించారు.

**బాధితులను ఆదుకుంటాం జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ :** ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలను, తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను ఆదుకుం టామని జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ పేర్కొన్నారు. ఎస్పీ సతీష్‌కుమార్‌తో కలిసి ఆయన కుమ్మరవాండ్ల పల్లిలోని ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీ లించారు. అనంతరం స్థానికులతో మాట్లాడి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

**ప్రమాద కారకులను గుర్తించి చర్యలు చేపడుతాం : జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్**
ప్రమాద కారకులను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లాఎస్పీ తీష్‌కుమార్ పేర్కొన్నారు. ప్రమాద ఘటన ప్రదేశాన్ని డిఎస్పీ శివనారా యణస్వామితో కలిసి క్షుణ్ణంగా పరిశీలించారు. క్లూస్ టీంతో పరిశీలించిన అనంతరం జెలిటిక్స్ పేలుడుతోనే ప్రమాదం సంభవించిందని, ప్రాథమిక అంచనాకు వచ్చినట్లు ఎస్పీ తెలిపారు.

**హోం మంత్రి అనిత ఆరా :** కుమ్మరవాండ్లపల్లిలో జెలిటిక్స్ పేలి, పేలుడు ప్రమాదంలో నలుగురు మృతి చెందడంపై రాష్ట్ర హోంశాఖ మంత్రి అనిత ఆరా తీసి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. ప్రమాద ఘటనపై జిల్లా కలెక్టర్ శాం ప్రసాద్, ఎస్పీ సతీష్‌కుమార్లతో ఫోన్‌లో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. తక్షణమే ప్రమాద ఘటన ప్రదేశానికి చేరుకుని సత్వర చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వం తరుపున బాధితులకు అండగా ఉంటామని హోం మంత్రి అనిత భరోసా కల్పించారు.

# వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూడి శ్రీహరి అరెస్ట్

## చంద్రబాబుపై అభ్యంతరకర పోస్టుల నేపథ్యంలో కేసు నమోదు



పూడి శ్రీహరి

**విజయవాడ,ఏప్రిల్ 15,ప్రభాతవార్తప్రతినిధి:** వైసీపీ మీడియా విభాగం ప్రధాన కార్యదర్శి, మాజీ సీపీఆర్ఓ పూడి శ్రీహరిని పోలీసులు అరెస్ట్ చేశారు. ముఖ్య మంత్రి చంద్రబాబుపై సోషల్ మీడియాలో వ్యతిరేక ప్రచారం చేస్తున్నారన్న ఆరోపణలపై ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. గతంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో శ్రీహరి సీపీఆర్ఓగా విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం వైసీపీ మీడియా విభాగంలో కీలక బాధ్యతల్లో ఉన్నారు. ఈ క్రమంలో సీఎం చంద్రబాబును కించపరిచేలా సోషల్ మీడియాలో యానిమేషన్ పోస్టులు పెట్టించారనే ఆరోపణలపై చిత్తూరు జిల్లాలో ఆయనపై కేసు నమోదైంది. చంద్రబాబు చేతిలో కత్తి ఉన్నట్లుగా యానిమేషన్ చేసి పోస్ట్ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కేసు ఆధారంగా రంగంలోకి దిగిన పోలీసులు పూడి శ్రీహరిని అదుపులోకి తీసుకున్నారు. ఆయన వద్ద నుంచి ఒక సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (మీడియా వింగ్), మాజీ సీపీఆర్వో పూడి శ్రీహరి అరెస్ట్ వ్యవహారం ఏపీ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ అరెస్ట్‌ను అక్రమంగా పేర్కొంటూ వైసీపీ నాయకత్వం అసహనం వ్యక్తం చేసింది. ఈ ఉదయం తాడేపల్లిలోని జగన్ నివాసంలో ఆయనను కలిసి తిరిగి వస్తుండగా, పోలీసులు మార్గమధ్యంలో శ్రీహరిని అదుపులోకి తీసుకున్నారని వైసీపీ నేతలు అంటున్నారు. శ్రీహరిని ఎక్కడికి తీసుకెళ్లారో చెప్పకుండా అక్రమంగా నిర్బంధించారని ఆరోపిస్తూ ఏపీ హైకోర్టులో హెబియస్ కార్పస్ లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేయనున్నట్టు వైసీపీ నేతలు తెలిపారు.

# బీహార్ సిఎంగా సామ్రాట్ చౌదరి ప్రమాణం

## ఇద్దరు ఉపముఖ్యమంత్రులు కూడా..

**పాట్నా, ఏప్రిల్ 15:** బీహార్ రాజకీయాల్లో ఒక చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా బిజెపి నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడింది. బీహార్ 24వ ముఖ్యమంత్రిగా బిజెపి సీనియర్ నేత సామ్రాట్ చౌదరి ప్రమాణ స్వీకారం చేశారు. పాట్నాలోని లోక్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ సయ్యద్ అతా హస్నైన్ ఆయనతో పదవీ ప్రమాణం చేయించారు. సామ్రాట్ చౌదరితో పాటు జెడియు సీనియర్ నేతలు విజయ్ కుమార్ చౌదరి, విజేంద్ర ప్రసాద్ యాదవ్ ఉప ముఖ్యమంత్రులుగా ప్రమాణం చేశారు. ప్రమాణ స్వీకారానికి ముందు సామ్రాట్ చౌదరి రాజ్‌వంశీ నగర్‌లోని హనుమాన్ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సామ్రాట్‌కు మాజీ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ శుభాకాంక్షలు తెలియజేశారు. బీహార్‌లో బిజెపి నుంచి సిఎం పదవి చేపట్టిన తొలి నాయకుడిగా సామ్రాట్ చౌదరీ రికార్డు సృష్టించారు. ప్రమాణస్వీకార కార్యక్ర మానికి మాజీ ముఖ్యమంత్రి, జెడియు అధినేత నీతీశ్ కుమార్‌తోపాటు పలు బిజెపి పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, జాతీయ నాయకులు హాజరయ్యారు.

# ఎసిబి కస్టడీకి దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతి

**విజయవాడ ఏప్రిల్ 15 ప్రభాతవార్త ప్రతినిధి:** దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతిని ఏసీబీ కస్టడీలోకి తీసుకుంది. ప్రస్తుతం విజయవాడ జైలులో జ్యుడిషయల్ రిమాండ్‌లో ఉన్న ఆమెను వైద్య పరీక్షల కోసం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం గొల్లపూడిలోని ఏసీబీ కార్యాలయంలో ఆమెను ప్రశ్ని స్తున్నారు. నేడు, రేపురెండ్రోజులపాటు ఆమెను ప్రశ్నించనున్నారు. ఆదాయానికి మించి ఆస్తుల కేసులో ఇటీవల శాంతిని ఏసీబీ అరెస్టు చేసారు. ఆమె వద్ద పట్టుబడిన ఆస్తులపై కస్టడీలో విచారించనున్నారు.



## సోషల్ మీడియా దుర్వినియోగంపై డిజిపి హరీష్ కుమార్ గుప్తా హెచ్చరిక

**- రెచ్చగొట్టే పోస్టులు పెట్టిన వారిపై**
**1,549 కేసులు - 1,344 మంది అరెస్ట్**

**విజయవాడ, ఏప్రిల్ 15,ప్రభాతవార్తప్రతినిధి:** సామాజిక మాధ్యమాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా పోస్టులు పెట్టేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా తీవ్రంగా హెచ్చరించారు. అసభ్యకరమైన, రాజకీయ ప్రేరేపిత, మత విద్వేషాలను రెచ్చగొట్టే పోస్టులు పెట్టేవారిని, వదంతులు వ్యాప్తి చేసేవారిని ఉపేక్షించేది లేదని ఓ పత్రికా ప్రకటనలో స్పష్టం చేశారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ, సామాజిక మాధ్యమాల్లో అసభ్యకరమైన, విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు పెట్టే వారిపై ఇప్పటివరకు 1,549 కేసులు నమోదు చేసి 1,344 మందిని అరెస్టు చేశామని తెలిపారు. చట్టవిరుద్ధమైన 4,529 కంటెంట్‌లను తొలగించామని చెప్పారు. ఇలాంటి చర్యలను అరికట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేకంగా ఖసోషల్ మీడియా మానిటరింగ్ సెల్స్ఖ ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్ వంటి ప్లాట్‌ఫామ్‌లపై ఈ బృందాలు నిరంతరం నిఘా ఉంచుతాయని డీజీపీ పేర్కొన్నారు. పదేపదే ఈ తరహా నేరాలకు పాల్పడే వ్యక్తులు, సంఘటిత బృందాలపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని వ్యవస్థీకృత నేరాలకు సంబంధించిన కఠిన చట్టాలను ప్రయోగిస్తామని హెచ్చరించారు. తప్పుడు సమాచారంతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను సహించబోమని ఆయన తేల్చిచెప్పారు.

## ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లో స్టాండప్ కమెడియన్ అనుదీప్‌ను అదుపులోకి తీసుకున్న ఏపి పోలీసులు

**విజయవాడ,ఏప్రిల్ 15, ప్రభాతవార్తప్రతినిధి:** పవన్, నిహారికల వ్యక్తిగత జీవితంపై అనుచిత వ్యాఖ్యల ఆరోపణలు చేసిన హైదరాబాద్‌కు చెందిన స్టాండప్ కమెడియన్ అనుదీప్ కటికలను ఏపీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఆయన కుటుంబ సభ్యులపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలతో ఉత్తరప్రదేశ్‌లో ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. జనసేన నాయకుడు బడే వెంకట కృష్ణ ఫిర్యాదు మేరకు కాకినాడ పోలీసులు ఈ చర్యలు చేపట్టారు. తన కామెడీ షోలో పవన్ కల్యాణ్ మూడు వివాహాలు, నిహారిక కొణిదెల విడాకులపై అనుదీప్ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీంతో కాకినాడ వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), ఐటీ చట్టంలోని పలు సెక్షన్ల కింద అనుదీప్‌పై పరువునష్టం, మహిళల గౌరవానికి భంగం కలిగించడం వంటి అభియోగాలు మోపారు. కుటుంబంతో కలిసి ప్రయాగ్‌రాజ్‌లో పర్యటిస్తుండగా పోలీసులు ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. అయితే, తన వ్యాఖ్యలు ఎవరినీ కించపరచడానికి కాదని, విడాకులపై సమాజంలో ఉన్న ధోరణిని ప్రశ్నించడమే తన ఉద్దేశమని అనుదీప్ గతంలోనే క్షమాపణ చెప్పారు. క్షమాపణ చెప్పినప్పటికీ, కేసు తీవ్రత దృష్ట్యా పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం అనుదీప్‌ను విచారణ నిమిత్తం కాకినాడకు తరలిస్తున్నట్లు సమాచారం. పూర్తి విచారణ అనంతరం తదుపరి చర్యలు తీసుకోనున్నారు.

# సోలార్ రూఫ్ టాప్ పనులు వేగవంతం చేయండి

- డిస్కంలకు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్
- త్వరలో అర్హులైన బిసిలకు సబ్సిడీపై సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు



**విజయవాడ, ఏప్రిల్ 15, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రం లోని ఎస్సీ, ఎస్టీ విద్యుత్ వినియోగదారుల కోసం ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన కింద, రాష్ట్ర ప్రభుత్వం యూటిలిటీ లెడ్ అగ్రిగేషన్ మోడల్‌ను అమలు చేస్తుందని ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు. సోలార్ రూఫ్ టాప్ లను ఏర్పాటు చేస్తోందని, ఈ పనులను రాష్ట్ర వ్యాప్తంగా మరింత వేగవంతం చేయాలని విద్యుత్ పంపిణీ సంస్థలను ఆదేశించారు. బుధవారం వెలగపూడి లోని సచివాలయం నుంచి డిస్కాం ల సీఎండీ లు పృథ్వీతేజ్ ఇమ్మడి, లోతేటి శివశంకర్, పుల్లా రెడ్డి, నెడ్ క్యాప్ వీసీ అండ్ ఎండీ కమలాకర్ బాబు తో పాటు డైరెక్టర్లు, సీఈ లు, జిల్లాల ఎస్ఈ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న సోలార్ రూఫ్ టాప్ పనుల పురోగతి పై సమీక్షించారు. ఈ సందర్భంగా కె.విజయానంద్ మాట్లాడుతూ, విద్యుత్ ఛార్జీల భారాన్ని తగ్గించే లక్ష్యంతో క్లీన్ ఎనర్జీ వైపు ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెలిపారు., ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన కింద, రాష్ట్ర ప్రభుత్వం ఖియూటిలిటీ లెడ్ అగ్రిగేషన్ మోడల్‌ను అమలు చేస్తూ, ఎస్సీ, ఎస్టీ విద్యుత్ వినియోగదారుల కుటుంబాల ఇళ్లపై సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేస్తోందని ఈ కార్యక్రమం, విద్యుత్ ఛార్జీల భారాన్ని తగ్గించడమే కాకుండా, రాష్ట్ర పర్యావరణ పరిరక్షణకు, స్థానిక ఉపాధి కల్పనకు కూడా దోహదపడుతుందని ఆయన చెప్పారు. ఇప్పటి వరకు ఈ కార్యక్రమం లో భాగంగా 20,636 కుటుంబాలపై సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేశామని, ఇందులో ఏపీ సీపీడీసీఎల్ పరిధిలో 5,027, ఏపీ ఈపీడీసీయల్ పరిధిలో 8,548, ఏపీ ఎస్పీడీసీఎల్ పరిధిలో 7,061 కుటుంబాలకు సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసినట్లు ( విజయానంద్ తెలిపారు. అదేవిధంగా రెగ్యులర్ స్కీమ్ లో భాగంగా ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా మూడు డిస్కాం ల పరిధిలో 1,29,562 కుటుంబాలకు సోలార్ రూఫ్ టాప్ కనెక్షన్లు ఇచ్చినట్లు ఆయన వివరించారు. రాష్ట్రంలోని మూడు డిస్కాం లకు నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత సమయానికి పూర్తి చేయాలని విజయానంద్ ఆదేశించారు.

## కుమ్మరవాండ్లపల్లి ప్రమాదంపై మాజీ సిఎం జగన్ దిగ్భ్రాంతి

**విజయవాడ,ఏప్రిల్ 15,ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీ సత్యసాయి జిల్లా కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లిలో జరిగిన ఘోర ప్రమాదంపై వైసీపీ అధినేత జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జిలెటిన్ స్టిక్స్, గ్యాస్ సిలిండర్లు పేలిన ఘటనలో ఐదుగురు ప్రాణాలు కోల్పోవడం మనసుని కలచివేసిందని అన్నారు. ఈ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని జగన్ తెలియజేసారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధితుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉండటం ఆందోళన కలిగిస్తోందని, పేలుడు ధాటికి ఇళ్లు కూడా ధ్వంసమవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే పేలుడు పదార్థాల నిల్వపై ప్రభుత్వం కట్టుదిట్టమైన నిఘా ఉంచాలని, నిబంధనలు అతిక్రమించిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలబడి, తగిన ఆర్థిక సహాయం అందించాలని సూచించారు. ఘటనా స్థలంలో సహాయక చర్యలు వేగవంతం చేయాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని పార్టీశ్రేణులకు, అధికారులకు విజ్ఞప్తి చేశారు.

## ఇంటర్ ఫలితాల్లో రికార్డు సృష్టించిన తాడిమర్రి కృష్ణ ప్రణీత్ రెడ్డి

**1000 మార్కులకు 984**
**అభినందించిన నలంద విద్యాసంస్థల ఉపాధ్యాయులు**



**అనంతపురం, ఏప్రిల్ 15, (ప్రభాతవార్త బ్యూరో)** ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ బోర్డు బుధవారం విడుదల చేసిన ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో అనంతపురంలోని నలంద జూనియర్ కళాశాలలో చదివిన తాడిమర్రి కృష్ణ ప్రణీత్ రెడ్డి అద్భుత ప్రతిభ కనబరిచారు. ప్రణీత్ రెడ్డి మొత్తం 1000 మార్కులకు గాను 984 మార్కులు సాధించి అత్యుత్తమ గ్రేడ్‌తో ఉత్తీర్ణుల య్యారు. అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించిన ప్రణీత్ రెడ్డిని తల్లిదండ్రులు రాచమల్ల నాగేశ్వరి, తాడిమర్రి బాల నారాయణరెడ్డి , ఇతర కుటుంబ సభ్యుల సంతోషానికి హద్దులు లేవు. కృష్ణ ప్రణీత్ రెడ్డి చిన్నప్పటి నుంచి చదువులో రాణిస్తూ నలుగురిలో శభాష్ అనిపించుకుంటున్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంతో పాటు రెండో సంవత్సరం కూడా మంచి మార్కులు రావడంతో నలంద విద్యా సంస్థల యాజమాన్యం, అధ్యాపకులు ప్రత్యేకంగా ప్రణీత్ రెడ్డిని అభినందించారు. ఇటీవల నిర్వహించిన జేఈఈ మెయిన్స్ లో కూడా మంచి ప్రతిభ కనబరిచి 91.90 శాతం మార్కులు సాధించారు. ఐఐటీ, ఎన్ఐటి లలో సీటు సంపాదించాలని ప్రణీత్ రెడ్డి పట్టుదలతో చదువుతున్నట్లు తండ్రి తాడిమర్రి బాల నారాయణరెడ్డి చెబుతున్నాడు. ప్రణీత్ రెడ్డి కాకుండా పదవ తరగతి, ఇంటర్ లో అద్భుత ప్రతిభ కనపర్చాలన్నారు.

## ఎన్.ఆర్.ఎన్. స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రారంభించిన మంత్రి నారా లోకేష్



క్రీడా అకాడమీల ప్రారంభోత్సవంలో మంత్రి లోకేష్ తదితరులు

**చంద్రగిరి, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:** దివంగత మాజీ ఎంఎల్ఏ నారా రామ్మూర్తి నాయుడు (ఎన్.ఆర్.ఎన్) స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను బుధవారం ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతులమీదుగా ప్రారంభోత్సవం చేశారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో రూ.3.20 కోట్లతో ఆధునిక సౌకర్యాలతో ఎన్ఆర్ఎన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను నూతనంగా నిర్మించారు. రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అనగాని సత్య ప్రసాద్, ఎంఎల్ఏ పులివర్తి నాని, శాప్ చైర్మన్ రవి నాయుడు, ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎంఎల్‌సి శ్రీకాంత్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడులతో కలసి నారా లోకేష్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ప్రారంభించారు.

అనంతరం కాంప్లెక్స్‌లోనికి వెళ్ళిన ఆయన క్రీడా క్రీడాకారులు పివి సింధు, కిదాంబి శ్రీకాంత్‌లతో కలసి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్,

ఆర్చరీ అకాడమీలను ప్రారంభించారు. అనంతరం కాంప్లెక్స్ ఎదుట హాకీతో గోల్ చేసి ప్రాంగణాన్ని ప్రారంభించారు.

# ఆకివీడు రామాలయం కేసులో హైకోర్టులో స్వయంగా వాదించిన రఘురామ కృష్ణంరాజు

**- రామాలయంపై ఎటువంటి ప్రతికూల ఉత్తర్వులు ఇవ్వని న్యాయస్థానం - రఘురామ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం - ప్రభుత్వం నుంచి అండర్‌టేకింగ్ కోరిన హైకోర్ట్**

**విజయవాడ, ఏప్రిల్ 15,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణరాజు ఆకివీడు రామాలయం అంశంపై బుధవారం హైకోర్టులో స్వయంగా హాజరై వాదనలు విన్పించారు. ఇదే అంశంపై విజయవాడలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడులో రామాలయం నిర్మాణం అనుమతులు లేకుండా జరుగుతోందని హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై స్పందించిన రఘురామ కృష్ణంరాజు స్వయంగా కోర్టుకు వెళ్లి తన వాదనలు వినిపించారు. విచారణ సందర్భంగా రామాలయం నిర్మాణం భక్తుల విరాళాలతో జరుగుతోందని తెలిపారు,అన్ని చట్టబద్ధ అనుమతులు తీసుకున్న తర్వాతే పనులు కొనసాగిస్తామని రఘురామ కోర్టుకు హామీ ఇచ్చారు. చట్టపరమైన నిబంధనలను పూర్తిగా పాటిస్తామని స్పష్టం చేశారు. ఈ కేసులో కోర్టు రామాలయంపై ఎటువంటి ప్రతికూల ఉత్తర్వులు ఇవ్వలేదని ఆయన తెలిపారు. ప్రభుత్వం తరఫు న్యాయవాదుల వాదనలు, తన వాదనలను కోర్టు పరిగణనలోకి తీసుకుందని చెప్పారు. అలాగే చట్టపరమైన నిబంధనలు పాటిస్తామని ప్రభుత్వం నుంచి అండర్ టేకింగ్ ఇవ్వాలని కోర్టు కోరగా, అందుకు ప్రభుత్వ న్యాయవాదులు అంగీకరించారని, దీంతో కేసు ముగించారన్నారు.



ఆలయం, చర్చి, మసీదు అన్న తేడా లేకుండా అన్ని మతపరమైన కట్టడాలకు చట్టం సమానంగా వర్తించాలన్నారు. ఏ నిర్మాణానికైనా కలెక్టర్ అనుమతి తప్పనిసరిగా ఉండాలన్నారు.

# తిరుమల సమాచారం

## మే 1 నుండి న్యూఢిల్లీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు



**తిరుమల,ఏప్రిల్ 15ప్రభాత వార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని దేశ రాజధాని న్యూఢిల్లీలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో మే 1వతేదీ నుండి 9వ తేదీ వరకు వేంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు ఏప్రిల్ 30న అంకురార్పణం జరుగనుంది. బ్రహ్మోత్సవాల ముందు భాగంగా ఏప్రిల్ 28న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం (ఆలయ శుద్ధి) నిర్వహిస్తారు. మే 01వ తేదీ రాత్రి 09.00 గంటల నుండి 10.30 గంటల మధ్య మిధున లగ్నంలో ధ్వజారోహణం నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతి రోజు ఉదయం 8.00 నుండి 9.00 గంటల వరకు, రాత్రి 7.30 నుండి 8.30 గంటల వరకు వాహనసేవలు జరుగనున్నాయి. మే 10వ తేదీ సాయంత్రం 6.00 నుండి రాత్రి 8.00 గంటల వరకు పుష్పయాగం నిర్వహించబడుతుంది. ఆలయంలో మేనెల 1న ఉదయం ధ్వజారోహణం, రాత్రి పెద్దశేష వాహనం,2న ఉదయం చిన్నశేష వాహనం, రాత్రి హంస వాహనం, 3న ఉదయం ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి సర్వభూపాల వాహనం ,4న ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి సర్వభూపాల వాహనం ,5వతేదీ ఉదయం మోహినీ అవతారం, సాయంత్రం కల్యాణోత్సవం, రాత్రి గరుడ వాహనం ,6వతేదీ ఉదయం హనుమంత వాహనం, రాత్రి గజ వాహనం ,7న ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనం ,మే 8న ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వ వాహనం 9వతేదీ ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణంతో పరిసమాప్తమవుతాయి.

## శ్రీవారి ఆశీస్సులతో అంతా శుభాలు కలగాలి

**- తిరుమలలో ఢిల్లీ సిఎం రేఖాగుప్త**



**తిరుమల,ఏప్రిల్ 15ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుని, ఆశీస్సులందుకోవడం ఆనందంగా ఉందని ఢిల్లీ సిఎం రేఖాగుప్త తెలిపారు. శ్రీవారి కరుణా కటాక్షాలు దేశంలోని ప్రజలందరికీ కలగాలని వేడుకున్నారు. సిఎం హోదాలో తొలిసారిగా కుటుంబంతో వచ్చిన ఆమెకు బుధవారం వేకువ జామున తోమాలసేవలో ఆలయ అధికారులు స్వాగతం పలికారు. ఆలయంలోపల ధ్వజస్తంభానికి నమస్కరించి శ్రీవేంకటేశ్వరస్వామి తోమాల సేవలో దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. తిరుమలేశుని దర్శనం మనసుకు ఉల్లాసం.

## కపిలేశ్వరుని దర్శనం - జీవితానికి పరమానందం

**-చాగంటి కోటేశ్వరరావు**



**తిరుమల,ఏప్రిల్ 15ప్రభాతవార్తప్రతినిధి:** ఆద్యాత్మిక నగరంలో ,తిరుపతి సప్తగిరుల క్రింద వెలసిన పవిత్ర క్షేత్రమైన కామాక్షి సమేత కపిలేశ్వరస్వామి దేవాలయాన్ని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు సందర్శించారు. అత్యంత పుణ్యప్రదమైన కపిలతీర్థంలో స్నానం చేయడం వల్ల దేవతలతో పాటు పితృదేవతలు సంతోషిస్తారని పురాణాలు తెలియజేస్తున్నాయని పేర్కొన్నారు. భక్తులు ముందుగా విఘ్నేశ్వరుని దర్శించుకుని, అనంతరం కామాక్షి సమేత కపిలేశ్వరస్వామిని దర్శించుకోవడం ద్వారా సంతానం, శ్రేయస్సు, కుటుంబ సుఖసంతోషాలు కలుగుతాయని వివరించారు. కాలభైరవ స్వామి, కోటలింగాలు, బిల్వ వృక్షం దర్శనం చేసి బయలుదేరితే మరింత శుభఫలితాలు లభిస్తాయని విశ్వాసం వెలిబుచ్చారు. ఆయన బుధవారం ఉదయం కుటుంబసమేతంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిటిడి మాజీ ఇఒ, మాజీ సిఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం, ఆలయ సూపరింటెండెంట్ కె.పి. చంద్రశేఖర్, అర్చకులు పాల్గొన్నారు.

## సామాజిక మాధ్యమాల్లో భక్తులను మోసగిస్తే కఠిన చర్యలు :టిటిడి హెచ్చరిక

**తిరుమల,ఏప్రిల్ 15ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమలలో శ్రీవారి దర్శనాలు, గదులు ఇప్పిస్తామంటూ కొందరు వ్యక్తులు సామాజిక మాధ్యమాల్లో భక్తులను నమ్మించి,మోసం చేస్తున్న దళారులపై కఠిన చర్యలు తీసుకునే దిశగా టిటిడి సిద్ధమైంది. అమాయక భక్తులను మోసగించి డబ్బులు వసూలు చేస్తున్న విషయాలపై నిందితులపై టిటిడి అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతోంది. ఇందులో భాగంగానే సామాజిక మాధ్యమాల్లో "శ్రావణ్ కళ తిరుమల, తిరుపతి వెంకటేశ్వర స్వామి దేవస్థానం" ఐడీతో భక్తులను మోసగిస్తున్న చిత్తూరుజిల్లా పెనుమూరుకు చెందిన కామసాని పవన్ కుమార్ అలియాస్ నాగరాజు, బోడిరెడ్డి చెన్నకేశవులు వ్యక్తులను టిటిడి విజిలెన్స్ ,తిరుమల పోలీసుల సమన్వయంతో అదుపులోకి తీసుకుని, రిమాండ్‌కు తరలించారు. సామాజిక మాధ్యమాల్లో భక్తులను మోసగిస్తున్న ఉదంతాలు పెరిగిపోతున్న దృష్ట్యా భక్తులు అప్రమత్తంగా ఉండాలని టిటిడి విజ్ఞప్తి చేసింది. టిటిడి అధికారిక మాధ్యమాల ద్వారానే దర్శనాలు, గదులు బుక్ చేసుకోవాలని భక్తులను కోరింది.

## టిటిడికి బ్యాటరీ బగ్గీ విరాళం



**తిరుమల,ఏప్రిల్ 15ప్రభాతవార్తప్రతినిధి:** ప్రతిరోజూ ఏడుకొండలస్వామి దర్శనానికి వస్తున్న భక్తుల్లో వృద్ధులు, దివ్యాంగులు దూరం నడవలేని పరిస్థితిలో అవసరమైన బ్యాటరీ వాహనాలను దాతలు తమవంతుగా విరాళాలిస్తున్నారు. బుధవారం ఉదయం కర్ణాటక కోలార్ కు చెందిన హైడ్రోకార్ట్ టెక్నో సొల్యూషన్స్ సంస్థ ఎండీ గణేష్ జయవేల్ 10 లక్షలు విలువైన బ్యాటరీ బగ్గీ వాహనాన్ని విరాళంగా అందించారు. శ్రీవారి ఆలయం ఎదురుగా వాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి తాళాలను ఆలయ పేష్కార్ రామకృష్ణకు అందజేశారు.

## ఎపి ఇంటర్ ఫలితాల్లో శ్రీచైతన్యకు రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు




**ఎంపిసిలో స్టేట్ టాపర్‌గా బి. గగన**

**హైదరాబాద్, ఎప్రిల్ 15, ప్రభాతవార్త:** ఎపి ఇంటర్ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యా సంస్థల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. పలువురు విద్యార్థులు స్టేట్ టాపర్లుగా నిలిచారు. జూనియర్ ఇంటర్ సిలబస్‌తోపాటు పరీక్షా ప్యాటర్న్ మారినప్పటికీ ఎంపిసి విభాగంలో 470 మార్కులకుగాను 469 మార్కులు సాధించిన శ్రీచైతన్య విద్యాసంస్థల విద్యార్థి బి. గగన స్టేట్ టాపర్‌గా నిలిచారు. ఇక బైపిసిలో 455 మార్కులకుగాను 452 మార్కులతో స్టేట్ టాపర్లుగా ఇద్దరు విద్యార్థులు నిలిచారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 1000 మార్కులకుగాను 992 మార్కులను ఆరుగురు విద్యార్థులు సాధించగా 991 మార్కులను 37 మంది విద్యార్థులు సాధించారు. ఇక జూనియర్ ఇంటర్ ఎంపిసి విభాగంలో 470 మార్కులకు గాను 469 మార్కులతో స్టేట్ ర్యాంకుతోపాటు 466 మార్కులపైన 129మంది విద్యార్థులు, 464 ఆపైన మార్కులను 1092 మంది విద్యార్థులు, 460పైన మార్కులను 3620 మంది విద్యార్థులు సాధించి టాపర్లుగా నిలిచారు. ఇక బైపిసి మొదటి సంవత్సరంలో 455 మార్కులకుగాను 452 మార్కులుతో ఇద్దరు విద్యార్థులు స్టేట్ టాపర్లుగా నిలవగా 450కి పైగా మార్కులను 132మంది సాధించారు. 440కి పైగా మార్కులను 1702 సాధించగా 435పైగా మార్కులను 2536 మంది, 430పైగా మార్కులను 2940 మంది సాధించారు. అదేవిధంగా ఇప్పటికే విడుదలైన జెఇఇ మెయిన్-2026 సెషన్ 1,2లో 300కి 300 మార్కులు సాధించిన ఇద్దరు తెలుగు విద్యార్థులు శ్రీ చైతన్య విద్యార్థులే కావడం విశేషం. ఈ సందర్భంగా శ్రీచైతన్య అకడమిక్ డైరెక్టర్ సుష్మ బొప్పన మాట్లాడుతూ... పటిష్టమైన విద్యా ప్రణాళిక కారణంగానే ఇంటర్‌లో తమ విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధిస్తున్నారని, జాతీయస్థాయి పోటీపరీక్షల్లో టాపర్‌గా నిలుస్తున్నారని అన్నారు. ఈ ఏడాది ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను, తల్లిదండ్రులను, అధ్యాపక, అధ్యాపకేతర బృందాన్ని అభినందించారు.

## టిడిపి రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్‌గా బి.వి. వెంకటరాముడు నియామకం

**వస్తున్నా మీకోసం, యువగళం పాదయాత్రలో కీలకంగా వ్యవహరించిన బి.వి.**



టిడిపి వర్కింగ్ ప్రెసిడెంట్ , మంత్రి లోకేష్ తో బివి వెంకట్రాముడు

**అనంతపురం, ఏప్రిల్ 15 ( ప్రభాతవార్త)** తెలుగుదేశం పార్టీ సంస్థాగత బలాన్ని మరింత పెంపొందించే దిశగా, పార్టీకి విశ్వసనీయంగా, సమర్థవంతంగా సేవలందిస్తున్న నాయకులకు తగిన గుర్తింపు ఇస్తోంది. ఈ మేరకు టీడీపీ అధిష్టానం కీలక నిర్ణయం తీసుకుంది. అనంతపురం అర్బన్ కు చెందిన బీ.వీ. వెంకటరాముడుని మరోసారి రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్‌గా బుధవారం నియమించింది. అంతేకాదు...మొదటి నుంచీ రాముడు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, యువనేత నారా లోకేష్‌కు అత్యంత సన్నిహితుడిగా మెలుగుతూ వస్తున్నారు. పార్టీ పట్ల విశ్వాసనీయత, అప్పగించిన పనిని చిత్తశుద్ధితో చేయడం బీవీ రాముడి మార్క్. దీంతో మరోమారు మీడియా బాధ్యతలను అప్పగించింది టీడీపీ అధిష్టానం. తెలుగుదేశం పార్టీకి దాదాపు మూడు దశాబ్దాలుగా అంకిత భావంతో పనిచేస్తున్నారు వెంకటరాముడు. తన రాజకీయ ప్రస్థానాన్ని 1996లో అనంతపురం పట్టణ కార్యదర్శిగా ప్రారంభించారు. అనంతరం పట్టణ ప్రధాన కార్యదర్శి, జిల్లా కార్యవర్గ సభ్యుడిగా, ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రచార కార్యదర్శిగా పలు బాధ్యతలు నిర్వహిస్తూ వచ్చారు. పార్టీ అప్పగించిన ప్రతీ బాధ్యతను కర్తవ్యనిష్టతో చేపట్టారు. ప్రతీ దశలోనూ తన ప్రతిభను బీవీ రాముడు చాటుకున్నారు. ముఖ్యంగా 2004 నుంచి 2021 వరకు పార్టీ ప్రచార వ్యవహారాలను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లారు.

ప్రజల్లో పార్టీ పట్ల విశ్వాసాన్ని పెంపొందించడంలో అత్యంత కీలకంగా వ్యవహరించారు. అలాగే అధినేత చంద్రబాబు నాయుడు నిర్వహించిన మీ కోసం రైతు పోరు బాట వస్తున్నా మీకోసం పాదయాత్ర వంటి ప్రజాహిత కార్యక్రమాలను విజయవంతం చేయడంలో పని చేశారు.

## ఐసిసిసి పనితీరుపై భక్తుల భద్రతకు టిటిడి కృషి భేష్

**- అభినందించిన ఢిల్లీ సిఎం రేఖాగుప్త**

**తిరుమల,ఏప్రిల్ 15ప్రభాతవార్తప్రతినిధి:** రోజువారీగా లక్షమందిపైగా తిరుమలలో భక్తుల రద్దీని సమర్థవంతంగా పర్యవేక్షించడానికి అందుబాటులో ఉన్న ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనితీరుపై ఢిల్లీ సిఎం రేఖాగుప్త పరిశీలించారు. బుధవారం ఉదయం ఆమె శ్రీవారి దర్శనానంతరం వైకుంఠమ్ 1లోని ఐసిసిసిలో ప్రెడిక్టివ్ అనలిటిక్స్ విధానం పనితీరుపై ఆమె స్వయంగా గమనించారు. టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి ఆమెకు ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనితీరును వివరించారు. లడ్డూ ప్రసాదం తయారీ, ట్రాఫిక్ నిర్వహణ, వసతి సదుపాయాల సమన్వయం వంటి అంశాల్లో ఈ సెంటర్ పనితీరును చక్కగా విశదీకరించారు.

దేశం నలుమూలల నుండి తిరుమలకు వస్తున్న భక్తుల భద్రతకు టిటిడి తీసుకుంటున్న అధునాతన సాంకేతిక పరిజ్ఞానం పనితీరుకు ఢిల్లీ ముఖ్యమంత్రి అభినందించారు.
ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యుడు భాను ప్రకాశ్ రెడ్డి ,ఐసిసిసి సిబ్బంది పాల్గొన్నారు.

వార్త

డబ్బు ఉన్నప్పుడు ఎడాపెడా ఖర్చు చేయడం, లేనప్పుడు ఇతరుల దగ్గర చేతులు చాచడం వల్ల మన వ్యక్తిత్వం దెబ్బతింటుంది.

- మహాత్మా గాంధీ

# నారీశక్తికి పట్టం!

లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ తో పాటు మహిళా రిజర్వేషన్ బిల్లులను కేంద్రం బూజుదులిపి బయటకు తీయడం ఆహ్వానించదగినదే కానీ ఆ రెండు బిల్లులనూ ఒకేసారి లింకు పెట్టడం విపక్షాలకు రుచించడం లేదు. ఇరవై ఏళ్లనాటి నుంచి మహిళా బిల్లు నలుగుతోంది. ఎన్నోసార్లు అటక మీద నుంచి దించారు. కొన్ని ఉత్తరాది పార్టీలు మహిళలకు పెత్తనం ఇవ్వడానికి అంగీకరించక అడ్డుపడిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఈసారి పెద్దగా అభ్యంతరం ఉండదని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రధాని మహిళా సాధికారత వలన దేశ కాలమాన పరిస్థితుల్లో మార్పులు వచ్చినందున మహిళలకు రాజకీయాల్లో 33శాతం సీట్లు కేటాయించడం సబబేనని పలు వేదికల్లో చెబుతున్నారు. దేశ నిర్మాణంలో కీలక పాత్రలు పోషించే అవకాశం దొరికిన ప్రతిసారీ మహిళానేతలు అద్భుతమైన పనితీరు ప్రదర్శిస్తున్నారు. రాష్ట్రపతి నుంచి కేంద్ర ఆర్థిక మంత్రివరకు మహళల పనితీరు చూస్తే అద్భుతంగా ఉందని వివరించారు. చట్టసభల్లో సముచిత ప్రాతినిధ్యం కోసం దశాబ్దాలుగా మహిళలు ఎదురుచూస్తున్నందున నేడు లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టడం స్వాగతించాల్సిన సందర్భం. ప్రస్తుత చట్టం ప్రకారం 2034 నుంచి మాత్రమే మహిళలకు రిజర్వేషన్లు కల్పించడానికి వీలవుతుంది. అందుకే తక్షణమే 2029నుంచి మహిళా రిజర్వేషన్లు అమలు చేసేందుకు వీలుగా నారీ శక్తి వందన్ అధినయమ్‌కు రాజ్యాంగ సవరణ చేసేందుకుగురువారం ముహూర్తంగా నిర్ణయించారు. భారతీయ మహిళలకు అన్ని అంశాల్లోనూ అగ్రస్థానంలో నిలిపేందుకు వీలుగా రాజ్యాంగ సవరణ చేయగలిగితే 2029నుంచి మహిళలకు అసెంబ్లీ, లోక్‌సభ సీట్లలో 33శాతం వారికి దక్కుతాయి. వీటి కోసమే ప్రత్యేకించి మూడు రోజుల పాటు పార్లమెంటు సమావేశాలు నిర్వహించేందుకు ప్రధాని కంకణం కట్టుకున్నారు. లోక్‌సభ స్థానాలు 816కు పెంచగలిగితే వాటిల్లో మహిళల వాటాగా273స్థానాలు రిజర్వు అవుతాయి. ఇంతదాక రాజకీయ వారసత్వమున్న కుటుంబాల్లోని మహిళలకే అరకొరగా సీట్లు దక్కుతుండేవి. ఈసారి రాజకీయేతర కుటుంబాలలోని మహిళలకు కూడా ప్రజాసేవ చేసే అవకాశం లభిస్తుంది. ఇది రాజకీయాల్లో మేలు మలుపు. ఇదే సందర్భంలో పనిలోపనిగా లోక్‌సభ స్థానాల రిజర్వేషన్ల బిల్లు కూడా ప్రవేశపెట్టడం వలన మహిళల భాగస్వామ్యం బాగా పెరుగుతుంది. ఇప్పటికే దేశవ్యాప్తంగా 14లక్షల మందికిపైగా మహిళలు స్థానిక పాలనలో తర్ఫీదు పొందారు. 21 రాష్ట్రాల్లోని పంచాయతీల్లో మహిళల భాగస్వామ్యం దాదాపు 50 శాతానికి చేరుకుందన్న సమాచారం ఉంది. 2023లోనే పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లుకు అందరూ ఆమోదించినా అమలు వరకూ చేరుకోలేదు. అంతక్రితం కాదనుకున్న రాజకీయ పార్టీల్లో కూడాసానుకూలత ఏర్పడినందునే ఆ బిల్లు పాస్ అయింది. దానికిప్పుడు రాజ్యసభలో కూడా సంపూర్ణ సానుకూలత సాధించి బిల్లుపాస్ అయ్యే స్థాయికి చేరుకుంది. మహిళా బిల్లు విషయంలో ఇప్పుడు ఏపార్టీకి అభ్యంతరం లేదు. ఈచట్టం అమలుపై అన్ని విపక్ష పార్టీలతో సమగ్ర చర్చనిర్వహించే విషయంలో కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వానికి ఏ మాత్రం ఆసక్తి లేదని ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ఆరోపిస్తున్నారు. అయితే తమ నేతృత్వంలోనే మహిళలకు అగ్రతాంబూలం లభిస్తోందని చెప్పుకోవాలనే తపనతో భారతీయ జనతా పార్టీదేశవ్యాప్తంగా అన్నిప్రాంతాల్లోమహిళా సదస్సులు నిర్వహించ తలపెట్టింది. ఏప్రిల్16 నుంచి మూడు రోజులపాటు జరిగే పార్లమెంటు సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ల బిల్లు చట్టరూపం దాల్చుతుంది. మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్ బిల్లుకు ముడిపెట్టి సభ ముందుకు తెచ్చేప్రక్రియను మాత్రమేకాంగ్రెస్, తదితర విపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి. డీలిమిటేషన్ బిల్లుకు సంబంధించి దక్షిణాదిరాష్ట్రాల ఎంపీలలో తీవ్రఅభ్యంతరాలున్నాయి. మహిళా బిల్లుకు ఓకె చెప్పినా, పునర్విభజన బిల్లును అంగీకరించేందుకు కాంగ్రెస్, డిఎంకె, టిఎంసి వంటి పార్టీలు సిద్ధంగాలేవు. ఆయాపార్టీల సభ్యులకు పార్టీలు విప్‌లు జారీ చేశాయి. లోక్‌సభ సీట్లను 543 నుంచి 816 సీట్లకు పెంచడం వలన దక్షిణాది రాష్ట్రాలతోపాటు చిన్నరాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం తీర్మానించింది. దాని మీద ఎన్నోవిశ్లేషణలు కూడాజరిగాయి. 2027 జనాభా లెక్కలు జరిగే సమ యంలో ఆదరాబాదరాగా ప్రవేశపెడుతున్న డీలిమిటేషన్ ప్రక్రియను మాత్రమే వ్యతిరేకిస్తున్నట్లు సోనియాగాంధీ వివరిస్తున్నారు. ఏదిఏమైనా అనేక అభ్యంతరాలున్న మహిళా రిజర్వేషను బిల్లుపై కాలక్రమంలో అందరికీ సానుకూల పరిస్థితులు కల్పించగా, డీలిమిటేషన్ బిల్లు మాత్రం రాజకీయ ఉద్దేశంతో తెచ్చినదిగా భావించి విపక్షాలు అప్పుడేనా? అంటున్నాయి. చట్టసభల సీట్లను పెంచే డీలిమిటేషన్ విషయంపై అనేక అంశాలు ముడిపడినందున అధ్యయనం చేసేందుకు రాజకీయ పార్టీలకు సమయం సరిపోనం దున మరిన్ని రోజులు గడువు కావాలని కాంగ్రెస్ కోరుతోంది. రాజ్యాంగంలోని 82వ అధికరణం మేరకు 'జనగణన' తర్వాతనే జనాభా ప్రాతిపదికనే సీట్లు సర్దుబాటు జరగాలి. కొద్ది రోజులో జనగణన పూర్తవవుతున్న సందర్భంలో 'ఆగమేఘాలపై డీ లిమిటేషన్' బిల్లు ప్రవేశపెట్టడంలో ఔచిత్యం ఏమిటంటూ డిఎంకె అధినేతస్టాలిన్ కూడా నిరసన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత సీట్ల నిష్పత్తికి విరుద్ధంగా ఏమీ జరగదని ప్రధాని భరోసా ఉండనే ఉంది. ఎట్నుంచి ఎటు వచ్చినా మహిళలకు పట్టం కట్టడం మాత్రం ఖాయం.



రచయిత ఆవేశం రచన చేసేవరకే కాదు, సమాజం మారే వరకూ ఉండాలి.

చార్లెస్ డీగాల్



నిజాన్ని ధైర్యంగా ఎదుర్కోవాలి, అప్పుడు అబద్ధాలను ఆశ్రయించాల్సిన అవసరమే ఉండదు.

జ. ఇలియెట్

## ప్రజావాక్కు



### ఎకో టూరిజం

ప్రకృతి ఒడిలోసేదతీరాలని కోరుకునే పర్యాటకుల సంఖ్య పెరుగుతున్న తరుణంలో, పర్యావరణానికి హాని కలగకుండా ప్రకృతిని ఆస్వాదించే 'ఎకో టూరిజం'కు ప్రాధాన్యత ఇవ్వడం అత్యవసరం. అభివృద్ధి పేరుతో అడవులను నరికి కాంక్రీట్ కట్టడాలు నిర్మించడం వల్ల జీవవైవిధ్యం దెబ్బతింటోంది. కావున, సహజ వనరులను సంరక్షిస్తూనే పర్యాటక రంగాన్ని బలోపేతం చేయడం మన తక్షణకర్తవ్యం. ఇదిపర్యావరణ పరిరక్షణతో పాటు స్థానిక ప్రజల ఆర్థిక స్వావలంబనకు వారధిలా పనిచేస్తుంది. ఈకో టూరిజం వల్ల అడవులు, వన్యప్రాణుల సంరక్షణ సాధ్యమవుతుంది. పర్యాటక ప్రాంతాలను ప్లాస్టిక్ రహిత మండలాలుగాప్రకటించడం, విద్యుత్‌వాహనాలను ప్రోత్సహించడం వంటి చర్యలు పర్యావరణ సమతుల్యతను కాపాడతాయి. స్థానిక హస్తకళలను ప్రోత్సహించడం ద్వారా గ్రామీణ ఆర్థికవ్యవస్థ బలపడుతుంది. పర్యావరణ పర్యాటకం విద్యార్థులలో ప్రకృతి పట్ల అవగాహన పెంచే సాధనంగా ఉపయోగపడాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### సీట్లను తగ్గించకూడదు

డీలిమిటేషన్ పేరిట దక్షిణాది రాష్ట్రాలకు ఉన్న సీట్లను తగ్గించాలని కేంద్రంలో ఉన్న ఎన్డీయే కూటమి ఆలోచన చేయడం అన్యాయం. ఒకవేళఅలా జరిగితే ఉభయసభల్లో మనవాయిస్ తగ్గుతుంది, గుర్తింపు బలహీనం అవుతుంది. కాబట్టి సీట్లు పెంచుకోవడానికి ప్రయత్నించాలి తప్ప తగ్గించాలని చూడొద్దు. జాతీయ నిర్ణయాలతో దక్షిణ భారత రాష్ట్రాల పాత్ర తగ్గకూడదు. ఈవిషయంపై ప్రస్తుతం ఉన్న దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఏకతాటిపై ఉండి న్యాయం చేకూర్చేలా కృషి చేయాలి. లేకుంటే మన రాష్ట్రాలకు రానున్న రోజుల్లో కోలుకోలేని దెబ్బ తగిలే అవకాశం ఉంది.

- మణిదీప్ పద్మనాభుని, ఊటుకూరు

### మహిళా సంఘాలకు విద్య అవసరం

మహిళా పొదుపు సంఘాలకు ఆర్థికపురోగతి కోసం ప్రభుత్వం కృషిచేస్తుంది. ఈ మధ్యకాలంలో పెట్రోల్ పంపుల నిర్వహణ బాధ్యతతో మహిళాసంఘాలు అభివృద్ధి సాధిస్తాయి. కనీసం సంతకం, బ్యాంకులో డబ్బులు పొదుపు చేయడం, మినిట్స్ బుక్స్ రాయడం, లెక్కలు చేయడం కోసం చదువు అవసరం.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్‌జిల్లా

### డేంజర్‌గా మారుతున్న డేటింగ్ యాప్‌లు

ఈ డిజిటల్ యుగంలో ప్రేమ, స్నేహం, సంబంధాలు కనుగొనడం సులభమైంది. టిండర్, బంబుల్, హింజ్ వంటి డేటింగ్ యాప్‌లు స్వైప్ చేసి మ్యాచ్ అయితే చాలు – ప్రేమ కథ మొదలవుతుందని యువత భావిస్తోంది. కానీ వాస్తవం భిన్నం. ఈయాప్‌లుడేంజర్‌గామారుతున్నాయి. క్యాట్‌ఫిషింగ్, ఫైనాన్షియల్ స్కామ్‌లు, సెక్స్‌టార్షన్, స్టాకింగ్, హరాస్‌మెంట్ నుంచి మర్డర్ వరకు – డేటింగ్ యాప్‌లు నేరస్థులకు హంటింగ్ గ్రౌండ్‌గా మారాయి. తెలంగాణలోనే 2025లో 569 మంది డేటింగ్ యాప్ స్కామ్‌లకు బలై, సుమారు 3 కోట్ల రూపాయలు కోల్పోయారు. ఇది కేవలం అంకెలు కాదు యువత భవిష్యత్తు, మానసిక ఆరోగ్యం, భద్రతపై ముప్పు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డేటా ప్రకారం, 2025లో డేటింగ్ యాప్ ఫ్రాడ్‌లు గణనీయంగా పెరిగాయి. 61 శాతం విక్టిమ్‌లు 1835 ఏళ్ల మధ్య యువకులు. యువత జాగ్రత్తగా ఉండాలి.

- ఎల్లబోయిన వెంకటేశ్వర్లు, హైదరాబాద్

### పర్యావరణాన్ని కాపాడుకోవాలి

ఎండాకాలంలో ఎండవేడిమికి చెట్ల ఆకులు అప్పుడప్పుడు రాలిపోతుంటాయి. ఎక్కువగా రాలిపోయిన ఆకులను అనేకులు తగలబెడుతూ పర్యావరణానికి హాని చేకూరుస్తున్నారు. రాలిన ఆకులు తేలికగా భూమిలో కలిసిపోయి పూర్తి పర్యావరణ హితమైనవి. రాలిన ఆకులను వ్యర్థం చేయకుండా తిరిగి ఉపయోగిస్తే ప్రయోజనమే కాక పర్యావరణానికి పాటుపడిన వాళ్ళం అవుతాం. రాలిన ఆకులను నీటిలో కొన్ని రోజులు నానబెట్టి సేంద్రియ ఎరువుగా వాడుకోవచ్చు. రాలిపోయిన ఆకులను చెట్ల మొదళ్లలో వేయటం వల్ల చెట్లకు పోసిన నీరు గాలిలో త్వరగా ఆవిరి కాకుండా చెట్లకు రక్షణగా ఉంటాయి. రాలిన ఆకులను కొన్ని రోజులు ఎండబెట్టి పొడిగా చేసి కూడా చెట్లకు ఎరువుగా మార్చవచ్చు.

- కె. రామకృష్ణ, నల్గొండ జిల్లా

### ఇది మొబైల్ ఫోన్ యుగం

ప్రతి రోజు వాడే వస్తువులలో చరవాణి ఒకటి. సాంకేతిక పరిజ్ఞానం, వినియోగానికి సంబంధించినఅనేక అంశాలు మనకు మనమే తెలుసుకోవచ్చు. కానీ మనం ఇతరులపై అంటే నెట్ కార్యాలయాలు, మీసేవ కార్యాలయాలపై ఆధారపడి మన సమయం వృథాతోపాటు నూతనంగా తెలుసుకోలేకపోతున్నాం. ప్రతిదీ ప్రయత్నిస్తేనే కదా ఎలా ముందుకెళ్లగలమో తెలిసేది. ఇకనైనా తెలుసుకుందాం.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

# నియామక ప్రక్రియ మరింత మెరుగుపడాలి

**కేవలం అడ్మిట్ కార్డ్ నెంబర్ పేర్కొనడం వలన ఫలితాల నమోదులో సంభవించే చిన్నపాటి పొరపాట్ల వలన అభ్యర్థుల భవిష్యత్తు తలకిందు లు అవుతుంది. అదేవిధంగా ఎంపికయ్యే అభ్యర్థుల ఓఎమ్మార్ కాపీ అందరికి అందుబాటులో ఉండాలి. తెలంగాణా పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రస్తుతం ఈ పద్ధతి అవలంబి స్తోంది. అదేవిధంగా జనరల్ ర్యాంకింగ్ లిస్ట్ కూడా ప్రధాన పరీక్షల ఫలితాల విడుదల రోజునే విడుదల చేయాలి. ప్రస్తుతం ఎపిపియస్సీ మార్కుల విడుదలతో మీనమేషాలు లెక్కిస్తోంది. కోర్టులో కేసుల పెండింగ్ ఉన్నాయన్న కారణంతో మార్కులు వెల్లడించట్లేదు. ఇలాంటి కారణాలు అసంబద్ధం. అభ్యర్థి తన మార్కులతోపాటు ఎంపికైన అభ్యర్థుల మార్కులు తెలుసుకోవడం పారదర్శకతలో భాగం అని సుప్రీంకోర్టు ఇటీవల కాలంలో తేల్చి చెప్పింది. జాబ్ కేలండర్ అనేది తొలి అడుగు మాత్రమే. నోటిఫికేషన్ విడుదల మొదలు అంతిమ ఫలితాల వెల్లడి నియామక పత్రాల జారీ వరకు అడ్డంకి లేకుండా వేగంగా పూర్తి కావాలంటే అంటే సమూల మార్పులు అవసరం.**

జి.వి.సాయికుమార్ గుంత

ఎన్నికల హామీలను నెరవేర్చే ప్రక్రియ లో భాగంగా కూటమి ప్రభుత్వం జాబ్ కేలండర్ విడుదలతో ప్రభుత్వ ఉద్యోగార్థుల మోములో సంతోషం నెలకొన్నది. కొత్త జోనల్ వ్యవస్థ అమలుతో పాటు నియామక ప్రక్రియలు త్వరితగతిన పూర్తి చేసేందుకు మంత్రి నారా లోకేష్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం శుభపరిణామం. గత అనుభవాల దృష్ట్యా నియామక ప్రక్రియలో కొన్ని సమూల మార్పులు, సంస్కరణలు చేయడం అత్యంత ఆవశ్యకం. ప్రభుత్వ ఉద్యోగ నియామక ప్రక్రియలో తీవ్ర జాప్యానికి ప్రధాన కారణం కోర్టు కేసులేనని అనుకుంటుంటాము. కానీ వాటి నేపథ్యం గమనిస్తే ఎన్నో సాంకేతిక కారణాలే వాటికి కారణమని తేటతెల్లమౌతోంది. గతంలో నియామక ప్రక్రియపై నమోదైన కేసుల సరళిని పరిశీలిస్తే ముఖ్యంగా ప్రశ్నాపత్రం లో తప్పులు, 'కీ' లో తప్పుడు సమాధానాలకు మార్కులు ఇవ్వడం లాంటివి ప్రధానం. అధునాతన సాంకేతిక కాలంలో కూడా తర్జుమాలో తప్పులు దొర్లడం అసమర్థతకు నిదర్శనం. ఇవి పూర్తిగా నిరోధించగలిగే పొరపాట్లు. 2011 గ్రూప్1 కేసు సుప్రీంకోర్టు వరకు వెళ్లి ప్రధాన పరీక్ష రద్దు కాబడి మరల నిర్వహించడానికి మూల కారణం 'కీ' లో కూడా తప్పులు దొర్లడమే. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రశ్న పత్రం 'కీ' తయారీలో శ్రద్ధ వహిస్తే ఈ అంశంపై నమోదయ్యే కేసులు నివారించొచ్చు. అదే విధంగా రిజర్వేషన్ రోస్టర్ పద్ధతిలో కూడా ఎలాంటి పొరపాట్లు జరగకుండా ఆయా శాఖాధిపతులు జాగరూకతతో ఉండాలి. వారు పంపే రోస్టర్ సంఖ్యల ఆధారంగానే కమిషన్ నోటిఫికేషన్‌లో ఖాళీల వివరాలు పొందుపరుస్తుంది. ఈ అంశంలో కమిషన్ పాత్ర కన్నా ఆయా శాఖల పాత్ర కీలకం. వారు చేసి చిన్నపాటి పొరపాట్లు చివరికి నోటిఫికేషన్ రద్దయ్యే పరిస్థితిలు వస్తాయి. ప్రస్తుతం విశ్వవిద్యాలయాల నోటిఫికేషన్ కోర్టులో నానుతుండడంతో ప్రభుత్వం వాటిని వెనక్కి తీసుకోవాలని యోచిస్తోంది. ఇక్కడ అధికారులు చేసే పొరపాట్లు వలన ఏళ్ల తరబడి కష్టపడే అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. మరో వైపు పరీక్షల నిర్వహణలో ఏ చిన్నలోపం ఉన్నా కూడా నోటిఫికేషన్‌కే ఎసరు వస్తుంది. నోటిఫికేషన్‌లో పేర్కొన్న నిబంధనలు తూచా తప్పకుండా పాటిస్తూ మరో వైపు ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా నిర్వహించాలి. తెలంగాణ గ్రూప్1 దీనికి మంచి ఉదాహరణ. కేవలం బయోమెట్రిక్ తీసుకోలేదని తెలంగాణ హై కోర్టు ప్రిలిమ్స్ పరీక్షను రద్దు చేసిన విషయం విదితమే. ఈ సందర్భంగా 2016 గ్రూప్2 నోటిఫికేషన్ గురించి ప్రస్తావించాలి. దాదాపు పదేళ్ల అయినప్పటికీ ఆ నోటిఫికేషన్ కి సంబంధించిన కేసు కోర్టులో పెండింగ్‌లోనే ఉంది. ఎస్సెస్సీ, బ్యాంకింగ్ పరీక్షలతో పోల్చుకుంటే గ్రూప్ పరీక్షల ఆద్యంతాల గురించి చెప్పలేని పరిస్థితి. కమిషన్ ముందుగానే తాత్కాలిక తేదీలు ప్రకటిస్తే అభ్యర్థుల్లో ఒక అంచనా ఉంటుంది. ముఖ్యంగా ఉద్యోగం చేస్తూ సన్నద్ధం అయ్యేవారికి ఇది ఉపయక్తంగా ఉంటుంది.



గ్రూప్ 2 పరీక్ష సైతం ఆన్లైన్‌లో నిర్వహణకు చర్యలు తీసుకోవాలి. రాబోయే గ్రూప్2 ప్రాథమిక పరీక్షకు ఆరు లక్షల మంది హాజరయ్యే అవకాశం ఉంది కాబట్టి ఆన్లైన్‌లో నిర్వహణ సాధ్యం కాదు. కాని ప్రధాన పరీక్షను ఆన్లైన్‌లో నిర్వహణకు ఆస్కారం కనపడుతోంది. ప్రిలిమ్స్ నుంచి ప్రధాన పరీక్షకు ఎంత మందిని అనుమతించాలనేది జీవో 5 ప్రకారం ప్రస్తుతం ఎపిపియస్సీ విచక్షణగా ఉంది. ఈ విచక్షణతో ఫలితాల వెల్లడికి ముందు కాకుండా నోటిఫికేషన్ విడుదల సమయంలోనే ఉపయోగించాలి. క్రితంసారి గ్రూప్1, 2లో ప్రశ్నపత్రం కఠినంగా ఉండటంతో అభ్యర్థులు ఎక్కువ నిష్పత్తితో ప్రధాన పరీక్షకు అనుమతించాలని పెద్ద ఎత్తున అభ్యర్థనలు ఇచ్చారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలి అంటే ముందుగానే నిష్పత్తి నిర్ణయించి అది కూడా కేవలం 1:15 మాత్రమే ఉండేలా చూడాల్సిన అవసరం ఉంది. ఎక్కువ మంది అభ్యర్థుల్ని అనుమతించడం వలన ఎక్కువ కాలం పాటు ఈ ప్రక్రియ పెండింగ్‌లో ఉండిపోయి మరేయితర పరీక్షల సన్నద్ధతకు వీలుండదు. ఎపిపియస్సి నిర్వహించే పరీక్షల్లో గ్రూప్1 మినహా ఇతర నియామక పరీక్షలకు ప్రధాన పరీక్ష పిదప సిపిటి పరీక్షకు హాజరు కావాల్సి ఉంది. ఆయా కమ్యూనిటీ పరంగా కనీస మార్కులు సాధిస్తేనే అంతిమ ఎంపికలో పరిగణలోకి తీసుకుంటారు. ప్రిలిమ్స్ ప్రధాన పరీక్షల్లో తీవ్రమైన పోటీ తట్టుకుని అర్హత సాధించిన అభ్యర్థుల్ని కేవలం సిపిటిలో ఉత్తీర్ణత లేదని అభ్యర్థుల్ని పరిగణనలోకి తీసుకోనకపోవడం అనేది సహేతుకం కాదు. ఈ సిపిటి వలన సమయం వృధాతప్ప ఎటువంటి ఎటువంటి ప్రయోజనం లేదు. ఎంపిక కాబడిన అభ్యర్థి తన ప్రొబేషన్‌లో ఉద్యోగానికి కావాల్సిన అర్హతలు సమకూర్చుకుంటారు. మొన్న జరిగిన సిపిటి పరీక్ష విధానం కూడా లోపభూయిష్టంగా ఉంది. ప్రత్యేక సాఫ్ట్వేర్‌లో నిర్వహించకుండా కేవలం మొక్కుబడిగా నిర్వహించారు. రాష్ట్రస్థాయి మార్కులు సాధించిన ఓఅభ్యర్థి సిపిటిలో ఉత్తీర్ణత లేదని ఎంపిక చేయకపోవడంతో సగటు అభ్యర్థుల్లో ఆందోళన నెలకొన్నది. అంతిమ ఫలితాల వెల్లడిలో ఎపిపియస్సి పారదర్శకత పాటించట్లేదు. సెలక్షన్ నోటిఫికేషన్‌లో కేవలం ఎంపికయ్యే అభ్యర్థుల హాల్ టికెట్ నెంబర్లు మాత్రమే పేర్కొనడం వలన పారదర్శకత లోపిస్తుంది. ఎంపికైన అభ్యర్థుల పేరు, మార్కులు, కమ్యూనిటీ, లింగం, ప్రాంతం మొదలగు కనీస వివరాలు పేర్కొనాలి. సామాజిక తనిఖీకి ఇవి అత్యవసరం. కేవలం అడ్మిట్ కార్డ్ నెంబర్ పేర్కొనడం వలన ఫలితాల నమోదులో సంభవించే చిన్నపాటి పొరపాట్ల వలన అభ్యర్థుల భవిష్యత్తు తలకిందులు అవుతుంది. అదేవిధంగా ఎంపికయ్యే అభ్యర్థుల ఓఎమ్మార్ కాపీ అందరికి అందుబాటులోఉండాలి. తెలంగాణా పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రస్తుతం ఈ పద్ధతి అవలంబిస్తోంది. అదేవిధంగా జనరల్ ర్యాంకింగ్ లిస్ట్ కూడా ప్రధాన పరీక్షల ఫలితాల విడుదల రోజునే విడుదల చేయాలి. ప్రస్తుతం ఎపిపియస్సీమార్కుల విడుదలతో మీనమేషాలులెక్కిస్తోంది. కోర్టులో కేసుల పెండింగ్ ఉన్నాయన్న కారణంతో మార్కులు వెల్లడించట్లేదు. ఇలాంటి కారణాలు అసంబద్ధం. అభ్యర్థి తన మార్కులతోపాటు ఎంపికైనఅభ్యర్థుల మార్కులు తెలుసుకోవడం పారదర్శకతలో భాగం అని సుప్రీంకోర్టు ఇటీవల కాలంలో తేల్చిచెప్పింది. జాబ్ కేలండర్ అనేది తొలి అడుగు మాత్రమే. నోటిఫికేషన్ విడుదల మొదలు అంతిమ ఫలితాల వెల్లడి నియామకపత్రాల జారీవరకు అడ్డంకిలేకుండావేగంగా పూర్తి కావాలంటే అంటే సమూల మార్పులు అవసరం. ●

# సాదా బైనామాలకు భూభారతి శాశ్వత పరిష్కారమా?

తిప్పర్తి శ్రీనివాస్

తెలంగాణ రాష్ట్రంలో భూముల కొనుగోలు–అమ్మకాల వ్యవస్థ చాలా కాలంగా వివాదాలు, అనిశ్చితులు, చట్టపరమైన సమస్యలతో ముడిపడి ఉంది. ముఖ్యంగా 'సాదా బైనామాలు' అనే వ్యవహారం గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా ప్రాచుర్యం పొందింది. రిజిస్ట్రేషన్ లేకుండా పరస్పర అంగీకారంతో జరిగే ఈ లావాదేవీలు ఎన్నో కుటుంబాలకు ఆస్తి హక్కుల విషయంలో చిక్కులు తెచ్చాయి. ఇప్పుడు ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'భూభారతి' వంటి డిజిటల్ వ్యవస్థలతో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందాఅన్న ప్రశ్న సమాజంలో చర్చనీయాంశంగా మారింది. సాదాబైనామాల చరిత్రను పరిశీలిస్తే, ఇది ఒక అవసరంనుంచి పుట్టుకొచ్చిన విధానం. గతంలో రిజిస్ట్రేషన్ ఖర్చులు అధికంగా ఉండటం, పరిపాలనా వ్యవస్థలో పారదర్శకత లేకపోవడం, పేద రైతులకు సులభమైన మార్గాలు లేకపోవడం వంటివి ప్రజలను ఈ విధానానికి దారి తీసాయి. ఫలితంగా, ఒక కాగితం మీద ఒప్పందం చేసుకొని భూములను కొనుగోలు చేయడం సాధారణంగా మారింది. అయితే, ఈ విధానం చట్టబద్ధత లేకపోవడంతో భవిష్యత్తులో అనేక సమస్యలకు కారణమైంది. వారసత్వ వివాదాలు, డూప్లికేట్ అమ్మకాలు, అక్రమ ఆక్రమణలు వంటి సమస్యలు విస్తరించాయి. ఇలాంటి పరిస్థితుల్లో భూమి రికార్డులను సమగ్రంగా డిజిటలైజ్ చేయడం ద్వారా పారదర్శకతను పెంచాలని ప్రభుత్వం భావించడం సహజమే. ఈక్రమంలో భూభారతి వంటి వ్యవస్థలు ప్రవేశపెట్టడం ఒక సానుకూలమైన అడుగు. భూమి యజమాన్యం, సరిహద్దులు, లావాదేవీల చరిత్ర వంటి వివరాలు ఒకే వేదికలో అందుబాటులో ఉంటే, అవకతవకలకు అవకాశం తగ్గుతుంది. ముఖ్యంగా, ప్రతి లావాదేవీ రిజిస్ట్రేషన్ ద్వారా మాత్రమే జరగేలా చేస్తే, సాదా బైనామాల అవసరం తక్కువ అవుతుంది. అయితే, ఇక్కడ ఒక ముఖ్యమైన ప్రశ్న నిలుస్తుంది. ఇప్ప



టికే జరిగిన సాదా బైనామాల పరిస్థితి ఏమిటి? వేలాది ఎకరాల భూములు ఇప్పటికీ ఇలాంటి అనధికారిక ఒప్పందాల ఆధారంగా వినియోగంలో ఉన్నాయి. భూభారతి వ్యవస్థ ప్రవేశపెట్టడం వల్ల కొత్తగా జరిగే లావాదేవీల్లో నియంత్రణ సాధ్యమవుతుందేమో గానీ, పాత సమస్యలు సులభంగా పరిష్కారం కావు. దీనికి ప్రత్యేక విధానాలు అవసరం. ప్రభుత్వం ఒక సమగ్ర సర్వే చేపట్టి, సాదా బైనామాల ద్వారా భూములు కొనుగోలు చేసిన వారికి ఒక అవకాశం ఇవ్వాలి. నిర్దిష్ట కాలపరిమితిలో వారి ఒప్పందాలను చట్టబద్ధం చేసుకునే అవకాశం కల్పిస్తే, అనేక వివాదాలు తగ్గవచ్చు. తక్కువ ఫీజుతో, సులభమైన ప్రక్రియతో రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పిస్తే ప్రజలు ముందుకు వస్తారు. లేకపోతే, భూభారతి వ్యవస్థ ఉన్నప్పటికీ పాత సమస్యలు అలాగే కొనసాగుతాయి. ఇంకా ఒక ముఖ్యమైన అంశం ప్రజల్లో అవగాహన. డిజిటల్ వ్యవస్థలు ప్రవేశపెట్టడం మాత్రమే సరిపోదు, వాటి వినియోగంపై ప్రజలకు స్పష్టమైన అవగాహన ఉండాలి. గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ సదుపాయాలు, శిక్షణ, సహాయక కేంద్రాలు ఏర్పాటు చేయడం అత్యవసరం. లేకపోతే, మధ్యవర్తులు మళ్లీవ్యవస్థను దుర్వినియోగం చేసే అవకాశముంది. మరోవైపు, భూభారతి వంటి వ్యవస్థల అమలులో సాంకేతిక లోపాలు, డేటా తప్పిదాలు కూడా పెద్ద సమస్యలుగా మారే ప్రమాదం ఉంది. ఒకసారి డేటా తప్పుగా నమోదుఅయితే, దాన్ని సరిచేయడం కష్టతరం అవుతుంది. అందువల్ల, డేటా ఖచ్చితత్వం, ఫిర్యాదు పరిష్కార వ్యవస్థలు బలంగా ఉండాలి. సారాంశంగా చెప్పాలంటే, భూభారతి వంటి ఆధునిక వ్యవస్థలు భూమి లావాదేవీలలోపారదర్శకతను పెంచేశక్తి కలిగిఉన్నా, సాదా బైనామాల సమస్యకు పూర్తిస్థాయి పరిష్కారం ఇవ్వాలంటే సమగ్ర దృష్టి అవసరం. పాత లావాదేవీలకు చట్టబద్ధత కల్పించడం, ప్రజల్లో అవగాహన పెంపు, సాంకేతిక వ్యవస్థల పటిష్ఠత వంటి అంశాలు కలిసివస్తేనేసమస్య కు శాశ్వతపరిష్కారం సాధ్యమవుతుంది. అందువల్ల, భూభారతి ఒక ప్రారంభంమాత్రమే పరిష్కారంకాదు. ప్రభుత్వం, పరిపాలన, ప్రజలు ముగ్గురూ కలిసిపనిచేస్తేనే భూమి వ్యవహారాల్లోన్యాయం, పారదర్శకత, స్థిరత్వం సాధ్యమవుతాయి. ●

# మధ్య ప్రాచ్యంలో శాంతి నెలకొనేదెప్పుడు?



సుంకవల్లి సత్తిరాజు

మధ్య ప్రాచ్యంలో చెలరేగిన యుద్ధాగ్ని జ్వాలలు ప్రపంచానికి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. అగ్రదేశానికి అధిపతినన్న అహంకారం ట్రంప్‌లోని యుద్ధకాంక్షను, పైశాచికత్వాన్ని బహిర్గతం చేసింది. ప్రపంచ దేశాలన్నీ తనకు బానిసత్వం చేయాలని, అలాకాని పక్షంలో ఆయా దేశాల ఆర్థిక మూలాలను దెబ్బతీసి, వారి బలహీనతలను ఆసరాగా చేసుకుని తన దేశ ఖజానా నింపుకోవాలని చేసే ప్రయత్నంలో భాగంగానే డోనాల్డ్ ట్రంప్ అనేక వివాదాలకు, యుద్ధాలకు కేంద్ర బిందువుగా మారుతున్నారు. రెండవ సారి అధ్యక్ష పీఠం అధిష్టించిన ట్రంప్‌లో ఆధిపత్య జాడ్యం నరనరాన జీర్ణించుకుపోయింది. ఫక్తు వ్యాపారవేత్త ఉన్నత పదవులను అలంకరిస్తే ఎలా ఉంటుందో ట్రంప్ నిరూపించాడు. టారిఫ్‌లను పెంచి ట్రేడ్ వార్‌తో ప్రపంచ దేశాలను పాదాక్రాంతం చేసుకోవాలనే దురుద్దేశ్యంతో రెచ్చిపోయిన ట్రంప్‌కు అమెరికా న్యాయస్థానం చివాట్లు పెట్టింది. ట్రంప్ తమను బానిసలుగా భావిస్తున్నారనే అవమానం అమెరికా మిత్ర దేశాలను బాధించింది. ఈ క్రమంలోనే యూరోపియన్ యూనియన్ దేశాలు అమెరికాను తిరస్కరించి, భారత్‌తో ట్రేడ్‌డీల్ కుదుర్చుకున్నాయి. నాటోను పేపర్ టైగర్‌గా అభివర్ణించిన ట్రంప్‌కు నాటో కూటమి దేశాలు ఇరాన్ యుద్ధ సమయంలో మొండి చేయి చూపించడం గమనార్హం. రష్యా ఉక్రెయిన్‌ల మధ్య జరుగుతున్న యుద్ధం వలన ఇప్పటికే ఆ ఇరుదేశాలు తీవ్ర వినాశనాన్ని చవి చూసాయి. లక్షలాది మంది మరణించినా రష్యా ఉక్రెయిన్ల మధ్య యుద్ధం ఇంకా కొనసాగుతూనే ఉంది. ఈలోగా మధ్య ప్రాచ్యంలో మరో యుద్ధం సంభవించి, ప్రపంచ దేశాలకు ముచ్చెమటలు పట్టిస్తున్నది. ఎంకి పెళ్ళి సుబ్బిచావు కొచ్చిందనే విధంగా ప్రపంచంలో జరుగుతున్న యుద్ధాల వలన యుద్ధాలకు సంబంధం లేని దేశాలు అతలాకుతలమైపోతున్నాయి. అమెరికా అహానికి ఇజ్రాయిల్ ఆజ్యం పోయడం వలనే పశ్చిమాసియా భగ్గుమంటున్నది. కేవలం ఒకటి రెండు రోజుల్లో యుద్ధాన్ని ముగించి, ఇరాన్‌లో కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని తలంచిన అమెరికాకు ఇరాన్ తనదైన శైలిలో గుణపాఠం నేర్పింది. అమెరికా ఆధునిక టెక్నాలజీ, అధునాతన యుద్ధ పరికరాలను, క్షిపణులను, యుద్ధ విమానాలను ఇరాన్ కూల్చి వేయడాన్ని అమెరికా జీర్ణించుకోలేకపోయింది. ఇరాన్ డ్రోన్లు అమెరికా ఆయుధ సంపత్తిని హరించాయి. ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయిల్ దేశాలు ప్రారంభించిన జాయింట్ ఆపరేషన్ వలన జరుగుతున్న విధ్వంసాన్ని ఆపడంలో జాప్యం జరిగే కొద్దీప్రపంచం తీవ్రఆర్థిక సంక్షోభంలోకి జారుకోవడంతథ్యం. ఎపిక్ ఫ్యూరీ పేరుతో అమెరికా, ఆపరేషన్ రోరింగ్ లయన్ పేరుతో ఇజ్రాయిల్ దేశాలు ఇరాన్‌పై క్షిపణుల వర్షం కురిపించగా ఇరాన్ కూడా'ఆపరేషన్ ట్రూ ప్రామిస్ 4' పేరుతో



ఇరు దేశాలకు పట్టపగలే చుక్కలు చూపించింది. అమెరికా ఈ యుద్ధంలో ఘోర పరాజయాన్ని చవి చూసింది. హార్ముజ్ జలసంధి ఇరాన్ యుద్ధ వ్యూహానికి కేంద్రంగామారింది. అమెరికా ఆర్థికంగా తీవ్ర స్థాయిలో దెబ్బతినడం, అమెరికాలో వెల్లువెత్తిన ట్రంప్ వ్యతిరేక ప్రదర్శనలు, ప్రపంచ వ్యాప్తంగా ట్రంప్‌కు వ్యతిరేక పవనాలు వీయడంతో ఏదో ఒక విధంగా ఈ యుద్ధాన్ని ముగించాలని పాకిస్థాన్‌తో మధ్యవర్తిత్వం నడిపించినా ఫలితం నిరాశాజనకంగానే మారింది. ఉగ్రవాద దేశమైన పాక్‌లో అమెరికా ఇరాన్ దేశాల మధ్య శాంతి చర్చలు జరగడం, అమెరికా ఉపాధ్యక్షుడు జెడివాన్స్ ఇరాన్ ప్రతినిధి బృందంతో 21గంటల పాటు సుదీర్ఘమంతనాలు సాగించినా చర్చల్లో ప్రతిష్టంభన ఏర్పడడం పరిస్థితిని మొదటికి తీసుకు వచ్చింది. ఇరాన్ ప్రాచీన చరిత్రనునాశనం చేస్తానని, పాత రాతియుగం వైపు ఇరాన్‌ను తీసుకు పోతానని శపథం చేసిన ట్రంప్ రెండువారాల కాల్పుల విరమణను ప్రకటించి శాంతి ప్రతిపాదనలతో ఇరాన్‌ను ఒప్పించడానికి పాక్‌ను మధ్యవర్తిగా నియమించడం జరిగింది. ఇస్లామాబాద్‌లో శాంతి చర్చలు విఫలం కావడంతో ట్రంప్ మళ్ళీ ఇరాన్‌ను నాశనం చేస్తానంటూ పాత పాట పాడడమే కాకుండా, హార్ముజ్ జలసంధిని విముక్తి చేస్తానంటూ ప్రతినబూని, హార్ముజ్ జలసంధి మీదుగా ఇరాన్ నౌకాశ్రయాలకు వెళ్ళే అన్నిసముద్ర మార్గాలను తమ నియంత్రణలోకి తెచ్చుకుంటునట్టు చేసిన ప్రకటన ద్వారా పరిస్థితులు తీవ్ర ఉద్రిక్త స్థాయికి వెళ్ళాయి. హార్ముజ్ స్ట్రయిట్‌లో సీమైన్స్ తొలగిస్తామని చెప్పడం ఆచరణ సాధ్యమని చెప్పలేం. శాంతి చర్చలు విఫలం కావడంలో ఇజ్రాయిల్ పాత్ర ఉన్నట్టు ఇరాన్ ఆరోపించింది. తమ ప్రతిపాదనలకు అంగీకరించకపోవడంఇరాన్‌కే నష్టమని జెడివాన్స్ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా పాకిస్థాన్ దౌత్యాన్ని ఇరాన్ విశ్వసించలేదని అవగతమవుతున్నది. అమెరికా తొత్తుగామారిన పాక్‌వలన ఒరిగేదేమీఉండదు. అమెరికా సూచనలతోనే ఇరాన్‌ను దెబ్బతీయడానికి సౌదీకి భారీ బలగాలను పాక్ పంపుతున్నట్టుగా భావించాలి. అమెరికాకు మద్దతునిస్తున్న గల్ఫ్ దేశాలను ఇరాన్ విడిచిపెట్టదన్న విషయం విదితమే. "సౌత్ పార్స్ గ్యాస్ ఫీల్డ్" పై దాడి చేసిన ఇజ్రాయిల్ చర్యకు ప్రతీకారంగా ఖతార్‌లో గల 'రాస్ లఫాన్ ఇండస్ట్రియల్ సిటీ'లోని ఎల్ఎన్జీజీ ఉత్పత్తి క్షేత్రంపై ఇరాన్ భారీ స్థాయిలో విరుచుకుపడిన ఉదంతం జ్ఞప్తికి తెచ్చుకోవాలి. విద్యుత్ కేంద్రాల పైన, నీటి వసతుల పైన దాడులు చేస్తామని బెదిరించిన ట్రంప్ ఉన్మాదాన్ని ఇరాన్ ప్రజలు భారీ మానవ హారంగా ఏర్పడి భగ్నంచేసిన సంగతి తెలిసిందే. ఇరాన్ చేసే ఒంటరి పోరాటంలో చివరికి ఇరాన్ పూర్తిగా విధ్వంసం కాకతప్పదా? అలా జరిగిననాడు ఇరాన్ తన పొరుగునున్న దేశాలను విడిచి పెడుతుందా? ఇలాంటి సందేహాలెన్నో తలెత్తుతున్నాయి. అయతుల్లా ఖమేనీ అంతం తర్వాత ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్(ఐఆర్‌జీసీ) 'ట్రూత్‌ఫుల్ ప్రామిస్ 4ఖి ఆపరేషన్ పేరుతో గల్ఫ్‌లో గల అమెరికా స్థావరాలను, లక్ష్యంగా చేసుకుని ధ్వంసం చేస్తున్నది. ఏది ఏమైనప్పటికీ ఇప్పటికే ప్రపంచ దేశాలు చమురు కొరతతో ఒక వైపు తీవ్ర ఇబ్బందులకు గురౌతుంటే, పెరిగిన ద్రవ్యోల్బణం బ్రతుకు దెరువును కష్టతరంగా మార్చింది. ఇస్లామాబాద్‌లో జరిగిన చర్చలు విఫలం కావడంతో అమెరికా ఇరాన్ దేశాలు పరస్పరం మాటలతో కత్తులు దూసుకుంటున్నాయి. ఇజ్రాయిల్ అధ్యక్షుడు బెంజిమన్ నెతన్యాహూ కూడా యుద్ధ విరమణకు సుముఖంగా లేరనే విషయం సుస్పష్టం. ఇజ్రాయిల్ శల్యసారథ్యమే ట్రంప్‌ను ఇబ్బందులకు గురి చేస్తున్నది. ఇప్పటికైనా ప్రపంచ దేశాలు ఐక్యమై ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్‌లు సాగిస్తున్న యుద్ధాన్ని నిలువరించాలి. ●

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

ong-5_ong-5.qxd 4/15/2026 10:51 PM Page 1



ప్రకాశం



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# ఒంగోలు కార్పొరేషన్‌లో గందరగోళం..

- కమిషనర్ సెలవు వెనుక అసలు కారణాలపై చర్చ ! - సెలవులు తర్వాత కమిషనర్ విధులకు హాజరవుతారా లేక కొత్త కమిషనర్ నియామకం జరుగుతుందా ?

**ఒంగోలు క్రైమ్, ప్రభాతవార్త**

ఒంగోలు నగరపాలక సంస్థలో పారిశుధ్య నిర్వహణపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ విషయాన్ని ప్రతిపక్షాలు కాదు, స్వయంగా ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు పలుమార్లు కౌన్సిల్ సమావేశాల్లో ప్రస్తావించడం పరిస్థితి తీవ్రతను స్పష్టంగా చూపిస్తోంది. నగరంలో చెత్త నిర్వహణ అధ్వానంగా ఉండటం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా సమస్యలు పెరుగుతున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.ఎమ్మెల్యే ఆదేశాలు ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం పరిస్థితిని మరింత క్లిష్టంగా మారుస్తోంది. "ఇలాగైతే ఎలా?" అంటూ పలుసార్లు అధికారులపై ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. నగరంలోని పలు ప్రాంతాల్లో చెత్త సేకరణ సరిగా జరగకపోవడం, వీధులు అపరిశుభ్రంగా ఉండడం ప్రజల్లో అసంతృప్తిని పెంచుతోంది.ఇదే సమయంలో నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు 31 రోజులపాటు దీర్ఘకాలిక సెలవులోకి వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. అధికారికంగా అనారోగ్య కారణాలు చెబుతున్నప్పటికీ, ఎమ్మెల్యేతో పొసగకపోవడమే అసలు కారణమనే ప్రచారం జరుగుతోంది. కొన్ని విభాగాల పనితీరు మెరుగుపడకపోవడం, పారిశుద్ధంపై వచ్చిన విమర్శలు ఈ విభేదాలకు దారి తీసినట్లు తెలుస్తోంది.హడ్కో రుణాల వ్యవహారంలోనూ కమిషనర్ నిర్లిప్తతపై విమర్శలు ఉన్నాయి. రూ.100 కోట్లకు పైగా రుణాలను సమర్థంగా వినియోగించుకోవడంలో వైఫల్యం చోటుచేసుకుందనే అసంతృప్తి వ్యక్తమవుతోంది. ప్రజా సమస్యల పరిష్కారంలో ఆలస్యం, ఎమ్మెల్యే సిఫార్సులకు స్పందన లేకపోవడం కూడా విభేదాలకు కారణమయ్యాయని అంటున్నారు.గత కలెక్టర్ తమీమ్ అన్సారియా, ప్రస్తుత కలెక్టర్ రాజాబాబు కూడా




నగర పారిశుద్ధంపై పలు సందర్భాల్లో అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ప్రస్తుతం పాలకవర్గం గడువు ముగియడంతో కలెక్టర్ రాజాబాబు ప్రత్యేకాధికారిగా బాధ్యతలు చేపట్టి యంత్రాంగంపై పర్యవేక్షణ పెంచారు. ప్రతి అంశంపై క్షుణ్ణంగా సమీక్ష చేస్తూ అధికారులను ప్రశ్నిస్తున్నారు.ఈ పరిణామాల మధ్య కమిషనర్ 15 రోజుల బదులు అనూహ్యంగా 31 రోజుల సెలవులోకి వెళ్లడం మరిన్ని అనుమానాలకు తావిస్తోంది. ఆయన తిరిగి బాధ్యతలు చేపడతారా? లేక కొత్త కమిషనర్ నియామకం జరుగుతుందా? అన్నది ఇప్పుడు కీలక ప్రశ్నగా మారింది. ఒంగోలు నగర పాలక సంస్థలో జరుగుతున్న ఈ పరిణామాలు రాజకీయంగా కూడా చర్చనీయాంశంగా మారాయి.

## టీడీపీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేష్..

- శుభాకాంక్షలు తెలిపిన దామచర్ల జనార్దన్ రావు

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



తెలుగుదేశం పార్టీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన నారా లోకేష్‌కు ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్‌రావు హార్ధిక శుభాకాంక్షలు తెలిపారు. యువ నాయకత్వంతో టీడీపీ మరింత బలోపేతం అవుతుందని ఆయన పేర్కొన్నారు.లోకేష్ నాయకత్వంలో పార్టీ యువతను ఆకర్షిస్తూ కొత్త దిశగా ముందుకు సాగుతుందని, నారా చంద్ర బాబు వారసత్వాన్ని సమర్థంగా ముందుకు తీసుకెళ్తున్నారని అన్నారు.పార్టీపట్ల అంకితభావం, ప్రజల పట్ల బాధ్యత ఆయన నాయకత్వానికి బలమని పేర్కొన్నారు. యువతలో రాజకీయ చైతన్యం పెంచడంలో లోకేష్ ముందుండి పనిచేస్తున్నారని, పార్టీకి కొత్త ఉత్సాహాన్ని తీసుకువస్తున్నారని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని బాధ్యతలు తీసుకుని రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.

## భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి: కలెక్టర్

**ఒంగోలు, ప్రభాతవార్త**



ఒంగోలు నియోజకవర్గ పరిధిలో వున్న భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు, రెవెన్యూ అధికారుల ను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ హాల్లో జిల్లా కలెక్టర్ పి రాజాబాబు, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావు తో కలిసి కార్పొరేషన్, రెవెన్యూ అధికారులతో సమావేశమై ఒంగోలు నియోజకవర్గ పరిధిలో నెల కొని వున్న పలు భూ సమస్యలపై సమీక్షించి, సమస్యల పరిష్కార పురోగతిపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పేదలకు ఇళ్ళ పట్టాల మంజూరు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అలాగే ఒంగోలు నియోజకవర్గ పరిధిలో వున్న భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజల అవసరాలకు ఉపయోగ పడేలా అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఒంగోలు నగరంలో పేదలకు ఇళ్ళ నిర్మాణాలకు నిర్దేశించిన లే అవుట్స్ లో పేదలు త్వరగా ఇల్లు నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలని శాసన సభ్యులు దామచర్ల జనార్ధన్‌రావు, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు రాగా, ఈ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, మున్సిపల్, రెవెన్యూ అధికారులను ఆదేశించడం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి చినఓబులేసు, జిల్లా రిజిస్ట్రార్ బాలంజనేయులు, ఒంగోలు అర్బన్ తహసిల్దార్ మధుసూదన్ రావు, నగర కార్పోరేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు,

## ఇంటర్ ఫలితాలలలో యన్ఆర్ఐ విద్యార్థులు విజయదుంధిబి

**ఒంగోలు, ప్రభాతవార్త**




ఇంటర్మీడియట్ 2026 పరీక్ష ఫలితాలలో ఒంగోలు యన్ఆర్ఐ కళాశాల విద్యార్థులు విజయదుంధిబి మ్రోగించారు. అత్యుత్తమ మార్కులతో తమ సత్తాను కొనసాగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ మురళీకృష్ణ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఇంటర్ ఫలితాల్లో జూనియర్ ఇంటర్ యంపిసి విభాగంలో స్టేట్ ర్యాంకులు సిహెచ్ గోవింద్ చరణ్ 462, కె ప్రహర్షిత 461, ఎన్ జోషిత 460, ఏ శివనాగసంజన 460, జూనియర్ ఇంటర్ బైపిసి విభాగంలో స్టేట్ ర్యాంకులు ఎస్‌కె ఉమర్449, ఎస్‌కె షమ్మ448, బి సుప్రజ 445, బి షకీనా 442 సాధించినట్లు తెలిపారు. అదే విధంగా సీనియర్ ఇంటర్ యంపిసి విభాగంలో స్టేట్ ర్యాంకులు సెనిగా ఇందు 984, పి పద్మావతి 983, సీనియర్ ఇంటర్ బైపిసి విభాగంలో స్టేట్ ర్యాంకులు కె సంజనాదేవి 989, వి నీహారిక 982 సాధించినట్లు తెలిపారు. జూనియర్ ఇంటర్ యంపిసిలో 450 పైగా 36మంది, సీనియర్ ఇంటర్ యంపిసిలో 950పైగా 30మంది విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారన్నారు. అనంతరం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల డీన్ పి సురేష్, ప్రినిపాల్ టి మురళీకృష్ణ, ఏఓ రాము అధ్యాపకులు అభినందించారు.

## పాఠశాలకు బీరువా వితరణ

**జె. పంగులూరు, ఏప్రిల్ 15, ప్రభతవార్త**



మా పాఠశాల మా జీవితాలకు అక్షర జ్ఞానంతో వెలుగుని నింపేలా మెరుగైన అధ్యాపక బృందం శిక్షణలో విద్యార్థిని, విద్యార్థులు అద్భుతమైన విజయాలు సాధిస్తుందన్నారని దాత ఎండ్లూరి శాంసన్ అన్నారు. మండలలోని కొండమంజులూరు హైస్కూల్ పూర్వ విద్యార్థులు ఎండ్లూరి శాంసన్, గ్లోరీ సుమలత దంపతులు వారికి విద్య నందించిన పాఠశాలకు వారి గుర్తుగా పాఠశాలకు 13వేలు విలువ గల బీరువాను బుధవారం బహుకరించడం చాలా ఆనందంగా ఉందని ప్రధానోపాధ్యాయులు ఇమ్మడిశెట్టి అనిత అన్నారు. 1989 ఎండ్లూరి శాంసన్, 1995 లో గ్లోరీ సుమలత పదవ తరగతిలో ఈ పాఠశాలలో నుంచి చదివి ప్రథమ స్థానాలు తెచ్చుకున్నామన్నారు. గ్లోరీ సుమలత బీఎస్సీ బీఈడీ చదివి 2014లో దొనకొండ కస్తూరిబా గాంధీ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తున్నామన్నారు. క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచిన మెరుగైన అధ్యాపక బృందం శిక్షణలో అద్భుతమైన విజయాలు ప్రతి సంవత్సరము కొనసాగుతూనే ఉంటాయన్నారు. దాతలకు ప్రధానోపాధ్యాయురాలు, మరియు సిబ్బంది ధన్యవాదాలు, అభినందనలు తెలియజేశారు.

## ఇంటర్ ఫలితాలలో ఎస్ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థుల విజయభేరి..

**ఒంగోలు, ప్రభాతవార్త**




నేటి ఇంటర్ ఫలితాలలో ఎస్ఆర్ జూనియర్ కాలేజీ విద్యార్థులు విజయభేరి మ్రోగించారు. జూనియర్ ఇంటర్‌లో దాసరి ఎస్తేరు రాణి 465, జి. యస్వంత్ 465, ఎస్. వెంకట సాయి కృష్ణ వర్షిణి 464. సీనియర్ ఇంటర్‌లో కె. మానస 989, టి. అక్షయ 988, కుందనశ్రీ 986, తేజ గాయత్రి 983, అత్యధిక మార్కులు సాధించారు. విద్యార్థులను జీఎం రాజేంద్ర ప్రసాద్, డీజీఎం జె వి రమణ, గోవర్ధన్ రెడ్డి, కోర్ డీన్ అరవింద్, జోనల్ ఇంచార్జి కంటా శ్రీనివాస్ అభినంధించారు. ఈ విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులు మరియు తల్లి తండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఇంటర్మీడియట్లో 66 శాతం ఉత్తీర్ణత

**ఉలవపాడు, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**

మండలంలోని వీరేపల్లి ఏపీ మోడల్ స్కూల్ కరేడులోని కేజీబీవీ పాఠశాల మరియు ఉలవపాడు జీవీఎస్ఎన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 388 మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షలు రాయగా 256 మంది ఉత్తీర్ణత సాధించారు. మండలంలో 66శాతం ఉత్తీర్ణత నమోదయింది .వీరేపల్లి ఆదర్శ పాఠశాలకు చెందిన సీనియర్ ఇంటర్ విద్యార్థిని షేక్ నజరీన్ 981 మార్కులతో మండలంలో ప్రథమ స్థానంలో నిలిచింది. రెండో స్థానంలో ఉలవపాడు జూనియర్ కళాశాల విద్యార్థిని సిహెచ్ స్పందన 925 మార్కులు,అదే కళాశాలకు చెందిన ఎన్ సిరి అనే విద్యార్థిని 918 మార్కులు సాధించారు. ఆ తర్వాత కేజీబీవీ పాఠశాలకు చెందిన విద్యార్థిని యు తేజస్విని 888 మార్కులు సాధించింది.

## ఇంటర్ ఫలితాలలో ఎస్ఎస్ఎన్ జూనియర్ కళాశాల విద్యార్థుల సత్తా

**ఒంగోలు, ప్రభాతవార్త**




ఇంటర్మీడియట్ 2026 పరీక్ష ఫలితాలలో ఒంగోలు ముంగమూరు రోడ్లోని ఎస్ఎస్ఎన్ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో తమ సత్తాను కొనసాగించినట్లు ఎస్ఎస్ఎన్ విద్యా సంస్థల అధినేత యల్లటూరి రామకృష్ణ రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ సీనియర్ ఇంటర్ ఎమ్. పీ. సి లో పీ. జోషిత అత్యధికంగా 989 మార్కులు సాధించినదని, 985 మార్కుల పైన సాధించినవారు 13 మంది విద్యార్థులు ఉన్నారని, అలాగే జూనియర్ ఇంటర్ ఎమ్.పీ.సిలో బీ ఆదిత్య, పీ. ప్రణితసాయి 466 మార్కులు సాధించారని, 460మార్కుల పైన సాధించినవారు మొత్తం 21 మంది విద్యార్థులు ఉన్నారని, జూనియర్ ఇంటర్ బై.పీ.సిలో జే.కళ్యాణి 455 మార్కులకు గాను 452 మార్కులు సాధించినదని, 450 మార్కుల పైన సాధించినవారు 9 మంది విద్యార్థులు ఉన్నారని 90పైగా విద్యార్థులు ఉత్తీర్ణత సాధించిన ఏకైక విద్య సంస్థ ఎస్ఎస్ఎన్ అని అన్నారు. కార్యక్రమంలో అత్యధిక మార్కులు పొందిన వారిని కళాశాల డైరెక్టర్ వై.సత్యనారాయణరెడ్డి, ప్రిన్సిపల్ వై.శివానందరెడ్డి, అకడమిక్ డీన్ ఎమ్. జనార్ధన్ రెడ్డి అధ్యాపకులు పీ. రఘునాథ రెడ్డి, ఎమ్.మధుసూదనరావు, ఎమ్. చెంచు రెడ్డి అభినందించారు.

## ఇంటర్ ఫలితాల్లో శ్రీ ప్రతిభ విద్యార్థులు విశేష ప్రతిభ

**సంతనూతలపాడు, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**




ఇంటర్ ఫలితాల్లో సంతనూతలపాడు మండలం పేర్నమిట్ట పరిధిలో గల శ్రీ ప్రతిభ విద్యాసంస్థల విద్యార్థులు విశేష ప్రతిభను కనపరిచారు. బుధవారం నాడు శ్రీ ప్రతిభ విద్యాసంస్థల ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఆయా ప్రతిభా విద్యార్థులను శ్రీ ప్రతిభ విద్యాసంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ నల్లూరి సీతారామాంజనేయులు, సీఈఓ నల్లూరి జయప్రకాష్ నారాయణలు ప్రత్యేకంగా అభినందించారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో వెలుతుర్ల కార్తీక్ రెడ్డి 467, కొరివి సత్య భవ్యశ్రీ 466, వేల్పుల చంద్ర హాసిని 466, జంపు మంజుల 466, అల్మూరి ప్రవీణ 465, కొండుగారి హర్షిత 465, పట్నం వెంకట మౌనిక 465 మార్కులు సాధించారు. బైపీసీవిభాగంలో ఓ.అక్షర 450, కొప్పోలు దివ్య సహిత 449, తన్నీరు అశ్విత 448, చెరుకుపల్లి లోకేశ్వరి 445, పేరూరి రామ్ చరణ్ తేజ 444, అల్లుడి విష్ణువర్ధన్ 444మార్కులు సాధించారు. సీఈసీ విభాగంలో చుండూరి లోకేశ్వర ద్రూర్తి 493 మార్కులు సాధించి స్టేట్ మూడో స్థానం కైవసం చేసుకున్నారు. 460 పైగా 57 మంది, 450పైగా 140మంది, 440 పైగా 237, 400లకు పైగా 496 మంది సాధించారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో అనుమోలు అంజన 991, మాకినేని మనోజ్ 990, యల్లావుల బ్రహ్మారెడ్డి 990, యక్కంటి హేమవర్షిణి 990 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో పిన్నక సంతోషిణి 988, దాసరి వైశాలి 987, యేనుగంటి నాగ నందిని 987 మార్కులు సాధించారు. 990పైగా నలుగురు, 980పైగా 65 మంది, 970కు పైగా 110 మంది, 960పైగా 140మంది, 950కు పైగా 170 మంది, 900లకు పైగా 365 మంది సాధించారు. సీనియర్ ఎంపీసీ విభాగంలో 1000 మార్కులకు 991 మార్కులతో(స్టేట్ 4వ స్థానం), 990 మార్కులతో (స్టేట్ 5వ స్థానం), 989 మార్కులతో (స్టేట్ 6వ స్థానం), 988 మార్కులతో(స్టేట్ 7వ స్థానం), 987 మార్కులతో(స్టేట్ 8వ స్థానం), 986 మార్కులతో(స్టేట్ 9వ స్థానం), 985 మార్కులతో(స్టేట్ 10వ స్థానం), 980 మార్కులకు పైగా 65 మంది విద్యార్థులు సాధించారు. అదే విధంగా బైపీసీ విభాగంలో 1000 మార్కులకు 988 మార్కులతో (స్టేట్ 6వ స్థానం), 987 మార్కులతో(స్టేట్ 7వ స్థానం) సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది వారు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

## ప్రభుత్వ బాలుర వసతి గృహాలకు శంకుస్థాపన

**ఒంగోలు కలెక్టరేట్ ప్రభాతవార్త**



ఒంగోలు నగరంలోని 46వ డివిజన్ అంజి రోడ్డులో సుమారు రూ.3.70 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ప్రభుత్వ బాలుర కళాశాల వసతి గృహాలకు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు శంకుస్థాపన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఎంసీ చైర్మన్ రాజగండ్ల వెంకట్రావు, ఒంగోలు పట్టణ పార్టీ అధ్యక్షుడు బండారు మదన్, జనరల్ సెక్రటరీ బుడ్డపాటి వెంకట్, స్థానిక టిడిపి నాయకులు, అధికారులు మరియు ప్రజలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఇప్పటివరకు విద్యార్థులు అద్దె భవనాల్లో నివసిస్తూ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ పరిస్థితిని మార్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఈ కొత్త వసతి గృహ నిర్మాణంతో విద్యార్థులకు స్వంత భవనంలో అన్ని సౌకర్యాలతో కూడిన వసతి అందుబాటులోకి వస్తుందని అన్నారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో చదువుకునేందుకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఇటువంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందని, భవిష్యత్తులో మరిన్ని హాస్టళ్లు నిర్మించే ప్రణాళికలు కూడా ఉన్నాయని ఎమ్మెల్యే వివరించారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కోసం కూడా ప్రత్యేకంగా వసతి గృహాలను నిర్మించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.నిర్మాణ పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని, భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు రాకుండా కాంట్రాక్టర్లు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. నిర్ణీత కాలవ్యవధిలో పనులు పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.ఈ హాస్టల్ నిర్మాణం పూర్తయిన తర్వాత విద్యార్థులకు మెరుగైన నివాస సౌకర్యాలు కల్పించబడటంతో పాటు వారి విద్యాభ్యాసానికి అనుకూల వాతావరణం ఏర్పడుతుందని, విద్యార్థుల భవిష్యత్తు మరింత మెరుగుపడుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## 93 ఉత్తీర్ణత సాధించిన చాణిక్య జూనియర్ కాలేజీ

**కొండపి,ప్రభాతవార్త**



కొండపిలోని చాణిక్య జూనియర్ కాలేజీ విద్యార్థులు ఇంటర్ పరీక్ష ఫలితాల్లో 93 శాతం ఉత్తీర్ణత సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచారు. 2025 - 26 విద్యా సంవత్సరంలో ప్రథమ ద్వితీయ ఇంటర్ పరీక్ష ఫలితాలు బుధవారం వెల్లడించగా అందులో అత్యుత్తమ ఉత్తీర్ణత శాతం చాణిక్య కాలేజీ సాధించింది. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 90 ద్వితీయ సంవత్సరంలో 93 ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరం బైపిసి గ్రూపులో కే భారతి రెడ్డి అనే విద్యార్థి 432 మార్కులు, సాధించగా ఎంపీసీ గ్రూపులో ఏ అనూష అను విద్యార్థి 433 మార్కులతో ప్రథమంలో ప్రథమంలో నిలిచారు. అదే విధంగా ద్వితీయ సంవత్సరం ఎంపీసీ గ్రూపులో బి రాజ్ కుమార్ 960 మార్కులు టి అరుణ 957 మార్కు సాధించారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ ఈ రాజ్యలక్ష్మి అభినందించారు.

## ఇంటర్మీడియట్ ఫలితాలలో వికసించిన గ్రామీణ విద్యా కుసుమాలు

**బల్లికురవ, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**



పల్లెటూరిలో పుట్టి, అక్షరం నేర్చుకునేందుకు ఎన్నో పురిటి నొప్పులను అధిగమించి, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుంటూ, ఆ లక్ష్యాలను చేరుకునే క్రమంలో గ్రామీణ ప్రాంత విద్యార్థులు సరస్వతీ పుత్రులకు ప్రతిరూపంగా వికసిస్తున్నారు. బల్లికురవ గ్రామానికి చెందిన, నార్నె వెంకట శ్రీనివాసులు, విజయలక్ష్మి దంపతులది దిగువ మధ్యతరగతి కుటుంబం. ఈ క్రమంలో తమ కుమారుడు నార్నె సాయి విద్యాభ్యాసాన్ని పదవ తరగతి వరకు బల్లికురవ ప్రభుత్వ పాఠశాలలో కొనసాగించారు. ఆర్థిక పరిస్థితులు అతుకుల బొంతలా ఉన్న, పిల్లల అభిరుచి మేరకు శక్తికి మించి వడ్లమూడి విజ్ఞాన్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివించారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తు ఎరిగిన సాయి కఠోర శ్రమతో, ప్రత్యేక ప్రణాళికతో, తల్లిదండ్రులపై అధిక ఫీజులు ,డొనేషన్ల భారం మోపకుండా ఉండేందుకు తన శక్తికి మించి శ్రమించాడు. మంగళవారం వెలువరించిన ఫలితాలలో 984 మార్కులు సాధించి, ఆశించిన, లక్ష్యాలను తన తల్లిదండ్రుల కు బహుమతిగా అందించాడు. అదేవిధంగా మండలంలోని వి.కొప్పెరపాడు గ్రామానికి చెందిన మాతాల హేమ స్రవంతి మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ ఫలితాలలో 470 మార్కులకు గాను 466 సాధించి తమ గ్రామానికి మణిహారంగా నిలిచారు.

## జిల్లాలో సబ్ జూనియర్, యూత్ బాస్కెట్బాల్ జట్ల ఎంపిక

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**

ఉమ్మడి ప్రకాశం జిల్లా బాస్కెట్బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్ మరియు యూత్ బాల బాలికల బాస్కెట్బాల్ జట్ల ఎంపికలు ఏప్రిల్ 18వ తేదీ శనివారం మధ్యాహ్నం 2 గంటలకు కందుకూరులోని టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల బాస్కెట్బాల్ క్రీడా మైదానంలో నిర్వహించనున్నట్లు సంఘం చైర్మన్ పాటిబండ్ల వెంకటేశ్వర్లు, ప్రెసిడెంట్ వలేటి రవీంద్ర, కార్యదర్శి తొట్టెంపూడి సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు.సబ్ జూనియర్ విభాగంలో 1-1-2013 తర్వాత జన్మించిన బాల బాలికలు, యూత్ విభాగంలో 1-1-2010 తర్వాత జన్మించిన వారు ఎంపికలకు అర్హులు. ఎంపికైన సబ్ జూనియర్ జట్లు మే 17 నుండి 20 వరకు చిత్తూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనగా, యూత్ విభాగంలో ఎంపికైన జట్లు త్వరలో పిఠాపురంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాయి.నైపుణ్యం కలిగిన క్రీడాకారులు, క్రీడాకారిణులు ఈ జిల్లా స్థాయి ఎంపికల్లో తప్పనిసరిగా పాల్గొనాలని సంఘం పిలుపునిచ్చింది. ఎంపికలకు సంబంధించి మరిన్ని వివరాలకు 9866126955, 9849429839 ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చు.

## ఒంగోలులో ఓరియంటల్ పాఠశాలలో మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**




స్థానిక గద్దలగుంటలోని శ్రీ పింగళి కోదండరామయ్య ఓరియంటల్ పాఠశాలలో మిడ్ వెస్ట్ లిమిటెడ్ వారి సహకారంతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని సూచించారు. పాఠశాలలో మినరల్ వాటర్ సౌకర్యం ఏర్పాటు చేసిన మిడ్ వెస్ట్ సంస్థను ఆయన అభినందించారు.పాఠశాల కరస్పాండెంట్ నల్లమల్ల కోటి సూర్యనారాయణ మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలతో పాటు సొంత నిధులు మరియు పూర్వ విద్యార్థుల సహకారంతో పాఠశాలలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి లోటు లేకుండా విద్యాబోధన అందించడమే తమ లక్ష్యమని చెప్పారు. ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి మాట్లాడుతూ 1970 నుంచి పాఠశాల విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా పనిచేస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ2 సరస్వతి, మిడ్ వెస్ట్ మేనేజర్ అంబటి శ్రీనివాసరావు, పాఠశాల వైస్ ప్రెసిడెంట్ చలపతిరావు, ప్రెసిడెంట్ శ్రీరామ శర్మ, సభ్యులు మండవ రామయ్య, చక్కా శ్రీమన్నారాయణ, వి వెంకటరావు, పీఈటీ సోమినేని సురేష్, జి ఆనంద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వసతి గృహాల్లో సౌకర్యాల మెరుగుదలే లక్ష్యం

- సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.ఎం. నాయక్

**ఒంగోలు, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.ఎం. నాయక్ బుధవారం ఒంగోలు నగరంలోని ప్రభుత్వ కళాశాల విద్యార్థుల (బాలురు బాలికల) వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో సుమారు గంటపాటు ముఖాముఖిగా మాట్లాడి, విద్యా ప్రమాణాలు మరియు వసతి గృహాల్లో అందుతున్న సౌకర్యాలను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో ఆత్మీయ సంభాషణ - కెరీర్ గైడెన్స్: ముందుగా కళాశాల బాలుర వసతి గృహం2ను సందర్శించిన ఆయన, అనంతరం జే.డి. శీలం భవనంలోని బాలికల వసతి గృహాలు 2,3 ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో మాట్లాడుతూ "మీరు గ్రామీణ ప్రాంతాల నుండి ఎన్నో ఆశలతో ఇక్కడికి వచ్చారు. కష్టపడి చదవడమే కాకుండా, ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. కేవలం డిగ్రీలతో ఆగిపోకుండా గ్రూప్1, సివిల్ సర్వీసెస్ వంటి ఉన్నత శిఖరాలను అధిరోహించి ఐఏఎస్ అధికారులుగా సమాజానికి సేవ చేయాలని అని వారిలో స్ఫూర్తిని నింపారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎన్. లక్ష్మానాయక్, ఎస్.సి కార్పొరేషన్ ఈ.డి. అర్జున్ నాయక్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి వరలక్ష్మీ, ఏ.ఎస్.డబ్ల్యూ.ఓ. రబియా బేగం, హెచ్.డబ్ల్యూ.ఓలు శిరీష, శ్రీలత, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



6_6.qxd 4/16/2026 12:25 AM Page 1



## ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల విశేష ప్రతిభ








**బల్లికురవ, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**
కార్పొరేట్ కళాశాలలకు ధీటుగా మెరుగైన విద్యా ఫలితాలను సాధిస్తూ, స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరుస్తున్నారు. బుధవారం వెలువరించిన ఇంటర్మీడియట్ ఫలితాలలో స్థానిక కళాశాల విద్యార్థులు 90శాతం ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరం విద్యార్థులు 85శాం ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో ఎం.కుమారి బైపీసీ విభాగంలో 946 మార్కులు, ఎస్కే మునీర్ ఎంపీసీ విభాగంలో 928 మార్కులు సాధించారు. ఎం.సమీరా 882, సారా ఏంజెల్ 784 మార్కులు సాధించింది. మొదటి సంవత్సరం ఫలితాలలో పి.దివ్య 444 మార్కులు కే.రమ్య 431, నాగజ్యోతి 409, నాగఫణిశ్రీ 398, షేక్ యామిని 466, కే.అఖిల 440, ఎం.మహేష్‌బాబు 416 మార్కులు సాధించి తమ ప్రతిభను చాటారు. ప్రిన్సిపాల్ సుధాకర్‌రావు,అధ్యాపక బృందం స్థానిక కళాశాలలో విద్యార్థులను అభినందించి, మిఠాయిలు తినిపించారు.

# గ్రానైట్ లారీపై కేసు నమోదు



**బల్లికురవ, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**
ప్రభుత్వానికి చెల్లించాల్సిన సుంకాలను చెల్లించకుండా మహా దర్జాగా గ్రానైట్ రవాణా చేస్తున్న వాహనాలపై దర్శి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ పి.రవికుమార్ కేసు నమోదు చేశారు. బుధవారం మండలంలోని మల్లయ్యపాలెం గ్రామ పరిధిలో ఏపీ 27 టీ వై 6633 నెంబర్ గల లారీ 1.94 లక్షలు సుంకం చెల్లించాల్సి ఉంది. కనీస స్పందన కూడా లేకుండా వాహనాన్ని గ్రానైట్ రవాణాకు వినియోగిస్తుండడంతో రవికుమార్ కేసు నమోదు చేసి లారీని స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలించారు.

## నాయుడమ్మ అంతిమయాత్రలో కరణం, ఎమ్మెల్యే ఏలూరి





**బల్లికురవ, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**
ఇంకొల్లు మాజీ ఏంఎపీ చైర్మన్ కొల్లూరి నాయుడమ్మ చౌదరి, అనారోగ్యంతో బుధవారం మరణించారు .సమాచారం అందుకున్న మాజీ పార్లమెంటు సభ్యులు కరణం బలరామకృష్ణమూర్తి ఇంకొల్లులోని ఆయన నివాస గృహానికి చేరుకున్నారు. నాయుడమ్మ పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయుడమ్మతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకొని కరణం భావోద్వేగానికి లోనయ్యారు. కుటుంబ సభ్యులను పేరు పేరునా పలకరించి ఓదార్చారు. సందర్భంగా ఆయన నాయుడమ్మ మహా పాదయాత్రను గుర్తుకు తెచ్చారు.అశేష ప్రజానీకం తమ అభిమాన నేత అంతిమయాత్రలో పాల్గొన్నారు. కరణంతో పాటు పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అంతిమయాత్రలో పాల్గొన్నారు. సుదీర్ఘకాలం అజాతశత్రువుగా ప్రజల సమస్యలు తన సమస్యలుగా భావిస్తూ పరిష్కార మార్గాలు చూపిన తమ అభిమాన నాయకుడికి ఇంకొల్లు పట్టణ ప్రజానీకం, అశ్రునయనాలతో ఘనంగా వీడ్కోలు పలికారు.

## స్వయం సహాయక సంఘాల సభ్యులకు జీవనోపాధులు కల్పించాలి



**నాగులుప్పలపాడు, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**
నాగులుప్పలపాడు మండల సమాఖ్య డీఆర్‌డీఏ వెలుగు కార్యాలయం నందు వార్షిక రుణ జీవనోపాదుల ప్రణాళిక 2026-27కు సంబంధించి స్వయం సహాయక సంఘాలు వద్దకు వెళ్లి ఈ ఆర్థిక సంవత్సరంలో సభ్యులు అవసరాలను తెలుసుకుని బ్యాంకులు, స్త్రీ నిధి, సీఐఎఫ్, ఉన్నతి ద్వారా జీవనోపాదులు పెంపుదలకు,కొత్తగాఏర్పాటు చేసుకునేందుకు రుణాలు మంజూరు చేయుటకు ఈ ప్రణాళిక ఉపయోగ పడుతుందని స్త్రీనిధి డీజీఎం ఏ.ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ నెల 20వ తేదీ నుండి 30వ ప్రతి గ్రూపులు వద్ద కూర్చుని సభ్యులు అవసరాలు గుర్తించాలని స్త్రీనిధి ఏజీఎం ఉదయ్‌కుమార్ పేర్కొన్నారు. అలాగే ఈ సంవత్సరం స్త్రీ నిధిలో లోన్‌లు పొందాలంటే మండలంలో ఉన్న ఎన్‌పీఏ తగ్గించి రుణ అర్హత పొందాలని తద్వారా సుస్థిరమైన జీవనోపాదులకు ఉపయోగపడుతుందని తెలిపారు.

## పాఠశాలల్లో విద్యార్థుల చేరిక



**నాగులుప్పలపాడు, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**
ప్రభుత్వ పాఠశాలల్లో వచ్చే విద్యాసంవత్సరానికి విద్యార్థులను చేర్చుకునే క్రమంలో భాగంగా గ్రామంలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించడం జరిగింది. దీనిలో భాగంగా ఐదుగురు విద్యార్థులను ఎంపీపీఎస్ ఒమ్మెవరం పాఠశాలలో చేర్చుతున్నట్లు తల్లిదండ్రులు అంగీకారం తెలిపారు.ఈ సందర్భంగా పాఠశాల నందు ఐదుగురు విద్యార్థులను వారి తల్లిదండ్రులను అభినందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి టి.రవి, ప్రధానోపాధ్యాయులు ఆర్.సలోమీరాణి, ఉపాధ్యాయులు టి.ఈశ్వరయ్య, ఎస్ఎంసీ చైర్మన్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## 20 నుండి 26 వరకు ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన

### - కరపత్రాలు ఆవిష్కరణ

**నాగులుప్పలపాడు, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**
మండలంలోని మద్దిరాలపాడులో మండవ వెంకట్రావు మెమోరియల్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గుమ్మడి సాయిబాబు తెలిపారు. ఈ సందర్భంగా అందుకు సంబంధించి కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. అనంతరం పత్రికా విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ పెనుబోతు వీరయ్య చౌదరి పాఠశాల క్రీడా ప్రాంగణంలో 2014-2019 వరకు ఐదు సంవత్సరాల పాటు ఈ పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. అప్పట్లో గ్రామస్తులతో పాటు అందరి సహకారం లభించిందన్నారు. అదే విధంగా గ్యాప్ వచ్చిన తరువాత ఈ పోటీలు నిర్వహించాలని చర్చించినప్పుడు ప్రతి ఒక్కరూ ఉత్సాహం చూపారన్నారు. ఈ పోటీలకు సంబంధించి గ్రౌండ్ ఏర్పాటుకు విశ్రాంత ఉపాధ్యాయుడు కాంతారావు మంచి కృషి చేశారన్నారు. ఈ పోటీలను రెండు పళ్ళు, నాలుగు పళ్ళు, ఆరు పళ్ళు, క్యాటగిరి విభాగం, సబ్ జూనియర్, జూనియర్, సీనియర్స్ తదితర విభాగాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలకు భారీ మొత్తంలో ఎడ్ల యజమానులకు ప్రతి విభాగంలో 9 బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు. సీనియర్ విభాగంలో పదకొండు బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ పోటీల నిర్వహణకు అందరి సహకారంతో పాటు మీడియా సహకారం అవసరమన్నారు. ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రులు డోలా బాల వీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్, పీడీసీసీ బ్యాంకు చైర్మన్ కామేపల్లి సీతారామయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ముప్పవరపు సుచిత్ర హాజరవుతున్నారన్నారు. ఈపోటీలకు ప్రారంభకులుగా స్థానిక శాసనసభ్యులు బీఎన్ విజయ్ కుమార్ పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీలతో వారం రోజుల పాటు మద్దిరాలపాడు పండుగ వాతావరణంతో పాటు సందడి నెలకొంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల మాజీ కార్యదర్శి షేక్ ఖాజావలి, పోతినేని శ్రీనివాసరావు, కామేపల్లి శ్రీనివాసరావు, ప్రసాద్, మాజీ సర్పంచ్‌లు స్వర్ణ అనురాధ, రమేష్‌బాబు, ఉప సర్పంచ్ పెనుబోతు సునీల్, రమేష్‌బాబు, వర్ధినేని శేషయ్య, పెనుబోతు శ్రీనివాసరావు, నెప్పల శివకృష్ణ, తాళ్లూరి ఆంజనేయులు, పాలడుగు మురళీ, కాటా శ్రీనివాసరావు, దివి పున్నారావు, ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

## వార్షిక రుణ జీవనోపాదులపై శిక్షణ



**కొనకనమిట్ల, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**
స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీఎం బి.సుధాకర్‌రావు ఆధ్వర్యంలో వార్షిక రుణ జీవనోపాదులపై ఎల్‌హెచ్‌సీఆర్‌పీ, ఈనారి, వీఓఏలకు బుధవారం శిక్షణ నిర్వహించారు. సీఆర్పీలు, ఈనారీలు ప్రతి పొదుపు గ్రూపులలోని ప్రతి మహిళా సభ్యులను సర్వే చేసి వారికి ఏది అవసరమో ఏఏ లోన్లు కావలెనో గుర్తించి నమోదు చేయాలని సూచనలు సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎంఎస్ అధ్యక్షురాలు వై.ఈశ్వరమ్మ, సీసీలు సాయిలు, రమేష్, అకౌంటెంట్లు నాగమణి, అరుణ, ఎల్‌హెచ్‌సీఆర్‌పీలు, ఈనారీలు పాల్గొన్నారు.

## డ్రిప్‌తో నిమ్మతోట సాగును పరిశీలించిన ఏపీఎంఐపీ పీడీ జెన్నమ్మ



**కొనకనమిట్ల, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**
మండలంలోని చిన్నారికట్ల ఏలూరి రమణారెడ్డి నిమ్మ తోటలో ఏర్పాటు చేసిన డ్రిప్‌ను ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరక్టర్ జెన్నమ్మ బుధవారం పరిశీలించారు. డ్రిప్ పరికరాలు ద్వారా నీరు వృధా కాకుండా సరిపడు నీటిని పెట్టుకొని పెంపకం చేపట్టడం సంతృప్తికరంగా ఉందని,వివిధ సూచనలు సలహాలు వివరించారు. ఉద్యానశాఖ ద్వారా అందించే పథకాలను వినియోగించుకోవాలని ఆమె సూచించారు.

## లింగసముద్రం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడా కార్యక్రమం



**లింగసముద్రం, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**
లింగసముద్రం మండలంలోని చినపవని, అన్నెబోయినపల్లి అంగన్‌వాడీ సెంటర్‌లో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాధాదేవి అధ్యక్షతన పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం సీడీపీవో ఆదేశాల మేరకు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏప్రిల్ 9 నుండి 23 వరకు జరిగే ఎనిమిదవ పోషణ పక్షోత్సవం 2026 జీవితంలోని మొదటి ఆరు సంవత్సరాలలో మెదడు అభివృద్ధిని గరిష్ట స్థాయికి చేర్చడం అనే ఇతి వృత్తంపై దృష్టి సారిస్తుంది. మెదడు అభివృద్ధిలో 85శాతం ఆరేళ్ల వయసు వచ్చే సరికి ముఖ్యంగా మొదటి 1000 రోజులలోనే జరుగుతుందని గుర్తించి, ఈ ప్రచారం బాల్యదశ సంరక్షణ పోషణ, ఆట ఆధారిత విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని గ్రామంలో బాల్య వివాహాలు జరగకుండా చూడాలని అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ సెంటర్లో లభించే సేవలను అందరూ వినియోగించుకోవాలని గర్భిణీ స్త్రీలకు, పిల్లలకు సరైన పోషణ అందివ్వాలని మూడు సంవత్సరాల లోపల పిల్లలందరికి మంచి పోషకాహారం అందివ్వడం ద్వారా మెదడు అభివృద్ధి భాగా చెందుతుందని అన్నారు. మూడు నుండి ఆరు సంవత్సరాల వయసులో ఆట పాటలతో కూడిన విద్యను అందించాలని అవగాహన కల్పించడం జరిగింది. స్కూల్ టీచర్ రవి మాట్లాడుతూ తల్లిదండ్రులు, సమాజ మద్దతు ద్వారా చిన్నారులు ఫోన్ వాడకాన్ని సమయాన్ని తగ్గించాలని అంగన్‌వాడీ కేంద్రాలకు సామాజిక మద్దతు అందించాలని తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో స్కూల్ టీచర్, ఆశా అంగన్‌వాడీ కార్యకర్తలు, అంగన్‌వాడీ హెల్పర్ గర్భవతలు, బాలింతలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ ఎమ్మెల్యే స్టిక్కర్లు తయారు చేస్తున్న వ్యక్తి అరెస్టు




**బల్లికురవ, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**
గత కొంతకాలంగా రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి, అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పేరుతో విజయవాడకు చెందిన యువకుడు చేబ్రోలు నాగరాజు నకిలీ ఎమ్మెల్యే, కారు స్టిక్కర్లను తయారు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. ఈ మొత్తం వ్యవహారం మంత్రి రవికుమార్ దృష్టికి పోవడం, ఆయన విచారణకు ఆదేశించడంతో బల్లికురవ ఎస్సై నాగరాజు సత్వరం స్పందించారు. ఇటీవల కాలంలో బల్లికురవలో నకిలీ స్టిక్కర్లను విక్రయించేందుకు నాగరాజు ప్రయత్నించడం, కుదరకపోవడంతో పలాయనం చిత్తగించాడు. చేబ్రోలు నాగరాజు సమాచారం అందుకున్న ఎస్సై నాగరాజు ప్రత్యేక వ్యూహంతో బుధవారం సాయంత్రం, బల్లికురవ నాలుగు రోడ్ల కూడలిలో అరెస్టు చేసి అతని వద్ద నుండి రెండు, నకిలీ స్టిక్కర్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నాగరాజును అద్దంకి కోర్టుకు తరలించారు. నకిలీ స్టిక్కర్లు కొన్నవారు వాటిని వాహనాలకు వినియోగించి ప్రయాణిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్సై నాగరాజు హెచ్చరించారు.

## పేర్నమిట్ట చెరువు సప్తా ఆక్రమణను పరిశీలించి రెవెన్యూ ఇరిగేషన్ బృందం



**సంతనూతలపాడు, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**
సంతనూతలపాడు మండలం పేర్నమిట్టలో గల 40వ డివిజన్ పోలేరమ్మ గుడి దగ్గర ఉన్న చెరువు సప్తా పూడ్చి బిల్డింగ్ నిర్మాణాన్ని చేపడుతుంటే బుధవారం నాడు ఇరిగేషన్ అసిస్టెంట్ ఇంజనీర్ వెంకటేశ్వరరెడ్డి, స్థానిక వీఆర్వో వినీల తదితరులు పరిశీలించారు.ఆక్రమణదారుడు తనకు డీకే పట్టా ఉందని తెలియజేయగా ఇరిగేషన్ అసిస్టెంట్ ఇంజనీర్ వెంకటేశ్వరరెడ్డి దానిపై తహసీల్దార్ ఎస్ఎల్ నారాయణరెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ పట్టా ఒరిజనల్‌నా, డూప్లికేట్‌నా తెలియజేయాలని రెవెన్యూ వారిని ఏఈ వెంకటేశ్వరరెడ్డి కోరారు. ఇటీవల దీనిపై నిర్మాణాలను ఇరిగేషన్ అధికారి ఆపివేయించారు. మరలా ఆక్రమణ దారుడు తిరిగి నిర్మాణాలను చేపడుతుంటే అడ్డుకున్నారు. దీనిపై రెవెన్యూ శాఖ తక్షణమే ఆక్రమణలు నివారణకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి




**సంతనూతలపాడు, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**
ప్రతి ఒక్క గ్రూపు మహిళ వ్యాపారవేత్తగా ఎదగాలని సంతనూతలపాడు మండల డీఆర్‌డీఏ వెలుగు శాఖల ఏపీఎం టి.బాబురావు కోరారు.సంతనూతలపాడులోని వెలుగు కార్యాలయంలో బుధవారం నాడు వీఓఓబీ, వీఓఏలకు రాబోవు సంవత్సరాల కాలానికి వార్షిక రుణ జీవనోపాదుల ప్రణాళికల 2026-27 ను ప్రతి గ్రూపు సభ్యులకు ఏ విధంగా తయారు చేయాలో ఏపీఎం బాబురావు శిక్షణా కార్యక్రమంలో వివరించారు. ప్రతి ఒక్క మహిళా వ్యాపారవేత్తలుగా తయారు అవ్వుటకు కావాల్సిన రుణ అవసరాలు మొదటిగా గ్రూపు పొదుపుల బండి, తదుపరి సీఐఎఫ్, ఉన్నతి, స్త్రీనిధి రుణాల ప్రణాళిక, తరువాత మిగిలిన అవసరాలకు బ్యాంకు లింకేజీ ద్వారా ఎంత అవసరమో ప్రతి సభ్యులతో మాట్లాడి వారి వారి అవసర ప్రణాళికలను వారి అంగీకారంతో పాదర్శకంగా తయారు చేయాలన్నారు. ప్రతి వీఓకు 15 నుండి 20 మందిని మహిళా వ్యాపారవేత్తలను తయారు చేయాలన్నారు. ముఖ్యంగా పీఎంఎఫ్‌ఎంఈ, పీఎంఈజీపీ యూనిట్లను స్థాపించే విధంగా ప్రణాళికలను తయారు చేయాలని ఏపీఎం బాబురావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు సీసీలు, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాలలో శ్రీగౌతమి జూనియర్ కాలేజీ విజయభేరి

### - ఎంపీసీలో జిల్లా ప్రథమస్థానం కైవసం







**చీరాల టౌన్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**
రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన 2026 ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫలితాలలో శ్రీ గౌతమి జూనియర్ కాలేజీ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనపరిచి ఘన విజయాన్ని సాధించారు. అన్ని విభాగాలలోనూ విద్యార్థులు జిల్లా స్థాయిలో అగ్రస్థానానలు సాధించి కళాశాల ప్రతిష్ఠను మరింత పెంచారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో మీసాల అక్షర 470కు 466 మార్కులు సాధించి జిల్లా ఫస్ట్‌గా నిలిచింది. 465 మార్కులతో ఎండీ రహమద్ భాషా, వై.ప్రవీణ్ కుమార్, బి.మోహన ప్రియ రెండవ స్థానంలో నిలిచారు. అదే విధంగా బైపీసీ విభాగంలో ఎం.భవ్యశ్రీ 455కు 450 మార్కులు సాధించి జిల్లాలో అగ్రస్థానాన్ని దక్కించుకుంది. ఎంపీసీ విభాగంలో 460కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులు మొత్తం 24 మంది ఉండడం విశేషం. సీనియర్ ఇంటర్ ఫలితాలలో కూడా విద్యార్థులు ప్రతిభ చాటారు. ఎంపీసీవిభాగంలో 1000కు 988 మార్కులతో డి.సాహితి, బి.పూర్ణ పృధ్వీ, ఎస్ కౌషిత అగ్రస్థానంలో నిలిచారు. 987 మార్కులతో జే.చరిత్ర, బి.శ్రీచంద్రిక ద్వితీయ స్థానంలో నిలిచారు. బైపీసీ విభాగంలో ఆర్.దేవ వర్షిణి 1000కు 985 మార్కులు సాధించి అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా కళాశాల మేనేజింగ్ డైరక్టర్ ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తమ కళాశాలలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను వారికి మార్గదర్శకత్వం వహించిన అధ్యాపకులను ప్రత్యేకంగా ఆయన అభినందించారు. క్రమశిక్షణ, కృషి, నిష్ణాత ఉపాధ్యాయ బృందం కారణంగానే ఈ విజయాలు సాధ్యమయ్యాయని ఆయన స్పష్టం చేశారు.

## ఇంటర్ ఫలితాల్లో శ్రీ ఆదిత్య జూనియర్ విద్యార్థుల విజయకేతనం






**పామూరు, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**
బుధవారం వెలువడిన ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ ఫలితాలలో శ్రీ ఆదిత్య జూనియర్ కాలేజీ విద్యార్థులు స్టేట్ ర్యాంకులతో ప్రభంజనం సృష్టించారు. జూనియర్ ఎంపీసీ నందు జే.లోకేష్ 460/470, ఎన్.సాయి దిలీప్ 459/470, ఎన్.బద్రినాథ్ 459/470, సీనియర్ ఎంపీసీ నందు ఎం.నికిత 964/1000, సీనియర్ సీఈసీ నందు ఇర్ల సాయి సరయు 968/1000, జూనియర్ సీఈసీ నందు పి.రాజ్యలక్ష్మీ 454/500, జి.కావ్య 442/500 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులకు రత్నం విద్యాసంస్థల చైర్మన్ ముద్దుల శ్రీనివాసులు, డైరక్టర్ నున్న మధునాయుడు, శ్రీఆదిత్య జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ ముట్లూరియశ్వంత్ పాల్, అధ్యాపక బృందం అభినందనలు తెలియజేశారు.

## పేదల ఆకలి తీర్చడానికే చంద్రన్న అన్న క్యాంటీన్లు

### - రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి




**సింగరాయకొండ, ఏప్రిల్ 15,ప్రభాతవార్త**
పేదల ఆకలి తీర్చడమే లక్ష్యంగా చంద్రన్న అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. బుధవారం సింగరాయకొండలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్‌ను మంత్రి స్వామి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పేదవాడికి పట్టెడన్నం పెట్టడం కంటే మించిన ఆనందం లేదని, అన్న ఎన్టీఆర్ స్ఫూర్తితో సీఎం నారా చంద్రబాబు నాయుడు అన్నా క్యాంటీన్లను ప్రారంభించారని పేర్కొన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రూ.5కే టిఫిన్, భోజనం అందిస్తూ పేదల ఆకలి తీర్చుతున్నామని చెప్పారు.రాష్ట్రంలో మొదటి విడతగా పట్టణ ప్రాంతాల్లో 207, రెండో విడతగా గ్రామీణ ప్రాంతాల్లో 62 అన్నా క్యాంటీన్లు ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఈ క్యాంటీన్ల ద్వారా ప్రతిరోజూ సుమారు 2.20 లక్షల మందికి ఆహారం అందిస్తున్నామని,ఇదిచరిత్రాత్మక కార్యక్రమమని పేర్కొన్నారు.ఉమ్మడిప్రకాశం జిల్లాలో యర్రగొండపాలెం, దర్శి, సింగరాయకొండలో ఈ క్యాంటీన్లు ప్రారంభమైనట్లు చెప్పారు. ఉదయం, మధ్యాహ్నం రూ.5కే టిఫిన్, భోజనం అందిస్తుండగా, పట్టణ ప్రాంతాల్లో రాత్రి భోజనం కూడా అందిస్తున్నామని తెలిపారు. అవసరాన్ని బట్టి గ్రామీణ ప్రాంతాల్లో కూడా విస్తరిస్తామని పేర్కొన్నారు.సింగరాయకొండ అభివృద్ధికి రూ.3 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నామని, సెంటర్‌లో ఎలక్ట్రికల్ స్తంభాలు ఏర్పాటు చేసి రెండు వైపులా లైటింగ్ కల్పిస్తామని తెలిపారు. వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో సూపర్ బజార్ నిర్మించి తక్కువ ధరలకు నాణ్యమైన సరుకులు అందిస్తామని చెప్పారు.ప్రభుత్వం మహిళా సాధికారత, ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉందని, ఇనామ్ భూముల సమస్య పరిష్కారానికి కమిటీ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఎండల తీవ్రత దృష్ట్యా పిల్లలు, వృద్ధులు అనవసరంగా బయట తిరగవద్దని సూచించారు.అనంతరం మంత్రి ప్రజలతో కలిసి అన్నా క్యాంటీన్‌లో భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు,నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## రక్షణ చట్టాలు సైబర్ నేరాలపై అవగాహన



**తాళ్లూరు,ఏప్రిల్ 15,ప్రభాతవార్త**
చట్టాలు ఆన్ లైన్ ద్వారా జరిగే ఆర్థిక మోసాల గురించి మహిళలు అవగాహనతో ఉండాలని ఎస్సై ఎస్. మల్లికార్జునరావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయం లో వీవోఏలకు నూతన క్రిమినల్ చట్టాలపై అవగాహన కార్యక్రమం బుధవారం జరిగింది. ఎస్సై మల్లికార్జునరావు మాట్లాడుతూ మహిళలు చట్టాలు,ఆన్ లైన్ మోసాల గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు.సైబర్ నేరం జరిగినప్పుడు 1930కి డయల్ చేసి సమస్యలు చెప్పొచ్చన్నారు. ప్రత్యేకంగా మహిళలు తమ సమస్యలు చెప్పేందుకు 112కు డయల్ చేయవచ్చని పేర్కొన్నారు. మహిళలు ఇబ్బందికర పరిస్థితుల్లో ఉన్నప్పుడు శక్తి యాప్ ను ఉపయోగించి పోలీస్‌ల సహకారం కోరవచ్చని తెలిపారు. సైబర్ నేరాలకు బలికావద్దని, ఆన్ లైన్ యాప్ ద్వారా లోన్స్ తీసుకోవద్దని తెలిపారు. అపరిచితులకు ఓటీపీలు, బ్యాంకు అకౌంట్ వివరాలు తెలియచేయకూడదని తెలిపారు. ఇటు వంటి మోసాలు జరిగితే వెంటనే పోలీస్ లకు సమాచారం ఇవ్వాలని సూచించారు.ఆన్ లైన్ మోసాలపై అవగాహన కలిగిఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారణపై పలు సూచన చేశారు.కార్యక్రమంలో ఏపీఎం దేవరాజు,సీసీ మోహన్‌రావు, ఎం. సుజాత, మోపూరి విజయలక్ష్మి,కానిస్టేబులు, వీవోఏలు పాల్గొన్నారు.

# పౌష్టికాహారంతో తల్లీబిడ్డలకు ఆరోగ్యం



**తాళ్లూరు,ఏప్రిల్ 15,ప్రభాతవార్త**
గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే పుట్టబోయే బిడ్డతోపాటు, తల్లికూడా ఆరోగ్యంగా ఉంటుందని సూపర్ వైజర్ సునీత అన్నారు.దర్శి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో తాళ్లూరు మండలం దారంవారి పాలెం లోని అంగన్వాడీ కేంద్రంలో బుధవారం పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా అంగన్వాడీ సూపర్ వైజర్ మాట్లాడుతూ రెండేళ్ల లోపు పిల్లలకు జంక్ ఫుడ్ కు సంబంధించిన తినుబండారాలు పెట్ట వద్దన్నారు. అలాంటి పదార్థాల వల్ల కలిగే అనార్థాలను వివరించారు. పౌష్టిక ఆహారానికి సంబంధించిన ఆహార పదార్థాలను ఇంట్లో తయారుచేసి పిల్లలకు అందించాలన్నారు. కార్యక్రమంలో అంగన్ వాడీ కార్యకర్త వేదవతి, సుభాషిణి,బాలింతలు, గర్భిణీలు పాల్గొన్నారు.

## జిల్లా ప్రథమ స్థానం సాధించిన పొన్నలూరు విద్యార్థినులు




**పొన్నలూరు ,ఏప్రిల్ 15 ,ప్రభాతవార్త**
మండల కేంద్రమైన పొన్నలూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీకి చెందిన విద్యార్థినులు తన్నీరు శ్రీవల్లి, తన్నీరు స్వాతి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఫలితాలలో అద్భుత ప్రతిభ కనబరిచి జిల్లాలోనే మొదటి స్థానాన్ని సాధించారు. బుధవారం విడుదలైన ఫలితాల్లో వీరు బైపీసీ విభాగంలో 455 మార్కులకు గాను 446 మార్కులు సాధించి ప్రభుత్వ కళాశాలల విభాగంలో జిల్లా ప్రథమ స్థానం దక్కించుకున్నారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రబాబు మాట్లాడుతూ, తమ కళాశాల విద్యార్థినులు సాధించిన ఈ విజయం విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని అన్నారు.ఈ ఇద్దరు విద్యార్థినుల విజయంపై గ్రామస్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాగే మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు.

## వేసవి చలివేంద్రం ప్రారంభం - రైతులకు జాగ్రత్తలపై అవగాహన

**పొన్నలూరు ,ఏప్రిల్ 15 ,ప్రభాతవార్త**
మండలంలోని అగ్రహారంలో పొన్నలూరు వ్యవసాయశాఖ డీలర్ల ఆధ్వర్యంలో వేసవి చలివేంద్రం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల వ్యవసాయ అధికారి వి.రాము మాట్లాడుతూ, ప్రస్తుత వేసవి కాలంలో ఎల్ నీనో ప్రభావం కారణంగా ఎండ తీవ్రత జూలై వరకు ఎక్కువగా ఉండే అవకాశం ఉందని తెలిపారు. రైతులు మరియు ప్రజలు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసర పరిస్థితులు తప్ప బయటకు రావద్దని సూచించారు.అలాగే, డీహైడ్రేషన్ నుంచి రక్షణ కోసం కుండ నీటిని త్రాగడం, నిమ్మరసం ఎక్కువగా తీసుకోవడం అవసరమని చెప్పారు. ప్రతి వ్యక్తి రోజుకు కనీసం 5-6 లీటర్ల నీరు త్రాగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ కృష్ణయ్య, బోగనంపాడు వీడీఓ (పి.ఎస్.) సుబ్రహ్మణ్యం, మండల ఎరువుల డీలర్లు, గ్రామ నాయకులు పి. కృష్ణారెడ్డి మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మహిళల భద్రత, సైబర్ నేరాలపై అవగాహన



**పొన్నలూరు ,ఏప్రిల్ 15 ,ప్రభాతవార్త**
పొన్నలూరు మండల కేంద్రంలో మహిళల భద్రత,సైబర్ నేరాలపై డ్వాక్రా సంఘాలకు సంబంధించిన వీఆర్ఏలకు, మహిళలకు స్థానిక ఎస్ఐ పి.సత్యనారాయణ అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా మహిళలపై జరుగుతున్న నేరాలు, సైబర్ నేరాలు, అలాగే ఫేస్బుక్,ట్విట్టర్, వాట్సాప్ వంటి సోషల్ మీడియా యాప్‌లలో ఫేక్ ప్రొఫైల్స్ ద్వారా జరుగుతున్న మోసాలపై వివరంగా తెలియజేశారు.బాలికలపై జరుగుతున్న నేరాల నివారణకు సంబంధించిన పోక్సో యాక్ట్ చట్టం గురించి అవగాహన కల్పించారు.మహిళలు అప్రమత్తంగా ఉండి, అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# పామూరు సీఐ వినోద్‌కుమార్ విద్యార్థులకు కీలక సూచనలు




పామూరు, ఏప్రిల్ 15, ప్రభాతవార్త
బుధవారం ఇంటర్ పరీక్ష ఫలితాలు విడుదలైన సందర్భంగా సీఐ వినోద్ కుమార్ మాట్లాడుతూ ఇంటర్ ప్రథమ, ద్వితీయ పరీక్షల్లో ఫెయిల్ అయిన నిరుత్సాహపడకూడదని, ఆత్మహత్యల వంటి నిర్ణయాలు తీసుకోవడం పిరికితనం అన్నారు.గెలుపు ఓటములు సహజమని, ఓటమితో కృంగిపోకుండా మళ్లీ పట్టుదలతో ప్రయత్నించాలని విద్యార్థులకు ఆయన సూచించారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తుంచుకుని కష్టపడి చదివి మంచి భవిష్యత్తు సాధించాలని సీఐ వినోద్ కుమార్ విద్యార్థులకు పిలుపు నిచ్చారు. పాసైన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

mrk-7_mrk-7.qxd 4/16/2026 12:31 AM Page 1



# బీసీ వర్గాలకు ప్రాధాన్యం

**- టీడీపీ కీలక నియామకాలపై కృతజ్ఞతలు - కనిగిరి బాల వెంకట రమణ**



**మార్కాపురం, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ కీలక నియామకాల నేపథ్యంలో బీసీ వర్గాల్లో ఆనందం వ్యక్తమవుతోంది. పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆధ్వర్యంలో పలు కీలక పదవుల నియామకాలు చేపట్టారు. రజక జాతికి చెందిన గల్లామాధవిని పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యురాలిగా, దువ్వారపు రామారావును ఉపాధ్యక్షుడిగా నియమించడం పట్ల రజక ఫెడరేషన్ మాజీ డైరెక్టర్, తెలుగుదేశం రాష్ట్ర బీసీ అధికార ప్రతినిధి కనిగిరి బాల వెంకట రమణ హర్షం వ్యక్తం చేశారు. అలాగే మార్కాపురం నియోజకవర్గానికి చెందిన వక్కలగడ్డ మల్లికార్జున, గునుపూడి భాస్కర్లను రాష్ట్ర కార్యదర్శులుగా నియమించడం ప్రత్యేకంగా ప్రస్తావించబడింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ బీసీ అధికార ప్రతినిధి కనిగిరి బాల వెంకటరమణ ఒక ప్రకటనలో పార్టీ అధినేతలైన చంద్రబాబునాయుడు, నారాలోకేష్, మార్కాపురం శాసనసభ్యులు కందులనారాయణరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నియామకాలతో బీసీ వర్గాలకు పార్టీ మరింత ప్రాధాన్యం ఇస్తోందని ఆయన పేర్కొన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో మెరిసిన కమలా ఆణిముత్యాలు



**మార్కాపురం, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**

ఏపీ ఇంటర్మీడియట్ ఫలితాల్లో మార్కాపురం పట్టణంలోని కమలా జూనియర్ కళాశాల విద్యార్థులు మరోసారి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి తమ సత్తా చాటుకున్నారు. ఈ విషయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ దేసు సుధాకర్ వెల్లడించారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో షేక్ రమీయా బేగం, రాజారపు వెంకట శివ కార్తీక్‌లు 470 మార్కులకు గాను 465 మార్కులు సాధించి సంయుక్త ప్రథమ స్థానం పొందారు. 463మార్కులతో మేడం వెంకట హాసిని, వల్లెల రాజేశ్వరి, కె. పునీతలు ద్వితీయ స్థానంలో నిలిచారు. బైపీసీ విభాగంలో షేక్ ఆఫ్రిన్ 449మార్కులతో ప్రథమ స్థానం సాధించగా, సుంకర ప్రసన్న 445మార్కులతో ద్వితీయ స్థానం పొందారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో మగులూరి రామ కుసుమిత, రావిపాటి జ్యోత్స్నలు 986మార్కులతో అగ్రస్థానంలో నిలిచారు. షేక్ నసీహా 985 మార్కులతో ద్వితీయ స్థానం సాధించారు. బైపీసీ విభాగంలో లింగాల ప్రిస్కిల్ల 987మార్కులతో ప్రథమ స్థానం, షేక్ సాహిన్ 984మార్కులతో ద్వితీయ స్థానం పొందారు. సీఈసీ విభాగంలో అనులేఖ 957మార్కులతో ప్రథమ స్థానం సాధించారు. విద్యార్థులు అధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించడం గర్వకారణమని ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో పాటు వారికి మార్గదర్శకత్వం వహించిన అధ్యాపకులను కళాశాల సెక్రటరీ పెనుగొండ పవన్ కుమార్ అభినందించారు.

## అన్న క్యాంటీన్ ప్రారంభించిన మార్కాపురం జిల్లా కలెక్టర్ విజయ సునీత





**యర్రగొండపాలెం, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**

యర్రగొండపాలెం బస్టాండ్ సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను మార్కాపురం జిల్లా కలెక్టర్ విజయ సునీత ముఖ్య అతిథిగా పాల్గొని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం భోజనం నాణ్యతను పరిశీలించిన కలెక్టర్, అక్కడి పేదలకు స్వయంగా ఆమె భోజనం వడ్డించి వారితో కలిసి భోజనం చేసి అక్కడి ప్రజలకు ఆ కలెక్టరమ్మ భరోసా కల్పించారు. తమతోపాటు కలెక్టరమ్మ నాయకులు కలిసి భోజనం చేస్తుండడం చూసిన జనాలు సంతోషానికి అవధులు లేకుండ పోయాయి. అనంతరం మండల అభివృద్ధి అధికారి శ్రీనివాసులు అధ్యక్షతన భారీ బహిరంగ సభ జరిగింది. ఈ సభలో కలెక్టర్‌తో పాటు కనిగిరి శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, యర్రగొండపాలెం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ విజయ సునీత మాట్లాడుతూ పేదలు, కార్మికులు, కూలీలు తక్కువ ధరకే నాణ్యమైన భోజనం అందించడం కోసమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. అందరికి ఆహార భద్రత అనే నినాదంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తోందని, ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 207 అన్న క్యాంటీన్లు పని చేస్తున్నాయని, వాటి ద్వారా రోజు 2.10 లక్షల మంది పేదలకు ప్రభుత్వం భోజనం అందిస్తుందని కలెక్టర్ అంకెలతో సహా వివరించారు. అదే విధంగా మతరో 62 గ్రామీణ క్యాంటీన్లను మండల కేంద్రంలో ఉండే విధంగా అందుబాటులోకి తీసుకొచ్చారని అన్నారు. కొత్త జిల్లా అభివృద్ధి పథంలో నడిపేందుకు ప్రభుత్వ సహకారంతో శాయశక్తుల కృషి చేస్తానని తెలిపారు. వెలుగొండ ప్రాజెక్టు త్వరితగతిన పూర్తవుతుందని, అందుకు ముఖ్యమంత్రి ఎనలేని కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాట్లాడిన మరో అతిథి కనిగిరి శాసనసభ్యులు ఉగ్ర నరసింహారెడ్డి తన ప్రసంగంతో సభలో నవ్వులు పూయించారు. ముఖ్యంగా గత ప్రభుత్వ తీరుతెన్నులను విమర్శించిన ఆయన అన్న క్యాంటీన్‌లపై మాట్లాడుతూ పేదలు, కూలీలు, రిక్షాపుల్లర్లతో పాటు ముఖ్యంగా భార్యలు చనిపోయిన వారికి అన్న క్యాంటీన్లు మంచి సౌలభ్యంగా ఉంటాయని అనగానే సభలో ఘల్లు మంటు నవ్వులు వినిపించాయి. ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబుతో పాటు ఆ పార్టీ ఐదు మండలాల శ్రేణులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాస్‌ఫెయిల్ కాదు.. పట్టుదలే గెలుపు, భవిష్యత్తు మీ చేతుల్లోనే

**- అన్నా రాంబాబు మాజీ శాసనసభ్యులు**



**మార్కాపురం టౌన్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**

పాస్ ఫెయిల్ ముఖ్యం కాదు, పట్టుదలే అసలైన గెలుపు అని, భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉంద అని మార్కాపురం వైయస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అన్నా రాంబాబు విద్యార్థులకు కీలక సూచనలు చేశారు. బుధవారం విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల సందర్భంగా ఆయన సోషల్ మీడియాతో మాట్లాడుతూ పరీక్షల్లో ఫెయిల్ అయినా విద్యార్థులు నిరుత్సాహపడకూడదన్నారు. ఆత్మహత్యల వంటి నిర్ణయాలు తీసుకోవడం పిరికితనం అని పేర్కొన్నారు. గెలుపు, ఓటములు సహజమని, ఓటమితో కృంగిపోకుండా మళ్లీ పట్టుదలతో ప్రయత్నించాలని సూచించారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తుంచుకుని కష్టపడి చదివి మంచి భవిష్యత్తు సాధించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ అందజేయాలి

**- వైసిపి నేత సయ్యద్ గౌస్ మోహిద్దీన్**



**మార్కాపురం టౌన్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ అందేలా చర్యలు తీసుకోవాలని వైసిపి మైనార్టీ అధికార ప్రతినిధి సయ్యద్ గౌస్ మోహిద్దీన్ బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రేషన్ కార్డ్ లబ్ధిదారులకు రేషన్ లేదని వాటి స్థానంలో డబ్బులు అందజేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. దీంతో పేదలైన రేషన్ కార్డు లబ్ధిదారులు ఆ సొమ్ముతో బయట పెరిగిన ధరలకు అనుగుణంగా రేషన్ కొనుగోలు చేయలేకపోతున్నారని ఆవేదన వ్యక్తిత్వం చేశారు. కాబట్టి అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు ద్వారా రేషన్ పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వైసిపి హయాంలో ఇంటివద్దకే రేషన్ చేర్చే ప్రక్రియ కొనసాగేదని, ఇంటి వద్దనే నిశ్చింతగా పేద లబ్ధిదారులు రేషన్ పొందే వారిని ఆయన గుర్తు చేశారు. కూటమి సర్కార్ రాకతో ఆ అవకాశాన్ని రాష్ట్ర ప్రజలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి సర్కా రేషన్ పంపిణీలో చేస్తున్న చర్యలతో రాష్ట్ర ప్రజల భ్రమలు ఈ ప్రభుత్వం పై తొలగిపోతున్నాయని ఆయన పేర్కొన్నారు. త్వరలోనే వైసీపీ సర్కార్ మళ్లీ వస్తుందని ఇంటి వద్దకే రేషన్ తీసుకొని వస్తుంది ఆయన హామీ ఇచ్చారు. ఇది జగన్ ఇచ్చే హామీ అని, అందుకే వైసిపి ప్రతి నేత కార్యకర్త ఈ హామీని నిర్భయంగా ఇస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

## శరవేగంగా వెలిగొండ పనులు.. త్వరలో ప్రాజెక్టు పూర్తి

**- బిజెపి రాష్ట్ర మీడియా ప్రతినిధి డా. ఏలూరి రామచంద్రారెడ్డి**



**మార్కాపురం, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**

ఉమ్మడి ప్రకాశం జిల్లా తో పాటు నెల్లూరు, కడప జిల్లాలకు వరప్రదాయని అయిన శ్రీ పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టును కూటమి ప్రభుత్వం శరవేగంగా పూర్తి చేయడానికి కట్టుబడి ఉందని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి తెలిపారు. ప్రాజెక్టు పనుల పురోగతిని పర్యవేక్షించేందుకు రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు ప్రతి రెండు నెలలకోసారి వెలిగొండ ప్రాజెక్టు టన్నెళ్లను సందర్శిస్తూ, పనులు జరుగుతున్న తీరును సమీక్షిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూడా ప్రాజెక్టును సందర్శించి, పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు గుర్తు చేశారు. ఈ ప్రాంత అభివృద్ధి పట్ల కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, అందులో భాగంగానే మార్కాపురాన్ని జిల్లాగా ఏర్పాటు చేయడం, అలాగే వెలిగొండ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయడం ప్రభుత్వం పనితీరుకు నిదర్శనమని అన్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో కీలకమైన ఆర్ ఆర్ (రీహాబిలిటేషన్ అండ్ రీసెటిల్‌మెంట్) ప్యాకేజీని కూటమి ప్రభుత్వం త్వరలో ప్రకటించే అవకాశం ఉందని వెల్లడించారు. ఈ ప్రాజెక్టు పూర్తయిన తరువాత ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని, తాగునీటి సమస్య కూడా పూర్తిగా తొలగిపోతుందని డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి కావడం ద్వారా 4.32 లక్షల ఎకరాలకు సాగు నీరు అందుతుందని, తద్వారా పంటల ఉత్పత్తి పెరిగి, రైతుల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని బిజెపి రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రా రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

మార్కాపురం వార్త



## ఆన్‌లైన్‌లో సెన్సస్ నమోదు అవకాశం

**- తహసీల్దార్ పుల్లారావు**

**పొన్నలూరు, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**

ప్రభుత్వం విడుదల చేసిన తాజా సమాచార ప్రకారం జనాభా గణన (సెన్సస్)కు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించినట్లు తహసీల్దార్ పుల్లారావు ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా ఇళ్లకు సంబంధించిన వివరాలు నమోదు చేసుకోవచ్చని, ఇందుకోసం [https://se.census.gov.in](https://se.census.gov.in) వెబ్‌సైట్‌ను సందర్శించి ఏప్రిల్ 16 నుండి ఏప్రిల్ 30, 2026 వరకు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రజలు ఈ స్వీయ నమోదు అవకాశాన్ని వినియోగించుకుని తమ వివరాలను సరిగా నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# పట్టు సాగుతో రైతులకు అధిక ఆదాయం

**- కలెక్టర్ విజయ సునీత పిలుపు**

**మార్కాపురం, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**

సాధారణ పంటలతో పాటు ఆదాయాన్ని పెంచే పట్టు సాగుపై రైతులు ఆసక్తి చూపాలని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత సూచించారు. బుధవారం మార్కాపురంలోని పట్టు పరిశ్రమ కార్యాలయంలో నిర్వహించిన పట్టు సాగు అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పట్టు సాగుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలుప్రత్యేక సబ్సిడీలు అందిస్తున్నాయని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 90శాతం, ఇతర రైతులకు 50శాతం రాయితీ కల్పిస్తున్నట్లు వివరించారు. ప్రస్తుతం జిల్లాలో 480మంది రైతులు సుమారు 1200ఎకరాల్లో పట్టు పంట సాగుచేస్తున్నారని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో మల్బరీ సాగుపై విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. ఇతర ప్రాంతాల్లో అమలవుతున్న ఆధునిక సాగు పద్ధతులను తెలుసుకొని రైతులు ఈపంటను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. సాధారణ పంటల కంటే పట్టు సాగులో అధికఆదాయం లభిస్తుందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలని, సందేహాలను అధికారుల ద్వారా నివృత్తి చేసుకోవాలని రైతులకు సూచించారు. మరింత మంది రైతులను ఈ పంట సాగులోకి తీసుకురావడానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. అనంతరం సబ్సిడీపై వచ్చిన పట్టు సాగుకు సంబంధించిన యంత్ర పరికరాలను రైతులకు కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పట్టు పరిశ్రమశాఖ అధికారి పి సుజయ్ కుమార్, అడిషనల్ డైరెక్టర్ అరుణకుమారి, శాస్త్రవేత్త ఇబ్రహీం భాష తదితరులు పాల్గొన్నారు.






## చిన్నారుల మానసిక సన్నద్ధత పెంచడానికి తోడ్పడాలి



**వేటపాలెం, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**

పిల్లల మానసిక వికాసానికి, ఉత్సాహానికి తల్లిదండ్రుల సహకారం ఎంతో అవసరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సజ్జ పుష్పవల్లి తెలిపారు. వేటపాలెం సెక్టార్ పరిధిలోని సర్వోదయ కాలనీ వన్ కేంద్రంలో బుధవారంజరిగిన పోషణ్ పక్వాడా కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రతి రోజు అంగన్‌వాడీ కేంద్రంలో చదువుకుంటున్న చిన్నారులను పార్కులకు తీసుకువెళ్లి చిన్నారులతో ఆటలాడించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. తద్వారా వారి మానసిక, శారీరక ఎదుగుదలకు ఎంతో తోడ్పాటు నందించిన వారవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా కానిస్టేబుల్ పద్మజ, ఎంఎల్‌హెచ్‌పీ శిరోరాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు రత్నకుమారి, కాశమ్మ, చిన్నారుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# పోషకాహారంపై మహిళల్లో చైతన్యం

**- డ్వాక్రా బజార్‌లో కార్యక్రమం**

**మార్కాపురం, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**

మార్కాపురం పట్టణంలోని డ్వాక్రా బజార్‌లో పోషణ్ పక్వాడ కార్యక్రమం భాగంగా మహిళల్లో పోషకాహారంపై అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించారు. వెలుగు గ్రామ సంఘాల లీడర్లు, వీవోఏలు, ఐసీడీఎస్ సిబ్బంది కలిసి మహిళా సంఘ సభ్యులకు ఆరోగ్యకర ఆహారపు అలవాట్లపై వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా సెర్ప్ అడిషనల్ డైరెక్టర్ (హ్యూమన్ డెవలప్మెంట్) ఎస్ దేగలయ్య మాట్లాడుతూ ప్రతి కుటుంబం పోషకాహారాన్ని తప్పనిసరిగా ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. చిన్నారులను మొబైల్, టీవీ వంటి స్క్రీన్‌లకు దూరంగా ఉంచి, ఆటల ద్వారా నేర్పించాలని అన్నారు. ఇంటివద్దనే కిచెన్ గార్డెన్స్ ఏర్పాటు చేసి ఆకుకూరలు, కూరగాయలు పండించుకోవాలని, చిరు ధాన్యాలను ఎక్కువగా వినియోగించాలని సూచించారు. బయట లభించే జంక్ ఫుడ్, ప్లాస్టిక్ ప్యాకేజింగ్ ఆహార పదార్థాలను తగ్గించాలని తెలిపారు. మహిళలతోపాటు పురుషుల్లో కూడా పోషణపై అవగాహన పెంచాలని, కుటుంబ సభ్యుల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీపీఎం దానం, ఏపీఎం పిచ్చయ్య, ఎల్‌సీ నాగభూషణం, శ్రీనిధి మేనేజర్ సులోచన, సీసీలు నాగయ్య, రామగోపాల్ రెడ్డి, వెంకటేశ్వర్లు, మనోకుమారి, అకౌంటెంట్ నాగమణి, అంగన్వాడీ సూపర్వైజర్లు, టీచర్లు, వీవోఏలు, గ్రామ సంఘాల లీడర్లు పాల్గొన్నారు. అనంతరం వెలుగు కార్యాలయంలో 2026-27 వార్షిక ఋణ-జీవనోపాధుల సర్వేపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఏపీఎం డి పిచయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సెర్ప్ అడిషనల్ డైరెక్టర్ ఎస్ దేగలయ్య పాల్గొని సర్వే పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ఈ నెల20 నుంచి30లోపు అన్ని సంఘాల్లో సర్వే పూర్తి చేయాలని తెలిపారు. ఎల్‌హెచ్ డీపీఎం డి.దానం మాట్లాడుతూ ఋణప్రణాళికలో 50 జీవనోపాధులకు, 50 కుటుంబ అవసరాలకు కేటాయించాలని సూచించారు.





### విద్యార్థులకు అన్నిరకాల వసతులు



**రాచర్ల, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు అన్ని రకాల వసతులతో పాటు ఉత్తమ విద్య బోధిస్తున్నట్లు ఆరవీటికోట ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి వి కృష్ణయ్య అన్నారు. ఎన్రోల్మెంట్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన ఆరవీటి కోట గ్రామంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక వసతులు, ఉత్తమ విద్య, వారు సాధిస్తున్న మెరుగైన ఫలితాల గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒత్తిడి లేని నాణ్యమైన విద్యకొరకు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాల పట్ల అవగాహన సదస్సు



**మార్కాపురం టౌన్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**

అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్నిమాపక సిబ్బంది ఆధ్వర్యంలో మార్కాపురం పట్టణంలోని జగదీశ్వరి థియేటర్ నందు, సిఎంఆర్ షాపింగ్ మాల్ నందు, రాయవరం గ్రామం నందు అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. అదేవిధంగా మార్కాపురం రైల్వే స్టేషన్, మార్కాపురం ఆర్టీసీ బస్టాండ్ నందు ప్రజలకు అగ్ని ప్రమాదాల పట్ల అవగాహన కల్పించి, అగ్ని ప్రమాదాలు జరగకుండా ఎటువంటి జాగ్రత్త చర్యలు పాటించాలి, అనుకోకుండా ఏదైనా అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు ఆ ప్రమాదం నుండి ఏ విధంగా తమ ప్రాణ ఆస్తి నష్టాలను కాపాడుకోవాలో వారికి వివరించారు. అనంతర అందరికీ కరపత్రాలు పంపిణీ చేశారు. అదేవిధంగా జాగ్రత్త చర్యలు గల గోడపత్రికలను ఆయా ప్రదేశాలలో అందరికీ కనబడే విధంగా అంటించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ఇంటర్ ఫలితాల్లో అక్షర జూనియర్ కాలేజీ విద్యార్థుల విజయకేతనం





**పామూరు, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**

బుధవారం వెలువడిన ఇంటర్ పరీక్షా ఫలితాల్లో అక్షర జూనియర్ కాలేజీ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. జూనియర్ ఎంపీసీ నందు గోసు నాగ ప్రణవి 466/470, యనమల ఉష 465/470, ఉంగరాలు రామ్ చరణ్ 464/470, సుంకే స్నేహ 461/470, వినకొండ నాగ సంజన్ 461/470 మార్కులు సాధించి ప్రతిభ కనపరిచారు.

### ఇంటర్ పరీక్షా ఫలితాల్లో ప్రతిభ చూపిన ఆదర్శ విద్యార్థులు







**రాచర్ల, ఏప్రిల్ 15 ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన ఇంటర్ పరీక్ష ఫలితాల్లో రాచర్ల ఆదర్శ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపి ఉత్తమ ఫలితాలు సాధించారని ప్రథమ ఇంటర్ లో 97 మందికి గాను 84 మంది ఉత్తీర్ణులై 86.59 ఫలితాలు సాధించగా ద్వితీయ ఇంటర్ లో 65మందికి గాను 61మంది ఉత్తీర్ణులై 94% ఫలితాలు సాధించారు. ప్రథమ ఇంటర్‌లో సుహానా అనే ఎంఇసి విద్యార్థిని 500కు గాను 491మార్కులు సాధించి స్టేట్ టాపర్‌గా నిలిస్తే ద్వితీయ ఇంటర్‌లో పుష్పలత అనే బైపిసి విద్యార్థిని 1000కి 973 మార్కులు సాధించి కళాశాలలో ప్రథమ స్థానం పొందింది అయేషా సి ఇ సి విద్యార్థిని 1000/953 మార్కులు సాధించి తనప్రతిభ చాటింది. ఇకపోతే గురుకుల పాఠశాల ప్రథమ ఇంటర్ బాలికలు 72మందికి గాను 65మంది ఉత్తీర్ణులై 90శాతం ద్వితీయ ఇంటర్ బాలికలు 65 మందికి గాను 57 మంది ఉత్తీర్ణులై 88% ఫలితాలు సాధించారు. కేజీబీవీలో ప్రథమ ఇంటర్‌లో 21మందికి గాను 15మంది ఉత్తీర్ణులై 71.4 శాతం ద్వితీయ ఇంటర్ లో 15మందికి గాను 10మంది ఉత్తీర్ణులై 66.6% ఫలితాలు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఎంఈఓ గిరిధర్ శర్మ, ఆయా పాఠశాలల ప్రిన్సిపల్స్, ప్రత్యేక అధికారులు అభినందించారు.

### ట్రాఫిక్ రూల్స్ పాటించకపోతే చర్యలు తప్పవు : ఎస్ఐ శివరామయ్య



**త్రిపురాంతకం, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**

త్రిపురాంతకం టౌన్ పరిధిలో గల మార్కాపూర్ బైపాస్ రోడ్డు నందు బుధవారం ఎస్ఐ శివరామయ్య తనసిబ్బందితో కలిసి అక్కడ చేరిన వాహనదారులతో సమావేశం ఏర్పాటు చేసి ట్రాఫిక్ నియమ నిబంధనల గురించి వారికి తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ శివరామయ్య మాట్లాడుతూ ఎవరైనా సరే మద్యం సేవించి వాహనాలు నడిపినా, హెల్మెట్ లేకుండా వాహనం నడిపిన, బండికి సరైన పత్రాలు లేకుండా వాహనం నడిపిన చర్యలు కఠినంగానే ఉంటాయని ఆయన తెలియజేశారు. మీ మీద పెద్ద కుటుంబ వ్యవస్థ ఆధారపడి ఉందని కావున మీరు వాహనం నడిపే సమయంలో మీ కుటుంబాన్ని దృష్టిలో ఉంచుకొని తగిన విధంగా రూల్స్ పాటిస్తూ వాహనాన్ని నడపాలని ఆయన తెలియజేశారు, తాగి వాహనం నడిపినట్లయితే రూ.10వేలు జరిమానా, 14రోజులు రిమాండ్ కచ్చితంగా చేయవలసి ఉంటుందని ఆయన తెలిపారు. కనుక వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని వాహనదారులు మెలకువతో రూల్స్ అధిగమించకుండా వాహనాన్ని నడపాలని ఆయన తెలియజేశారు. చివరిగా అక్కడ కూడిన వాహనదారులతో ప్రమాణాలు చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శివరామయ్యతో పాటు మరికొందరి సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రూపు 2 అభ్యర్థిని అభినందిస్తున్న ఎమ్మెల్యే



**కందుకూరు ఏప్రిల్ 15, ప్రభాతవార్త**

కందుకూరు పట్టణంలోని పర్సు సురేష్ గ్రూపు-2 పోస్టుల ఫలితాల్లో సబ్ రిజిస్ట్రర్‌గా ఎంపికైనారు. దీంతో ఆయనను స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు బుధవారం అభినందించారు. ఆదిఆంధ్రకాలనీకి చెందిన ఈయన గతంలో రెవిన్యూశాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. మెరుగైన ఉద్యోగం సాధించాలన్న తలంపుతో గ్రూపు-2పోస్టుల పరీక్షలకు హాజరయ్యారు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో ఆయన విజయం సాధించారు. ఈ నేపథ్యంలో సురేష్ స్థానిక ఎమ్మెల్యే ఇంటూరిని బుధవారం తెదేపా కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. దీంతో శాసనసభ్యులు ఆయనను గౌరవంగా సత్కరించారు. అభినందించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి చదలవాడ కొండయ్య, తెదేపా నాయకులు పర్సు నాగేశ్వరరావు, చదలవాడ కోటేశ్వరరావు, హైస్కూలు పీడీ కత్తి ఐజాక్, మున్సిపల్ రెవిన్యూ అధికారి రామయ్య తదితరులు పాల్గొని సురేష్‌ను అభినందించారు.

## కందుకూరు పట్టణంలో ఎమ్మెల్యే విస్తృత పర్యటన

**- పారిశుధ్యంపై పరిశీలన - అధికారులుపై ఆగ్రహం**



**కందుకూరు ఏప్రిల్ 15, ప్రభాతవార్త**

కందుకూరు పట్టణంలో నెలకొన్న అపరిశుభ్రతను సహించబోనని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. ఇందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు, సిబ్బందిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తీరు మార్చుకోవాలని ఆయన సూచించారు. లేనిచో చట్టపర చర్యలుంటాయన్నారు. అవసరమైన ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజి నిర్మాణానికి ప్రతిపాదనలు తయారుచేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. బుధవారం ఆయన తనదైన శైలిలో పట్టణంలోని కోవూరు రోడ్డులోని 1,3,4 వార్డులతో పాటు ఉప్పుచెరువు, జనార్ధన కాలనీ, టీఆర్‌ఆర్ కాలేజీ పడమర వైపు, బలరామయ్య తోట, ఆర్టీసీ డిపో ఉత్తరం వైపు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. కాలినడకన, బైక్‌పై తిరుగుతూ వార్డుల్లో మురుగుకాలువల్లో గల అపరిశుభ్రతను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఇందుకు బాద్యులైన మున్సిపల్ అధికారులు సిబ్బంది పనితీరును ఆక్షేపించారు. రోజుల తరబడి సైడ్ కాలువలు శుభ్రం చేయడం లేదని, ఫలితంగా దోమలు, దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఈ మేరకు ఆయనకు ప్రత్యక్షంగా చూపించారు. దీంతో ఆయన మున్సిపాలిటీ సిబ్బందిపై పలుసార్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల నుంచి ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయన్నారు. పలుమార్లు హెచ్చరించినా తీరు మారడం లేదన్నారు. ఇకనుంచి తరచుగా వార్డుల్లో ఆకస్మికంగా పర్యటిస్తానని చెప్పారు. వార్డుల్లో నిర్మించాల్సిన సీసీరోడ్లు, డ్రైనేజీ కాలువలకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. డ్రైనేజీ నిర్మాణాల్లో వాలుతలం సక్రమంగా పాటించకపోతే, సదరు కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులు నిలిపివేయాలని కూడా ఎమ్మెల్యే ఆదేశించారు.

**ఆక్రమణలు తొలగించండి :**

ఆర్టీసీ డిపో ఉత్తరం వైపు రోడ్డులో సైడు కాలువలపై గల ఆక్రమణలను తొలగించాలని కమీషనర్ అనూషాకు సూచించారు. కొత్తగా భవనాలు నిర్మించుకునే వారికి నోటీసులు ఇచ్చి, వ్యర్థాలను సైడ్ కాలువల్లో వెయ్యకుండా చూడాలన్నారు. పరిసర ప్రాంతాల్లో చెత్త పేరుకుపోయి ఉండడాన్ని ఎమ్మెల్యే గమనించారు. డస్ట్ బిన్లు ఏర్పాటు చేసుకోవాలని డిపోమేనేజర్ శ్రీనివాసులుకు సూచించారు. 3వ వార్డులోని కాలనీ భూములు 15 సంవత్సరాలుగా నిషేధిత 22ఏ జాబితా నుంచి తొలగించిన విషయాన్ని స్థానికులకు ఎమ్మెల్యే గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అనూషా, డిఈ గణపతి, పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, బిజెపి కన్వీనర్ ఘట్టమనేని హరిబాబు, వివిధ హోదాల్లో గల తెదేపా నేతలు ఉన్నం వీరాస్వామి, చిలకపాటి మధు, పోకూరి రాంబాబు, షేక్ రఫీ, కూనం నరేంద్ర, చదలవాడ కొండయ్య, గడ్డం మాలకొండయ్య, పులి నాగరాజు, పువ్వాడి మురళి, మంచిరాజు మురళీమోహన్, సవిడిబోయిన వెంకటకృష్ణ, వడ్డేళ్ల రవిచంద్ర, నందనవనం రామసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## దాతృత్వానికి దిక్సూచి... పాఠశాలలో జలశుద్ధి కేంద్రం

**- వంటశాల ఏర్పాటు**





**కనిగిరి, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**

కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని పాతూరు ప్రాథమిక పాఠశాలలో దాతల సహకారంతో మౌలిక వసతులు అభివృద్ధి చెందాయి. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని కనిగిరి వాస్తవ్యులు పోతంరెడ్డి సుధీర్‌రెడ్డి జ్ఞాపకార్థం వారి స్నేహితుడు శివకృష్ణ రూ.70వేల రూపాయల వ్యయంతో జలశుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓ-1 డీవీ సుబ్బారావు, ఎంఈఓ-2 నారాయణరెడ్డి హాజరై సుధీర్‌రెడ్డి తల్లిదండ్రులు మాలకొండా రెడ్డి, ఈశ్వరమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి అధ్యక్షతన శుద్ధజల కేంద్రాన్ని ప్రారంభించారు. అదే విధంగా పాతూరుకు చెందిన కి.శే మోహన్‌రావు కృపమ్మ జ్ఞాపకార్థంగా వారి కుమారుడు, స్నేహహస్తం చారిటబుల్ ట్రస్టు చైర్మన్ సుధీర్‌బాబు పాఠశాల ఆవరణలో వంటశాలను నిర్మించి ప్రారంభించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాతలను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.దాతల సహకారంతో పాఠశాలలో మౌలిక వసతులు మెరుగుపడటంతో విద్యార్థులకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం కలుగుతుందని పేర్కొన్నారు.

## పట్టుదలతో పతాక స్థానం..

**- ఎంఎస్ఆర్ బాలికల కళాశాల విద్యార్థుల రికార్డు**















**కనిగిరి, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**

కనిగిరి పట్టణంలోని ఎంఎస్ఆర్ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పట్టుదల, కృషితో విశిష్ట ఫలితాలు సాధించి రికార్డు స్థాయి మార్కులు సాధించారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ విభాగాల్లో విద్యార్థులు అగ్రస్థానాల్లో నిలిచి కళాశాలకు కీర్తి తీసుకొచ్చారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం(ఎంపీసీ) విభాగంలో కే.భవ్యశ్రీ 984/1000 సాధించారు. ఉప్పురేఖ 983/1000, అలాగే కోటపాటి నందిని 982/1000, ఎం.వెంకట రితిక 981/1000 సాధించి ప్రతిభ చాటారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం విభాగంలో కుర్ర గురువర్ధన- 983/1000 మార్కులు, కొర్రపాటి మౌనిక- 979/1000, షేక్ హప్స-976/1000 సాధించడం జరిగింది. ఇంటర్ ద్వితీయ సంవత్సరం సీఈసీ విభాగంలో పిల్లి రంగావతి 942/1000, మామిడి నవనీత 930/1000 మార్కులు సాధించారు. అలాగే ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో గోపవరపు దీక్షిత 455/470, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం బైపీసీ విభాగంలో కోలా అలేఖ్య 425/455, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం సీఈసీ విభాగంలో షేక్ మస్తాన్‌బి 486/500, ముంగర బ్యుల 483/500 మార్కులు సాధించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కృషి, క్రమశిక్షణతో చదివి మంచి ఫలితాలు సాధించడం ఆనందంగా ఉందన్నారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులను అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయుల శ్రమ, తల్లిదండ్రుల సహకారం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. ఇంతటి విజయం సాధించిన బోధన, బోధనేతర సిబ్బందిని అభినందించారు.

## అక్షరాల దిశగా అడుగులు.. మారెళ్ళలో విద్యార్థుల చేర్పులు వేగం



**పీసీపల్లి, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**

పీసీపల్లి మండలంలో విద్యార్థుల నమోదు(ఎన్‌రోల్‌మెంట్) కార్యక్రమం వేగవంతంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారి ఆర్.శ్రీనివాసులు,మారెళ్ళ మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు.ఈ సందర్భంగా ఐదవ తరగతి చదువుతున్న 8 మంది విద్యార్థులను ఆరో తరగతిలో చేర్పించారు. అలాగే అంగన్‌వాడీలో ఐదుసంవత్సరాలు నిండిన ముగ్గురు బాలబాలికలను మారెళ్ళ మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలలో చేర్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఆర్.శ్రీనివాసులు,ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శ్యాంప్రసాద్, ఎం.మధుబాబు,పి.ఆదిలక్ష్మీ, మాధవరావు పాల్గొన్నారు. ప్రతి బాలబాలిక చదువు వైపు అడుగులు వేయాలని, నమోదు కార్యక్రమాన్ని మరింతగా విస్తరించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

## అందరికి అన్నం పెట్టి ఆకలి తీర్చడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం

**- దర్శిలో అన్నా క్యాంటీన్‌ని ప్రారంభించిన టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ**








**దర్శి, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**

దర్శి పట్టణం కురిచేడు రోడ్డులో బుధవారం అన్న క్యాంటీన్‌ను దర్శి తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ ప్రారంభించారు. వారితో పాటు టీడీపీ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్, మాజీ శాసనసభ్యులు నారపుశెట్టి పాపారావు, దర్శి మండల తహసీల్దార్ శ్రావణ్ కుమార్, దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దర్శి ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి సుబ్బారావు, దర్శి మున్సిపల్ ఇన్‌చార్జి కమీషనర్ వి.శ్రీరామమూర్తి తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అమరావతిలో 62 అన్నా క్యాంటీన్లను వర్చువల్‌గా ప్రారంభించారు. అందులో మన దర్శి ఉండడం చాలా ఆనందంగా ఉందని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. పేద, మధ్య తరగతి ప్రజల ఆకలి తీర్చేందుకు అన్నా క్యాంటీన్లు ఒక వరం అన్నారు. ఐదు రూపాయలకే అందరికి శుభ్రమైన భోజనం అందించడం ఆనాడు ఎన్టీఆర్ అందరికి ఆకలి తీర్చాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేశారు. అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ మన కూటమి ప్రభుత్వం ఇప్పటికే రెండు వందల అరవై ఐదు అన్నా క్యాంటీన్లను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించడం చాలా గొప్ప విషయంగా చెప్పవచ్చు. సంకల్పంతో కూడు, గుడ్డ, నీడ లక్ష్యంగా మౌలిక సదుపాయాలు కల్పనే ధ్యేయంగా ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ ముందుకు వెళ్తున్నామని అందులో భాగంగా అన్న క్యాంటీన్ దర్శి ప్రజలకు అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.ఈ మంచి కార్యక్రమాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని డాక్టర్ లక్ష్మీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరు ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, దర్శి పట్టణ టీడీపీ అధ్యక్షులు పుల్లలచెరువు సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షులు మేడగం వెంకటేశ్వరరెడ్డి, కూరపాటి శ్రీను, పిడతల నెమిలయ్య, మోడీ ఆంజనేయులు, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షులు కాట్రాజు నాగరాజు, బీజేపీ రాష్ట్ర శాలివాహన కార్పొరేషన్ డైరక్టర్ మాడపాకుల శ్రీనివాసరావు, నాగులపాటి శివకోటేశ్వరరావు, రాష్ట్ర, జిల్లా నియోజకవర్గంలోని వివిధ హోదాల్లో ఉన్న టీడీపీ నాయకులు, దర్శి మున్సిపల్ వైస్ చైర్మన్ గర్నెపూడి స్టీవెన్, శోభారాణి, కౌన్సిలర్లు, గ్రామ పార్టీ అధ్యక్షులు, క్లస్టర్లు, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలు, మహిళలు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో శ్రీ గాయత్రి విద్యార్థుల సత్తా



**సింగరాయకొండ, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**

రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం విడుదలైన ఇంటర్మీడియట్ ఫస్ట్, సెకండ్ ఇయర్ పరీక్షా ఫలితాల్లో కందుకూరు, సింగరాయకొండ శ్రీ గాయత్రి విద్యా సంస్థల జూనియర్ కళాశాల విద్యార్థిని,విద్యార్థులు అద్భుతప్రతిభతో సత్తా చాటారు. జూనియర్ ఎంపీసీ విభాగంలో పాతూరి శ్రీ లాస్య 470కి 466 మార్కులు సాధించి టౌన్ ఫస్ట్‌గా నిలిచింది. పోలిశెట్టి వెంకట సాయి లక్ష్మీ జ్యోత్స్నప్రియ, బొల్లా దీపికలు 464 మార్కులు సాధించగా, షేక్ ఫర్హానా, దర్శనం విక్టర్ చార్లెస్ 463 మార్కులు సాధించారు. కోటా కళ్యాణి, కొనిదన కళ్యాణి 461 మార్కులు సాధించారు. తోట నాగ ఈసా (459), గూడూరి జానీ శ్రీ (458), షేక్ సాహిద్, షేక్ అబ్దుల్ బషీద్ (457), అక్కల విష్ణు హర్షిని, షేక్ రియా రిజ్వానా (450) మార్కులు సాధించారు.జూనియర్ బైపీసీ విభాగంలో షేక్ తహూరా నసీమ్ 455కి 452 మార్కులతో రాష్ట్రంలో ద్వితీయ స్థానం, టౌన్ ఫస్ట్ సాధించింది. చెన్నంశెట్టి హరిణి 451 మార్కులతో రాష్ట్రంలో తృతీయ స్థానం సాధించింది. పి. అభినయ, టి. అలేఖ్యలు 425 మార్కులు సాధించారు. జూనియర్ సీఈసీ విభాగంలో పాలకుర్తి పావని 500కి 456 మార్కులతో కాలేజీ ఫస్ట్‌గా నిలిచింది.సీనియర్ ఎంపీసీ విభాగంలో పఠాన్ రుహీన సుల్తానా 1000కి 990 మార్కులతో కాలేజీ ఫస్ట్ సాధించగా, నెక్కంటి రాకేష్, చలంచర్ల మోహన శ్రీ 989 మార్కులు సాధించారు. సీనియర్ బైపీసీ విభాగంలో సయ్యద్ సన 950 మార్కులతో కాలేజీ ఫస్ట్ సాధించింది.ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల చైర్మన్ సిహెచ్. రామకృష్ణారావు, డైరెక్టర్ సిహెచ్.భరద్వాజ్, ప్రిన్సిపల్స్,డీన్లు అభినందించారు.విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులు సంతోషం వ్యక్తం చేశారు.

## దర్శి గీతాంజలి కాలేజీ విద్యార్థుల ప్రభంజనం

**- జిల్లా ఫస్ట్ మార్కులు గీతాంజలి కైవసం**



**దర్శి, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**

బుధవారం విడుదలైన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో దర్శి గీతాంజలి జూనియర్ కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనపరిచి ప్రభంజనం సృష్టించారు. వివిధ విభాగాల్లో విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి కళాశాల ఖ్యాతిని మరింతగా పెంచారు. జూనియర్ విభాగంలో ఎంపీసీ విద్యార్థి ఎల్‌వీఎస్ ప్రదీప్‌రెడ్డి 464/470, బైపీసీ విభాగంలో 449/455 శ్రీరామ్ త్రివేణి, సీఈసీ విభాగంలో తాటి అశ్వని 480/500 మార్కులతో అద్భుత ప్రతిభ చాటారు. సీనియర్ విభాగంలో ఎంపీసీ విద్యార్థిని ఎర్రం రెడ్డి రమ్య 988/1000 మార్కులు సాధించగా, ఎంపీసీ విభాగంలోనే కే.పూజిత 983/1000 మార్కులు, ఎస్‌కే సల్మాన్ 980/1000 మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించారు. మొదటి సంవత్సరం 400పైగా 52 మంది విద్యార్థులు సాధించారు. రెండవ సంవత్సరంలో 900 పైన 23 మంది విద్యార్థులు విజయం సాధించారు. విద్యార్థులు ఈ అద్భుత విజయాలపై కళాశాల యాజమాన్యం గూడా రవికాంత్‌రెడ్డి,వెన్నపూస రమణారెడ్డి,కంట ఆదినారాయణ,వెలుగోటి సుధాకర్‌రెడ్డి, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

## ఇంటర్ ఫలితాల్లో శ్రీ పొట్టి శ్రీరాములు కాలేజీ విజయ దుందుభి






**దర్శి, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**

బుధవారం వెలువడిన ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సర పరీక్ష ఫలితాలలో శ్రీ పొట్టి శ్రీరాములు విద్యాసంస్థలు విజయదుందుభి మోగించింది. మొదటి సంవత్సరం హెచ్ఈసీ విభాగంలో షేక్ కౌసర్ 484/500 సాధించి టౌన్ ఫస్ట్‌గా నిలిచింది. ఎంపీసీ విభాగంలో కిటికి శృతి 451/470 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచింది. సీఈసీ విభాగంలో గడ్డి శివ రంగనాథుడు 432/500 మార్కులు సాధించడం జరిగింది. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీ విభాగంలో కొంకాల వెంకట నాగలక్ష్మికి 973/1000 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచింది. ఇంతటి ఘన విజయాలు సాధించినటువంటి విద్యార్థినీ, విద్యార్థులను కళాశాల యాజమాన్యం డాక్టర్ పి.పెద్దిరాజు, వేమా వెంకట నారాయణ అదే విధంగా అద్యాపక సిబ్బంది, అధ్యాపకేతర సిబ్బంది ఘనంగా అభినందించారు. భవిష్యత్తులో ఇటువంటి విజయాలను ఎన్నో సాధించాలని ఆకాంక్షించారు.

## ఇంటర్ ఫలితాల్లో శ్రీ గౌతమి విద్యార్థుల స్టేట్ ర్యాంకుతో విజయం దుందుభి



**దర్శి, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**

బుధవారం వెలువడిన ఇంటర్ మొదటి, రెండవ సంవత్సర పరీక్షా ఫలితాలలో శ్రీ గౌతమి జూనియర్ కళాశాల విద్యార్థులు విజయ దుందుభి మోగించారు. జూనియర్ బైపీసీ విభాగం నందు పడిగపాటి జ్యోతి 450/455 టౌన్ ఫస్ట్, స్టేట్ 3వ ర్యాంకు, షేక్ షహైలా భాను 440/455 మార్కులతో టౌన్ సెకంట్, ఎంపీసీ విభాగం నందు ఓ.మూర్తి యాదవ్ 462/470 మార్కులతో టౌన్ సెకంట్, ఎస్.మౌనిక 462/470 మార్కులతో టౌన్ సెకంట్, వై.ప్రణతి 462/470 మార్కులతో టౌన్ సెకండ్, సీఈసీ విభాగం నందు టీవీ పీఎన్ అభిరామ్ శర్మ 474/500 మార్కులతో టౌన్ మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఇలా జూనియర్ ఇంటర్ నందు 400 పైగా మార్కులు 27 మంది సాధించారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగం నుండి ఈ.విజయ 988/1000 మార్కులతో టౌన్ సెకండ్, జి.గాయత్రి 984/1000 మార్కులతో టౌన్3, షైక్ బండ్ ఉమర్ 984/1000 మార్కులతో టౌన్ థర్డ్, కే.ప్రియాంక 984/1000 మార్కులతో టౌన్ థర్డ్, బైపీసీ విభాగం నుండి మీదిగ రూతు 923/1000 టౌన్ సెకండ్ సాధించారు. ఇంతటిఘన విజయాన్ని సాధించిన విద్యార్థినీ, విద్యార్థులను కళాశాల చైర్మన్ కనుమర్ల గుండారెడ్డి కేక్ కట్ చేసి పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరక్టర్ ఏ.నాగేంద్ర బాబు, ప్రిన్సిపాల్ టి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్ష ఫలితాలలో ఝాన్సీ మహిళా కళాశాల ప్రభంజనం




**దర్శి, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**

బుధవారం వెలువడిన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో ఝాన్సీ మహిళా కళాశాల విద్యార్థులు విజయదుందుభి మోగించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో దొంత్లేటి శైలజ 990/1000 మార్కులతో రాష్ట్ర మూడవ ర్యాంకు,దర్శి పట్టణంలో మొదటి ర్యాంకు సాధించింది. ప్రధమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో బంక నాగవైష్ణవి 464/470 మార్కులు సాధించి ఫస్ట్‌లో నిలిచింది.బైపీసీ విభాగంలో బి.త్రివేణి 443/455 మార్కులతో కళాశాల ప్రధమ స్థానం నిలిచింది. సీఈసీ విభాగంలో జి.శైలజ 474/500 మార్కులు సాధించింది. ప్రధమ సంవత్సరంలో 400 పైగా 20 మంది విద్యార్థులు విజయం సాధించారు. రెండవ సంవత్సరంలో 900లకు పైగా 24 మంది విద్యార్థులు సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు ఝాన్సీ విద్యాసంస్థల అధినేత డాక్టర్ బి.కోటిరెడ్డి, డాక్టర్ పి.ఝాన్సీలు విద్యార్థులకు స్వీట్లు తినిపించి అభినందలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వై.శివవంకర్, కళాశాల ఏవో లక్కు శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ ఫలితాలలో కస్తూరిబా విద్యార్థుల ప్రతిభ





**ముండ్లమూరు, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**

బుధవారం వెలువడిన ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో కస్తూర్బా గాంధీ బాలికల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి విజయదుందుభి మోగించారు. మొదటి సంవత్సరం ఎంపీసీ విభాగం నందు జే.హారిక 442/470 మార్కులు సాధించి మొదటి ర్యాంకులో, రెండవ సంవత్సరం పరీక్షా ఫలితాల్లో ఏ.భార్గవి 909/1000 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచారు. మొత్తంగా మొదటి సంవత్సరంలో 96.87శాతం, రెండవ సంవత్సరం 96 శాతం మార్కులు సాధించారు. ఇంతటి మార్కులు ఇంతటి ఘన విజయం సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు కళాశాల ప్రిన్సిపాల్ ఆవుల సునీత, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

## ఇంటర్‌లో మోడల్ స్కూల్ విద్యార్థికి జిల్లా ఫస్ట్ ర్యాంకు







**దర్శి, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**

ఇంటర్ ఫలితాలలో దర్శి మోడల్ జూనియర్ కాలేజీ విద్యార్థులు విజయ దుందుభి మోగించారు. జూనియర్ ఎంపీసీలో షేక్ బాజీ బీబీ 467/470 మార్కులు సాధించి జిల్లా ఫస్ట్ నిలిచింది. జూనియర్ బైపీసీలో పి.అర్చన 451/455, జూనియర్ సీఈసీలో ఐ.కవిత 470/500, జూనియర్ ఎంఈసీలో ఓ.వెంకట లావణ్య 430/500 అదే విధంగా సీనియర్ బైపీసీలో బి.సాత్విక 986/1000, సీనియర్ ఎంపీసీలో ఎం.లక్ష్మి తిరుపతమ్మ 983/1000, సీనియర్ సీఈసీలో కే.గురు కావ్య 828/1000, సీనియర్ ఎంఈసీలో ఏవీఎన్ సుస్మిత 822/1000, 900 మార్కులకు పైగా 21 మంది ఇంతటి విజయం సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు ఏపీ మోడల్ స్కూల్, కాలేజీ ప్రిన్సిపాల్ హసీనాభాను అభినందనలు తెలియజేశారు.

## వివాహ వేడుకల్లో పాల్గొన్న డాక్టర గొట్టిపాటి లక్ష్మీ - లలిత్ సాగర్ దంపతులు



**దర్శి, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**

బుధవారం దర్శి మున్సిపాలిటీ పరిధిలోని చింతలపాలెంలో కనకం శ్రీనివాసరావు(బద్రి)(లేటు)-సుజాత కుమారిని వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులునాగేంద్రబాబు-సుప్రియలను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలియజేసిన దర్శి తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ లలిత్‌సాగర్ దంపతులు. ఈ కార్యక్రమంలో దర్శి ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి సుబ్బారావు, కౌన్సిలర్ కనకం మల్లేశ్వరి, శ్రీనివాసరావు, చింతలపాలెం గ్రామ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## దర్శిలో అగ్నిమాపక వారోత్సవాలు




**దర్శి, ఏప్రిల్ 15, ప్రభాతవార్త**

అగ్ని మాపక వారోత్సవాలలో భాగంగా బుధవారం రెండో రోజు దర్శి అగ్నిమాపక కేంద్రం పరిధిలో గల ఆర్టీసీ బస్టాండ్, మోర్ షాపింగ్ కాంప్లెక్స్, స్మార్ట్ షాపింగ్ కాంప్లెక్స్, శ్రీనివాస సినిమా థియేటర్ నందు యాజమాన్యానికి, సిబ్బందికి, ప్రయాణికులకు, ప్రేక్షకులకు, కస్టమర్లకు అగ్ని ప్రమాదాలు జరుగు విధానం వాటి నివారణ చర్యలు డెమో ద్వారా వివరించారు. పోస్టర్లు అంటించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దర్శి అగ్నిమాపక కేంద్రాధికారి సీహెచ్ జాలయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాలలో గోవిందాంబికా కాలేజి విద్యార్థులు ప్రతిభ



**అద్దంకి, ఎఫ్రియల్ 15,ప్రభాతవార్త**

ఇంటర్మీడియట్ ఫలితాల్లో బుధవారం ప్రకటించారు. పట్టణంలోని శ్రీ గోవిందాంబికా పరమేశ్వరి జూనియర్ కాలేజ్ విద్యార్థినీ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారు. ఈ అత్యుత్తమ ఫలితాలు సాధించిన ప్రతి విద్యార్థిని విద్యార్థులకు మా అభినందనలు తెలిపారు. అదేవిధంగా జూనియర్ ఎంపీసీ లో బత్తుల హర్షిత్ అద్దంకి 470 మార్కులు, 464 మార్కులు సాధించాడు. జూనియర్ బైపిసి విభాగంలో అద్దంకి టౌన్ ఫస్ట్ అండ్ టౌన్ సెకండ్ కూడా శ్రీ గోవిందా అంబికా పరమేశ్వరి విద్యార్థిని విద్యార్థులు టౌన్ ఫస్ట్‌గా సాధించినటు వంటి విద్యార్థిని పిల్లి అక్షయ రేణింగవరం 455 మార్కులు, 440 మార్కులు సాధించారు. మా విద్యార్థిని, టౌన్ సెకండ్ గా ధర్మవరపు గణేష్ నాయుడు 455 మార్కులు గాను 438 మార్కులు అనమానమూరు గ్రామం, సీనియర్ ఎంపీసీ విభాగంలో 1000 మార్కులు గాను 978 మార్కులు సాధించిన బాలం నిహారిక తమ్మవరం, అదేవిధంగా సీనియర్ బైపిసి టౌన్ ఫస్ట్ సాధించినటువంటి చిలకా ఝాన్సీ, పి.గుడిపాడు 1000 మార్పులు గాను 980 మార్కులు సాధించి అద్దంకి టౌన్ ఫస్ట్ గా నిలిచిన మా మా విద్యార్థులకు అద్భుత ఫలితాలు సాధించిన మా విద్యార్థిని విద్యార్థులకు మా హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాలేజీ కరస్పాండెంట్ బొద్దు నాగార్జున ప్రిన్సిపల్ ఎస్ వెంకట్రావు, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు అందరూ అత్యుత్తమ ఫలితాలు సాధించిన మా విద్యార్థిని విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

## టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా

## నారా లోకేశ్ నియామకంపై మంత్రి గొట్టిపాటి హర్షం



**అద్దంకి , ఎఫ్రియల్ 15, ప్రభాతవార్త**

తెలుగుదేశం పార్టీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేష్ నియామకం పై ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంత్రి నారాలోకేశ్‌కు అభినందనలు తెలియజేశారు. జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడుగా నారా లోకేశ్ నియామకం ఆయన సమర్థవంతమైన నాయకత్వానికి దక్కిన గుర్తింపని పేర్కొన్నారు. లోకేష్ నాయకత్వంలో పని చేసేందుకు యువత మరింత ఉత్సాహం చూపిస్తున్నారని అన్నారు. ఆయన పై విమర్శలు చేసిన వారికి యువగళం పాదయాత్ర ద్వారా లోకేశ్ సమాధానం ఇచ్చారని తెలిపారు. ఇప్పటికే విద్య, ఐటీ శాఖ మంత్రిగా రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావడంలో లోకేష్ కీలక పాత్ర పోషించారని చెప్పారు. అలాగే, అభివృద్ధి చెందిన రాష్ట్రాలకు పోటీగా ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులు తీసుకురావడంలో ఆయన పాత్ర ముఖ్యమని అభిప్రాయపడ్డారు. ప్రకటించిన కొత్త కమిటీలతో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ముస్లిం బాలికల పాఠశాలకు కెనరా బ్యాంకు వారి

## సహాయ సహకారాలతో రక్షిత మంచినీటి ఆరో ప్లాంట్



**సంతమాగులూరు, ఎఫ్రియల్ 15, ప్రభాతవార్త**

మండలంలోని కొమ్మాలపాడు గ్రామం జడ్పీహెచ్ఎస్ ఎంజి పాఠశాల నందు కెనరా బ్యాంక్ కొమ్మలపాడు శాఖ సామాజిక స్పృహలో భాగంగా వారి ఆర్థిక సహాయంతో వాటర్ ఆరో ప్లాంట్ ను బహుకరించారు. వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవ కార్యక్రమం కు ముఖ్య అతిథిగా కెనరా బ్యాంక్ మేనేజర్ వడ్లమూడి రమేష్, సంతమాగులూరు మండల రెండవ విద్యాశాఖ అధికారి దార్ల దినేష్ కుమార్ హాజరయ్యి ప్రారంభించారు . ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు మసనం శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముస్లిం బాలికల పాఠశాలను ఉన్నత పాఠశాల వరకు ప్రభుత్వ అనుమతులు మంజూర అయి ఉన్నాయన్నారు. ఈ పాఠశాల అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలనే సందర్భంగా సామాజిక స్పృహతో చేసినటువంటి ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొని పిల్లలందరూ విద్య ద్వారా అభివృద్ధి చెందాలని చూచించారు. గ్రామంలోని ప్రజలందరూ తమ తమ పిల్లలను అధిక సంఖ్యలో కొమ్మలపాడు 3పాఠశాలలో అలాగే ఈ హైస్కూల్ నందు మీ పిల్లల్ని చేర్పించి పాఠశాల అభివృద్ధికి సహకరించవలసిందిగా బ్యాంకు మేనేజర్ మరియు ఎంఈఓ లను పాఠశాల ప్రధానోపాధ్యాయులు మసనం శ్రీనివాసరావు కోరారు. సందర్భంగా పాఠశాల సిబ్బంది కెనరా బ్యాంక్ కొమ్మలపాడు శాఖ మేనేజర్ వడ్లమూడి రమేష్ ను దుస్సాలువాతో ఘనంగా సన్మానించారు. గ్రామస్తులు కెనరా బ్యాంకు మేనేజర్ సహాయానికి అందరూ కృతజ్ఞతలు జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల కర్రి అజయ్ బాబు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మసనం శ్రీనివాసరావు, దర్యావలి, చాగంటి రాజేష్, మస్తాన్వలి, పరిమిల పాఠశాల ప్రధానోపాధ్యాయులు పుల్లారావు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఏఎంసీ చైర్మన్ మోలాలి గంగారం ఖాసీం సైదా కాలేషా గారి వలి తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్‌లో సత్తా చాటిన ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు







**సంతమాగులూరు, ఎఫ్రియల్ 15, ప్రభాతవార్త**

మండలకేంద్రమైన సంతమాగులూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనబరిచి కళాశాలకు మంచి పేరు తెచ్చారని ప్రిన్సిపాల్ శివనాగలక్ష్మి తెలిపారు. మొదటి సంవత్సరం లో మొత్తం 80 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 61 మంది ఉత్తీర్ణులై 76.25 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇందులో కె. నవ్య 949 మార్కులతో ప్రథమ స్థానం, ఓ. లోకేష్ 918, పి. ప్రణయ్ 916, ఎస్‌కే. నజ్మా 900 మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించారు. రెండో సంవత్సరంలో 61 మంది హాజరుకాగా 31 మంది ఉత్తీర్ణులై 51 శాతంఫలితాలు నమోదయ్యాయి. ఇందులో ఎస్‌కే. అబ్దుల్ రహీమ్ 428 మార్కులతో ప్రథమ స్థానం, ఎం.జి.వి. విష్ణువర్ధన్ 417, చి.లక్ష్మి సైలజ 373 మార్కులతో ప్రతిభ కనబరిచారు. విద్యార్థుల ఈ విజయానికి అధ్యాపకుల కృషి, తల్లిదండ్రుల సహకారం కారణమని ప్రిన్సిపాల్ శివనాగలక్ష్మి పేర్కొన్నారు.

**కేజీబీవీలో సత్తా చాటిన విద్యార్థులు :**

మండలం లోని ఏల్చూరు కస్తూరిబా గాంధీ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో విద్యార్థులు ప్రతిభ చాటారు అని ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి తెలిపారు.మొదటి సంవత్సరంలో మొత్తం 29 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, అందులో 26 మంది ఉత్తీర్ణత సాధించి 89.65 శాతం ఫలితాన్ని నమోదు చేశారు. ఈ ఫలితాలలో ఎస్. కీర్తి 435 మార్కులతో అత్యుత్తమ ఫలితాన్ని సాధించింది.రెండవ సంవత్సరంలో 32 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, 30 మంది ఉత్తీర్ణత సాధించి 93.75 శాతం ఉత్తీర్ణత శాతం నమోదు అయింది.ఈ ఫలితాలలో డి. పోలేశ్వరి 948 మార్కులతో ప్రథమస్థానం సాధించింది.ఈ ఫలితాలు విద్యార్థుల కృషి,ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం ఫలితమని ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి అభిప్రాయపడ్డారు.

## గంజాయి తరలిస్తున్న ముఠా అరెస్ట్

**- 6 కేజీల గంజాయి, ఐదు ఫోన్స్ - 14500 నగదు స్వాధీనం**




**సింగరాయకొండ,ఏప్రిల్ 15,ప్రభాతవార్త**

అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఐదుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని, వారి వద్దనున్న 6 కేజీల గంజాయి, ఐదు సెల్ ఫోన్లు, రూ.14,500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సిహెచ్ హజరత్తయ్యా తెలిపారు. బుధవారం సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు.జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సీఐ హజరత్తయ్యా, టంగుటూరు ఇన్‌చార్జ్ ఎస్ఐ బి. మహేంద్ర తమ సిబ్బందితో అక్రమంగా గంజాయి తరలిస్తున్నారనే సమాచారంతో టోల్ ప్లాజా వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో అనుమానాస్పదంగా కారులో వస్తూ, వాహనాన్ని వదిలి పారిపోవడానికి యత్నించిన ఐదుగురిని అదుపులోకి తీసుకుని విచారించగా, కారులో దాచిన గంజాయి బయటపడింది.కేరళ రాష్ట్రం త్రివేంద్రం ప్రాంతానికి చెందిన షఫీక్, సమీర్, షాహిన్, సయ్యద్ అలీ, ఇబ్రహీం స్నేహితులు చెడు వ్యసనాలుకు బానిసై త్వరగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో అక్రమ గంజాయి వ్యాపారానికి పాల్పడ్డారని పోలీసులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ప్రాంతంలో తక్కువ ధరకు గంజాయి లభిస్తుందని తెలుసుకుని, పర్యాటకుల్లా వెళ్లి కొనుగోలు చేశారు.వారు ఏప్రిల్ 11న కేరళ నుంచి బయలుదేరి, పాడేరు సమీపంలో ఒక గదిని అద్దెకు తీసుకుని, గుర్తు తెలియని వ్యక్తి వద్ద నుంచి సుమారు 7 ప్యాకెట్ల గంజాయిని రూ.40 వేలకుగాను కొనుగోలు చేశారు. అనంతరం వాటిని కేరళలో లక్ష రూపాయలు పైన అధిక ధరకు విక్రయించి లాభాలు పొందాలని యోచించారు.ఏప్రిల్ 13 రాత్రి తిరుగు ప్రయాణంలో ఉండగా, గంజాయి తరలింపుపై వచ్చిన సమాచారం మేరకు పోలీసులు టోల్ ప్లాజా వద్ద తనిఖీలు నిర్వహించి, బుధవారం ఉదయం సుమారు 10 గంటలకు నిందితులను అరెస్ట్ చేశారు.వారి పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు సీఐ తెలిపారు.ఈ కేసులో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించినట్లు సీఐ తెలిపారు.

16-4Pg5 9_16-4Pg5.qxd 15/Apr/26 10:46 PM Page 1



# ఇరాన్‌తో యుద్ధం ముగిసినట్లే..



## అయితే సైనిక చర్యలు ఇంకా పూర్తి కాలేదు: ట్రంప్

**వాషింగ్టన్, ఏప్రిల్ 15:** ఇరాన్, అమెరికా యుద్ధం ముగింపు దశకు చేరుకుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. బుధవారం 'ఫాక్స్ బిజినెస్' ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ 'ఇరాన్‌తో యుద్ధం చాలావరకు ముగిసినట్లేనని నేను భావిస్తున్నాను' అని పేర్కొన్నారు. అయితే ఇదే సమయంలో తమ సైనిక చర్యలు ఇంకా పూర్తిగా పూర్తి కాలేదని ఇరాన్ ఒక ఒప్పందానికి రావాలని బలంగా కోరుకుంటోందని ఆయన వ్యాఖ్యానించారు. ఇస్లామాబాద్‌లో జరిగిన మొదటి విడత చర్చలు విఫలమైన తర్వాత అమెరికా నౌకాదళం హర్మూజ్ జలసంధి వద్ద ఇరాన్ ఓడరేవులను లక్ష్యంగా చేసుకుని భారీ దిగ్బంధనాన్ని కొనసాగిస్తోంది. వేల సంఖ్యలో అమెరికా సైనికులు, యుద్ధ నౌకలు ఈ ప్రాంతంలో పహారా కాస్తున్నాయి. ఇప్పటికే ఇరాన్ వైపు వెళ్తున్న అనేక నౌకలను అమెరికా వెనక్కి పంపింది. 'నేను ఇప్పుడు వెనక్కు తగ్గితే ఆ దేశం కోలుకోవడానికి 20 యేళ్లు పడుతుంది. మేము ఇంకా పని పూర్తి చేయలేదు' అని ట్రంప్ స్పష్టం చేశారు.

**అణుబాంబు అడ్డుకోవడం కోసమే దాడులు:** ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉండకూడదనే లక్ష్యంతోనే ఫిబ్రవరి 28న ఇజ్రాయెల్‌తో కలిసి తాము యుద్ధాన్ని ప్రారంభించినట్లు ట్రంప్ తెలిపారు. అయితే ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీతోపాటు పలువురు కీలక నేతలు తొలి రోజే మరణించగా.. ఆ దేశ మౌలిక సదుపాయాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని గుర్తు చేశారు. 'నేను గనుక ఈ దాడులకు ఆదేశించకపోయి ఉంటే ఈపాటికి ఇరాన్ అణ్వాయుధాన్ని తయారుచేసి ఉండేది. అదే జరిగితే ప్రపంచం అంతా వారిని చూసి వణకాల్సి వచ్చేది' అని ట్రంప్ తన నిర్ణయాన్ని సమర్థించుకున్నారు.

**ఇస్లామాబాద్ వేదికగా మళ్లీ చర్చలు:** రెండో విడత శాంతి చర్చలు వచ్చే రెండు రోజుల్లోనే పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో జరిగే అవకాశం ఉందని ట్రంప్ వెల్లడించారు. ఇరాన్ అణు ఆశయాలను కట్టడి చేయడమే ఈ చర్చల ప్రధాన ఉద్దేశం అని పేర్కొన్నారు. అయితే వైస్‌ప్రెసిడెంట్ జెడి వాన్స్ మాత్రం ఇరు దేశాల మధ్య అపనమ్మకం ఎక్కువగా ఉందని. ఈ సమస్య రాత్రికి రాత్రే పరిష్కారం కాదని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రస్తుతం అమలులో ఉన్న కాల్పుల విరమణ ఈ నెల 22తో ముగియనుంది. అయితే ఈలోపే చర్చలు నిర్వహించుకుని, సమస్యలను పరిష్కరించుకోవాలని ఇరు దేశాలు భావిస్తున్నాయి. కానీ ఈ చర్చలు విఫలమైతే రెండు దేశాలు ఏం చేస్తాయన్న దానిపై అంతర్జాతీయంగా ఆసక్తి నెలకొంది.

# వికసిత్ భారత్‌కు 9సూత్రాలు



## కర్ణాటకలోని ఆదిచుంచనగరి మఠం సందర్శించిన ప్రధాని మోడీ

### దేశ నిర్మాణంలో సంస్కృతి, సేవల పాత్ర అద్వితీయం

### పర్యావరణాన్ని పరిరక్షించాలని ప్రధాని పిలుపు

**మండ్య, ఏప్రిల్ 15:** 'వికసిత్ కర్ణాటక'ను సాధించడం.. 'వికసిత్ భారత్' దార్శనికతకు దోహదపడటం లక్ష్యంగా తొమ్మిది సూత్రాల అభివృద్ధి అజెండాను ప్రధానమంత్రి నరేంద్రమోడీ వివరించారు. కర్ణాటక రాష్ట్రం మండ్య జిల్లాలోని ప్రసిద్ధ శ్రీ ఆదిచుంచనగిరి మఠంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని మోడీ ప్రసంగిస్తూ, సమ్మిళిత వృద్ధికి పౌర భాగస్వామ్యం, సుస్థిరత, సాంస్కృతిక విలువలే కీలక చోదకాలని పేర్కొన్నారు. జల సంరక్షణ, పర్యావరణంపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా కావేరీ పరీవాహక ప్రాంతంపై ఆధారపడిన ప్రాంతాలలో జల సంరక్షణ ఒక ఉమ్మడి బాధ్యత అని పేర్కొన్నారు.

సమర్థవంతమైన నీటి నిర్వహణ పద్ధతులను అవలంబించాలని ఆయన పౌరులను కోరారు. సహజ వనరులను పరిరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పర్యావరణ అవగాహనలో భాగంగా, పర్యావరణ బాధ్యతను సాంస్కృతిక భావనతో ముడిపెడుతూ, తమ తల్లుల పేరు మీద చెట్లు నాటాలని ప్రధాని ప్రజలకు పిలుపునిచ్చారు. స్వయం సమృద్ధి, స్థానిక ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించాల్సి ఉందంటూ, 'వోకల్ ఫర్ లోకల్' చొరవను బలపరుస్తూ, స్వదేశీ పరిశ్రమలకు మరియు స్థానికంగా తయారైన ఉత్పత్తులకు మరింత మద్దతు ఇవ్వాలని మోడీ పిలుపునిచ్చారు. ఆయన దేశీయ పర్యాటకాన్ని ప్రోత్సహిస్తూ, జాతీయ ఐక్యతను బలోపేతం చేయడానికి, స్థానిక ఆర్థిక వ్యవస్థలను ప్రోత్సహించడానికి భారతదేశంలోని వివిధ ప్రాంతాలను అన్వేషించాలని పౌరులను కోరారు. సుస్థిర వ్యవసాయం, ఆరోగ్యకరమైన జీవనశైలి అంశాలను ప్రస్తావించారు. ముఖ్యంగా మాండ్యా వంటి వ్యవసాయ ప్రాంతాలలోని రైతులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, సహజ, రసాయన రహిత వ్యవసాయం వైపు క్రమంగా మారాలని ప్రధానమంత్రి సూచించారు. నేల ఆరోగ్యం, సుస్థిర వ్యవసాయ పద్ధతుల ప్రాముఖ్యతను గురించి వివరించారు. జీవనశైలి సమస్యలపై, పెరుగుతున్న ఊబకాయంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాగి వంటి సాంప్రదాయ ఆహారాలను ప్రోత్సహించడంతో పాటు, నూనె వినియోగాన్ని తగ్గించడం. యోగా, క్రీడల ద్వారా శారీరక శ్రమను పెంచడం వంటివి సూచించారు.

**దేశ నిర్మాణంలో సంస్కృతి, సేవ పాత్ర :** సమాజాన్ని బలోపేతం చేయడంలో, పౌరులలో ఒక లక్ష్య స్ఫూర్తిని పెంపొందించడంలో సేవ ప్రాముఖ్యతను ప్రధానమంత్రి నరేంద్రమోడీ వివరించారు. విద్య, ఆరోగ్య సంరక్షణ, సామాజిక ఉన్నతిలో ఆదిచుంచనగిరి మఠం వంటి ఆధ్యాత్మిక సంస్థల పాత్రను కూడా ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. భారతదేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఆధునికఅభివృద్ధిలో ఆధ్యాత్మిక విలువలను ఏకీకృతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

# పదిహేనేళ్ల భయాలకు స్వస్తి పలుకుదాం




## పశ్చిమబెంగాల్ ప్రజలకు ప్రధాని మోడీ బహిరంగలేఖ

### మమత పాలన లక్ష్యంగా ప్రధాని విమర్శలు

**కోల్‌కతా, ఏప్రిల్ 15:** బెంగాలీ నూతన సంవత్సరం (పొయిలా బైశాఖ్) సందర్భంగా, బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పశ్చిమ బెంగాల్ ప్రజలకు ఒక బహిరంగ లేఖ రాశారు. గత 15 ఏళ్లుగా తృణమూల్ కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో సృష్టించబడిన భయానక వాతావరణాన్ని, ఆందోళనను అంతం చేయాలని ఆయన ఓటర్లకు బహిరంగ పిలుపునిచ్చారు. అంతకు ముందు రోజు, బెంగాలీ నూతన సంవత్సరం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయన సోషల్ మీడియాలో ఒక పోస్ట్ చేశారు. తన సోషల్ మీడియా పోస్ట్‌లో ప్రధానమంత్రి రాజకీయపరమైన వ్యాఖ్యలకు దూరంగా ఉన్నప్పటికీ, ఈ బహిరంగ లేఖలో మాత్రం తృణమూల్ కాంగ్రెస్, మమత బెనర్జీ నేతృత్వం లోని ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఆయన సోషల్ మీడియా పోస్ట్ ఇంగ్లీష్, బెంగాలీ భాషలలో ఉండగా, ఈ బహిరంగ లేఖ మాత్రం కేవలం బెంగాలీ భాషలో ఉంది. "గత 15 ఏళ్లుగా, పశ్చిమ బెంగాల్ ప్రజలు దుష్పరిపాలన, అరాచకత్వం, అవినీతికి బాధితులుగా మారారు. ఈ సమస్యలన్నీ సామాడన్యుడి ప్రాథమిక హక్కులు, గౌరవం, సంస్కృతిపై తీవ్ర ప్రభావం చూపాయి," అని ప్రధాని మోడీ ఆ లేఖలో పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్ ప్రజల బాధలు, కష్టాలను చూసి తాను తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యానని ప్రధాని మోడీ తెలిపారు. "తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో భయానక వాతావరణాన్ని సృష్టించింది. ఒకవేళ బిజెపి ప్రభుత్వం ఏర్పడితే, యువతకు ఉపాధి, మహిళల భద్రతకు పూర్తి భరోసా కల్పిస్తాం. కాబట్టి, ఈసారి 'ప్రజాస్వామ్య పండుగ' అయిన ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేయండి," అని ప్రధానమంత్రి పిలుపునిచ్చారు. "ఈ నెల చివరలో పశ్చిమ బెంగాల్‌లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు కేవలం సాధారణ ఎన్నికలు మాత్రమే కావు. రాష్ట్రాన్ని అభివృద్ధి, సంపన్నత దిశగా నడిపించడానికి వేసే తొలి అడుగుగా, ఇదొక సువర్ణావకాశం. మన వారసత్వం, సంస్కృతి, సంప్రదాయాలు, హక్కులను పరిరక్షించుకోవడానికి నిర్ణయాత్మక చర్యలు తీసుకునే సమయం ఇప్పుడు ఆసన్నమైంది. ఈ ఎన్నికలు భయం, విశ్వాసం మధ్య జరిగే పోరాటం," అని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. ప్రజలు ఎటువంటి భయం లేకుండా ఓటు వేయాలని కూడా ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. "మీ అందరికీ నేను ఒక వినమ్రమైన, హృదయపూర్వక విజ్ఞప్తి చేస్తున్నా. ప్రజాస్వామ్య పండుగ అయిన ఈ ఎన్నికల్లో స్వచ్ఛందంగా, నిర్భయంగా పాల్గొనండి. 'అభివృద్ధి చెందిన పశ్చిమ బెంగాల్' కలను సాకారం చేయడానికి మాతో చేతులు కలపండి. ఈసారి, పశ్చిమ బెంగాల్ ప్రజలు భారతీయ జనతా పార్టీపై మరియు నాపై తమ విశ్వాసాన్ని ఉంచి, మాకు ఒక చారిత్రాత్మక విజయాన్ని బహూకరిస్తారని తాను దృఢంగా విశ్వసిస్తున్నా, నమ్ముతున్నాను," అని ఆయన తన సందేశాన్ని ముగించారు.

# మంటల్లో పశ్చిమాసియా



## హర్మూజ్ దిగ్బంధనానికి 10 వేల మంది సిబ్బంది

**వాషింగ్టన్, ఏప్రిల్ 15:** ఇరాన్ ఓడరేవులపై పూర్తి దిగ్బంధనాన్ని విజయవంతంగా అమలు చేసినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. ముఖ్యంగా హర్మూజ్ జలసంధితో సహా కీలక ప్రాంతీయ జలమార్గాలలోనూ అమెరికా దళాలు మోహరించినట్లు యుఎస్ సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. హర్మూజ్ జలసంధిపై దిగ్బంధనానికి ఇరాన్ పోర్టుల్లో దాదాపు 10వేల మంది సైనికులు, మెరైన్లు, వైమానిక దళ సిబ్బందిని మోహరించినట్లు సమాచారం. 'దిగ్బంధనాన్ని ప్రారంభించిన 36 గంటల్లోనే ఇరాన్ నుంచి వెళ్లే వాణిజ్య నౌకలను అమెరికా దళాలు పూర్తిగా నిలిపివేశాయి. సముద్ర మార్గం ద్వారా జరిగే అంతర్జాతీయ వాణిజ్యంపైనే ఇరాన్ ఆర్థిక వ్యవస్థ ఎక్కువగా ఆధారపడి ఉంది' అని యుఎస్ సెంట్రల్ కమాండ్ కమాండర్ అడ్మిరల్ బ్రాడ్ కూపర్ పేర్కొన్నారు. 'యుఎస్ నావికాదళ పర్యవేక్షణలో క్షిపణులు సిద్ధంగా ఉన్నాయి. అవి ఇరాన్ పోర్టుల నుంచి బయటకు వచ్చే, లోపలకు వెళ్లే నౌకలను లక్ష్యంగా చేసుకుంటాయి' అని అమెరికా సెంట్రల్ కమాండ్ 'ఎక్స్' ఖాతాలో వెల్లడించింది. అయితే హర్మూజ్ మొత్తానికి కాకుండా ఇరాన్ పోర్టులను మాత్రమే అమెరికా దిగ్బంధించినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, గల్ఫ్ దేశాల నుంచి బయల్దేరి హర్మూజ్ జలసంధిని దాటేందుకు ప్రయత్నించిన 'రిచ్ స్టార్రీ' అనే నౌక అమెరికా విధించిన దిగ్బంధనం కారణంగా వెనుతిరిగింది. ఈ నౌక 2.50 లక్షల బ్యారెళ్ల చమురును యుఎఇలో నింపుకొని బయల్దేరిందని షిప్పింగ్ డేటా వెల్లడించింది. దిగ్బంధనం మొదటిరోజు ఇరాన్ నుంచి బయల్దేరిన ఎనిమిది నౌకల్లో చైనాకు చెందిన ఒక ట్యాంకర్ కూడా ఉన్నట్లు సమాచారం. అయితే ఒమన్ గల్ఫ్‌లోని ఇరాన్ ఓడరేవు చబహార్ నుంచి బయల్దేరిన రెండు ఆయిల్ ట్యాంకర్లను ఇరాన్ ఓడరేవు చబహారాన్ నుంచి బయల్దేరిన రెండు ఆయిల్ ట్యాంకర్లను అమెరికా విధ్వంసక నౌక అడ్డుకుందని యుఎస్ అధికారులు పేర్కొన్నారు.

# డీలిమిటేషన్ పేరుతో దక్షిణాదికి ద్రోహం



## కేంద్రం వైఖరి మారకపోతే తీవ్ర పరిణామాలు: స్టాలిన్

**చెన్నై, ఏప్రిల్ 15:** నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ పై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ సోషల్ మీడియా వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. డీలిమిటేషన్ పేరుతో కేంద్ర ప్రభుత్వం దక్షిణాది రాష్ట్రాలకు ద్రోహం చేస్తోందని ఆయన మండిపడ్డారు. నియోజకవర్గాల పునర్విభజన అంశంలో తమిళనాడు గళాన్ని వినిపించుకోకపోతే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ మేరకు తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఒక పోస్టు పెట్టారు. దేశం అభివృద్ధికి కృషి చేసిన నేరానికి కేంద్ర ప్రభుత్వం దక్షిణాది రాష్ట్రాలను శిక్షిస్తుందా? అని స్టాలిన్ ప్రశ్నించారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు దేశవ్యాప్తంగా ఉన్న అన్ని పార్టీలు కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఏకమవ్వాలని పిలుపునిచ్చారు. రేపు పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టాలని చూస్తున్న డీలిమిటేషన్ సవరణ బిల్లుపై దక్షిణ భారత ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని స్టాలిన్ అన్నారు. నియోజకవర్గాల పునర్విభజనకు నిరసనగా రేపు రాష్ట్రవ్యాప్తంగా నల్లజెండాలతో నిరసనలు చేపట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. నియోజకవర్గాల అశాస్త్రీయ పునర్విభజనను తాము వ్యతిరేకిస్తూనే ఉన్నప్పటికీ ఎన్నికలకు ముందు కేంద్ర ప్రభుత్వం ఈ అంశాన్ని తెరపైకి తీసుకురావడం కుట్రపూరిత చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన సవరణ బిల్లు పేరుతో పార్లమెంట్‌లో తమిళనాడుకు ప్రాతినిథ్యం తగ్గించేందుకు కేంద్ర సర్కార్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు.





## బాలికలపై లైంగిక వేధింపులు

# నిందితుడి ఇంటిపైకి బుల్డోజర్

**ముంబయి, ఏప్రిల్ 15:** దేశచరిత్రలో మునుపెన్నడూ చూడలేని మహా ఘోరం మహారాష్ట్రలో వెలుగుచూసింది. 19 ఏళ్ల మహ్మద్ అయాజ్ అలియాస్ తన్వీర్ అత్యంత దారుణాలకు ఒడిగట్టాడు. ఒక్కరు కాదు, ఇద్దరు కాదు, ఏకంగా 180 మంది బాలికలను ట్రాప్ చేసి వేర్వేరు రహస్య ప్రాంతాలకు తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. అంతటితో ఆగకుండా బాలికల అశ్లీల దృశ్యాలు కూడా చిత్రీకరించి బ్లాక్ మెయిల్‌కు పాల్పడ్డాడు. ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన యావత్తు దేశాన్ని కలవరపాటుకు గురిచేసింది. అమరావతి జిల్లాలోని పరత్వాడా పట్టణానికి చెందిన తన్వీర్ లవ్‌ట్రాప్ పేరుతో బాలికలను ముగ్గులోకి దింపేవాడు. అనంతరం ముంబయి, పుణె నగరాలకు తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడేవాడు. అంతేకాకుండా ఇప్పటి వరకు 350అసభ్య వీడియోలు కూడా చిత్రీకరించాడు. వీటిని అడ్డం పెట్టుకుని బ్లాక్‌మెయిల్ చేసి వ్యభిచార కూపంలోకి దింపేవాడు. వాట్సాప్, స్నాప్‌చాట్ గ్రూపుల ద్వారా మైనర్ బాలికలను లక్ష్యంగా చేసుకుని ట్రాప్‌లో దింపేవాడు. అయితే ఈ విషయం రాజ్యసభ ఎంపి అనిల్ బోండే దృష్టిలో పడడంతో అతగాడి కీచక పర్వం బయటపడింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో తన్వీర్ అకృత్యాలు వెలుగులోకి వచ్చాయి. ఏప్రిల్ 11న తన్వీర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. విచారణలో భయంకరమైన దారుణాలు బయటపడ్డాయి. ఇప్పటి వరకు 180 మంది బాలికలపై అత్యాచారం చేయగా 350 అసభ్య వీడియోలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఏప్రిల్ 14న నిందితుడిని కోర్టులో హాజరుపరచగా 7 రోజులు పోలీస్ కస్టడీకి ఇచ్చింది. ఈ కేసులో మరో ముగ్గురిని కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిలో ఒకరు ఉజేర్‌ఖాన్ అనే నిందితుడు జరిగిన నేరాలను పూసగుచ్చినట్లు చెప్పాడు. ప్రస్తుతం తన్వీర్ మొబైల్‌ను పరిశీలిస్తున్నారు. బిజెపి ఎమ్మెల్యే ప్రవీణ్ తాయడే సమక్షంలో నిందితుడి ఇంటిని జెసిబితో కూల్చివేశారు. తన్వీర్‌కు గతంలో ఎంఐఎంతో సంబంధాలు ఉన్నట్లు వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆ పార్టీ నేతలు స్పందించారు. తన్వీర్‌కు పార్టీతో ఎలాంటి సంబంధాలు లేవని అమరావతి ఎంఐఎం అధ్యక్షుడు సయ్యద్ ముజీబ్ తెలిపారు. తన్వీర్‌ను ఇదివరకే పార్టీ నుంచి తొలగించినట్లు తెలిపారు.

# నాటో కూటమి గతంలో లేదు, భవిష్యత్తులోనూ ఉండదు: ట్రంప్

**వాషింగ్టన్, ఏప్రిల్ 15:** ఇరాన్‌తో యుద్ధం చేసే విషయంలో, హర్మూజ్ జలసంధిని తిరిగి తెరిపించే విషయంలో నాటో కూటమి నుంచి ఎలాంటి సాయం అందకపోవడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ కూటమిపై ఇప్పటికే అనేకసార్లు విరుచుపడిన ఆయన తాజాగా మరోసారి ట్రూత్ సోషల్ వేదికగా విమర్శలు చేశారు. నాటో అమెరికాకు ఎప్పుడూ మద్దతుగా నిలువలేదని మండిపడ్డారు అమెరికాకు అవసమైనప్పుడు ఎప్పుడూ నాటో కూటమి అండగా లేదని, భవిష్యత్తులోనూ దాని నుంచి తమకు ఎలాంటి మద్దతు లభించదని ట్రంప్ వ్యాఖ్యానించారు. తమ దృష్టిలో నాటో కూటమి గతంలో లేదు, భవిష్యతులో ఉండబోదని అసహనం వ్యక్తం చేశారు. కాగా గత కొన్నిరోజులుగా నాటోపై ట్రంప్ విమర్శలు గుప్పిస్తూనే ఉన్నారు. ఇటీవల కూడా నాటో కూటమిని ఒక కాగితపు పులిగా అభివర్ణించారు. కూటమి నుంచి వైదొలిగే యోచనలో ఉన్నట్లు సంచనల ప్రకటన చేశారు. మరోవైపు అమెరికాలో జన్మించిన తొలి పోప్ లియో–14, అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్‌ల మధ్య జగడం మరింత ముదురుతోంది. పోప్‌ను ఉద్దేశిస్తూ ట్రంప్ మంగళవారం ఓ పోస్టు పెట్టారు. గత రెండు నెలల్లో ఇరాన్ దాదాపు 42 వేల మంది అమాయకులైన నిరసనకారులను బలిగొన్నదని ట్రంప్ ఆరోపించారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆ దేశం వద్ద అణ్వాయుధాలు ఉండటం సరైనది కాదని ఉద్ఘాటించారు. ఈ విషయం పోప్ లియోకు అర్థమయ్యేలా ఎవరైనా చెప్పాలంటూ ఎద్దేవి చేశారు. పశ్చిమాసియా యుద్ధంపై పోప్ చేసిన వ్యాఖ్యలపై ట్రంప్ ఘాటుగా స్పందించారు. దాంతో ఇరువరి మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. నాటో ఉంచి వైదొలిగే యోచనలో ఉన్నట్లు ట్రంప్ ప్రకటన నేపథ్యంలో యూరప్ ప్లాన్ బిపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఒకవేళ అమెరికా కూటమి నుంచి వైదొలిగితే ప్రస్తుత సైనిక వ్యవస్థలను ఉపయోగించి తనను తాను రక్షించుకోగలిగే ఒక ప్రత్యామ్నాయ ప్రణాళికను యూరప్ రూపొందిస్తున్నదని మీడియాలో కథనాలు వస్తున్నాయి. 'యూరోపియన్ నాటో' పేరుతో ఈ ప్రతిపాదనపై అధికారులు కృషి చేస్తున్నట్లు కథనాలు వెలువడ్డాయి.

# ఢిల్లీలో భారీ అగ్నిప్రమాదం

## భార్యాభర్త సహా మూడేళ్ల చిన్నారి మృతి



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 15:** ఢిల్లీలోని రోహిణి సెక్టార్‌లో ఘోర అగ్నిప్రమాదం జరిగింది. బుద్ధ విహార్ పరిధిలో స్లమ్ ఏరియాలో మంటలు చెలరేగడంతో గుడిసెలు దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. భార్యాభర్తలు సహా మూడేళ్ల చిన్నారి అగ్నికి ఆహుతి అవడం స్థానికంగా అందరినీ కలచివేసింది. పోలీసులు తెలిపిన ప్రకారం బుద్ధవిహార్ పరిధిలో నిలువ ఉంచిన ప్లాస్టిక్ స్క్రాప్‌లో బుధవారం తెల్లవారుఝామున 1 గంట ప్రాంతంలో మంటలు చెలరేగాయి. ఇది గమనించిన గుడిసెల్లోని కుటుంబాలు అప్రమత్తమయ్యేలోగా గుడిసెలకు మంటలు అంటుకున్నాయి. దీంతో వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. గుడిసెలకు మంటలు అంటుకోవడంతో ఒకే కుటుంబానికి చెందిన భార్యభర్తలు, మూడేళ్ల చిన్నారి మంటల్లో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ఆసుపత్రికి తరలించారు. అగ్ని ప్రమాదానికి కారణాలపై అధికారులు దర్యాప్తు చేపట్టారు.



## ఆప్ ఎంపి ఇళ్లు, కార్యాలయాల్లో ఇడి సోదాలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 15:** ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ సభ్యుడు, అశోక్ కుమార్ మిట్టల్ ఇళ్లు, కార్యాలయాల్లో బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు సోదాలు చేశారు. జలంధర్ కంటోన్మెంట్‌లోని 16, ది మాల్ రోడ్‌లో ఉన్న ఆయన నివాసంలో సోదాలు జరిపినట్లు అధికారులు వెల్లడించారు. రాఘవ్ చద్దా స్థానంలో ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ ఉపనాయకుడిగా మిట్టల్‌ను నియమించిన కొన్ని రోజులకే ఈ పరిణామం చోటుచేసుకుంది. విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం ఉల్లంఘన ఆరోపణలకు సంబంధించి మిట్టల్ నివాసం సహా ఆయనకు సంబంధించిన పలు వ్యాపార సంస్థల్లో సోదాలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈ సోదాలపై త్వరలో ప్రకటన ఉంటుందని అన్నారు. అశోక్ కుమార్ మిట్టల్ వ్యాపారవేత్త, విద్యావేత్త. లవ్లీ గ్రూప్‌నకు అధిపతిగా ఉన్నారు.

# పాక్ మళ్లీ వక్రబుద్ధి

## 800మంది ఉగ్రవాదులను భారత్‌లోకి పంపేందుకు ప్రణాళిక

### గుర్తించిన నిఘా వర్గాలు.. సరిహద్దుల్లో భద్రత కట్టుదిట్టం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 15:** భారత్‌లో ప్రధానంగా జమ్మూ కశ్మీర్‌లో మరోసారి అలజడి సృష్టించేందుకు పాకిస్థాన్ భారీ కుట్రకు తెరలేపింది. సుమారు 800 మంది ఉగ్రవాదులను భారత్‌లోకి పంపేందుకు పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ, ఆ దేశ సైన్యం ప్రణాళికలు రచిస్తున్నట్లు భారత నిఘా వర్గాలు బుధవారం హెచ్చరించాయి. దీని కోసం నియంత్రణ రేఖ (ఎల్‌ఓసి), అంతర్జాతీయ సరిహద్దు వెంబడి సుమారు 70 ఉగ్రవాద లాంచ్ ప్యాడ్‌లను పునరుద్ధరించినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం ప్రపంచ దేశాల దృష్టి మధ్యప్రాచ్య సంక్షోభంపై కేంద్రీకృతమై ఉండటం, అదే సమయంలో భారత్‌లో పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతుండటంతో ఇదే అదునుగా భావించి పాక్ ఈ కుట్రకు పాల్పడుతోందని ఓ అధికారి తెలిపారు. ఈ అవకాశాన్ని వాడుకొని భారీ ఎత్తున ఉగ్రవాదులను కశ్మీర్‌లోకి పంపాలని ఐఎస్ఐ, పాక్ సైన్యం భావిస్తున్నట్లు నిఘా వర్గాలు పేర్కొన్నాయి. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని లాంచ్‌ప్యాడ్‌లకు ఇప్పటికే పెద్ద సంఖ్యలో ఉగ్రవాదులను తరలించి, చొరబాటుకు సిద్ధంగా ఉంచారని సమాచారం. నిఘావర్గాల హెచ్చరికతో సరిహద్దులో భద్రతను మరింత కట్టుదిట్టం చేసినట్లు బిఎస్ఎఫ్ వర్గాలు తెలిపాయి.





# రాబర్ట్ వాద్రాకు ఢిల్లీ కోర్టు సమన్లు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 15:** గుర్గావ్‌లోని షికోపూర్ భూ ఒప్పందానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ప్రముఖ వ్యాపారవేత్త, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ భర్త రాబర్ట్ వాద్రాకు ఢిల్లీ కోర్టు సమన్లు జారీ చేసింది. మరో ఎనిమిది మందికి ప్రత్యేక కోర్టు బుధవారం తాఖీదులిచ్చింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) దాఖలు చేసిన ప్రాసిక్యూషన్ ఫిర్యాదును (ఛార్జ్‌షీట్) పరిగణనలోకి తీసుకున్న రౌస్ అవెన్యూ కోర్టు, మే 16న తమ ముందు హాజరుకావాలని నిందితులందరినీ ఆదేశించింది. 2008 నాటి ఈ భూ ఒప్పందం కేసులో మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్‌ఏ) కింద ఇడి ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది.

# భారత్‌కు భారీగా ఇరాన్ చమురు

## దాదాపు 4 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురు రాక



**ముంబై, ఏప్రిల్ 15:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న తరుణంలో, ఇరాన్ నుంచి భారత్‌కు దాదాపు 4 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురు వచ్చింది. సుమారు ఏడేళ్ల తర్వాత ఇరాన్ నుంచి భారత్ చమురును కొనుగోలు చేస్తోంది. యుద్ధం నేపథ్యంలో ఇరాన్ చమురుపై ఉన్న ఆంక్షలను అమెరికా ఇటీవల తాత్కాలికంగా ఎత్తివేసింది. ఈ నెల 19న గడువు ముగియనుండగా, దీనిని పొడిగించేది లేదని అమెరికా స్పష్టం చేసింది. ట్రంప్ ప్రభుత్వం ఇరాన్ చమురుపై విధించిన గడువు ఈ వారాంతంలో ముగియనున్నందున, భారత్ వ్యూహాత్మకంగా అంతకుముందే టెహ్రాన్ నుంచి చమురును దిగుమతి చేసుకుంటోంది. ఫిబ్రవరి చివరలో ప్రారంభమైన యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ప్రపంచ ఇంధన కొరత, ధరల స్థిరీకరణ కోసం అమెరికా రష్యా, ఇరాన్ ముడి చమురు కొనుగోళ్లకు తాత్కాలికంగా అనుమతించింది. దీనితో ఇరాన్ నుంచి భారత్ చమురును దిగుమతి చేసుకుంటోంది. ఇరాన్ చమురుతో నిండిన అతిపెద్ద ముడి చమురు రవాణా నౌక 'జయ' ఇప్పటికే భారత తూర్పు తీరంలోని పారాదీప్ వద్ద సరుకును దింపుతోంది. మరో చమురు నౌక 'ఫెలిసిటీ' పశ్చిమ తీరంలోని సిక్కాలో చమురును అన్‌లోడ్ చేస్తోంది. ఈ రెండు నౌకల్లో 2 మిలియన్ బ్యారెళ్ల చమురు చొప్పున వచ్చింది. భారతదేశం అవసరాల కోసం ఇరాన్ నుంచి ముడి చమురును సేకరిస్తామని ఈ నెల ప్రారంభంలో భారత్ తెలిపింది. ఇదిలా ఉండగా, ఇరాన్‌లోని ఖర్గ్‌లో ముడి చమురు నింపుకున్న 'డెర్యా' నౌక భారతదేశ పశ్చిమ తీరంలో నిలిచి ఉంది. అయితే ఏ రేవుకు వెళ్లాలన్నదానిపై ఈ నౌక తదుపరి ఆదేశాల కోసం వేచి చూస్తున్నట్లు తెలుస్తోంది.

16-4Pg6exHMNWJQE 10_16-4Pg6exHMNWJQE.qxd 16/Apr/26 12:04 AM Page 1



## ఢిల్లీ సిఎం రేఖాగుప్తకు శ్రీవారి చిత్రపటం బహూకరణ



**తిరుమల,ఏప్రిల్ 15ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి వచ్చిన ఢిల్లీ సిఎం రేఖాగుప్త దంపతులను బుధవారం ఉదయం తిరుమలలోని అతిథిగృహంలో బిజెవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.పృథ్వీరెడ్డి కలిశారు. మర్యాదపూర్వకంగా ఆమెను కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఢిల్లీ రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి సంబంధించిన పలు ముఖ్య అంశాలపై సార్థకమైన ఇరువురి మధ్య చర్చలు జరిపారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చే దిశగా ఆమె నాయకత్వం మరింత బలంగా కొనసాగాలని ఆకాంక్షి ంచారు. అనంతరం స్వామివారి శేషవస్త్రంతో సన్మానించి,శ్రీవారి ఆలయంలో ఆమె గడిపిన క్షణాల చిత్రపటాన్ని అందజేశారు.

## దేశం మరింత అభివృద్ధి చెందాలి - శ్రీవారి సేవలో ప్రముఖులు



**తిరుమల,ఏప్రిల్ 15ప్రభాతవార్తప్రతినిధి:** అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు తిరుమల ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో దేశం అన్ని విధాలా మరింత అభివృద్ధి చెందాలని, ప్రజలకు శుభాలు కలగాలని వేడుకున్నట్లు ప్రముఖులు తెలిపారు. శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో దేశప్రజలందరికీ మంచి జరగాలని, అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. బుధవారం ఉదయం శ్రీవారి తోమాల సేవలో, విఐపి బ్రేక్‌లో సినీనటుడు సోనాసూద్ కుటుంబంతో కలసి, బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కిడాంబి శ్రీకాంత్, మహిళా మాజీ క్రికెటర్ మిథాలీరాజ్ వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకున్నారు.

శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనకు వైసిపి మద్దతు - పార్టీ కీలక నేత సజ్జల రామకృష్ణారెడ్డి

**విజయవాడ,ఏప్రిల్ 15,ప్రభాతవార్తప్రతినిధి:** దేశవ్యాప్తంగా లోక్‌సభ.అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలన్న కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ప్రకటించింది. పార్టీ తరపున కీలక నేత సజ్జల రామకృష్ణ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. డీలిమిటేషన్ అనేది ప్రజాస్వామ్య ప్రక్రియలో ఒక భాగమని, జనాభా ప్రాతిపదికన ప్రతినిధుల సంఖ్య పెరగడం వల్ల ప్రజలకు పాలన మరింత చేరువవుతుందని అభిప్రాయపడ్డారు. దేశవ్యాప్తంగా ప్రాతినిధ్యాన్ని సమతుల్యం చేయడానికి ఇది సరైన నిర్ణయమని, దీనివల్ల ఓటరుకు మరియు ప్రజా ప్రతినిధికి మధ్య ఉన్న దూరం తగ్గుతుందని వైసీపీ భావిస్తోందని సజ్జల స్పష్టం చేసారు..డీలిమిటేషన్ వల్ల కేవలం సీట్ల సంఖ్య పెరగడమే కాకుండా, బడుగు బలహీన వర్గాలకు రాజకీయాల్లో మరిన్ని అవకాశాలు లభిస్తాయని వైసీపీ ఆశిస్తోంది. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు కావాలన్నా ఈ పునర్విభజన ప్రక్రియ తప్పనిసరని అన్నారు. అందుకే దీనిని స్వాగతించాల్సి న అవసరం ఉందని సజ్జల పేర్కొన్నారు. కేంద్రం తీసుకునే ఈ నిర్ణయం ప్రజాస్వామ్య పరిరక్షణకు, భవిష్యత్తు రాజకీయ అవసరాలకు అనుగుణంగా ఉందని వైసీపీ స్పష్టం చేసింది. ఈ పరిణామం రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీసే అవకాశం ఉందని సజ్జల వ్యాఖ్యానించారు.

## కృష్ణపట్నం పోర్ట్‌ను సందర్శించిన మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి

**ముత్తుకూరు (నెల్లూరు), ఏప్రిల్ 15, ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లా అదాని కృష్ణపట్నం పోర్ట్‌ను బుధవారం పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్యలతో, సీఈఓ రాఘవరావు, పోర్టు ప్రతినిధులతో కలిసి షిప్‌లో ప్రయాణించారు.పోర్టు మొత్తం పర్యవేక్షించడంతో పాటు పోర్టుకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.కృష్ణపట్నం పోర్టు కార్యకలాపాల విస్తరణ, కంటైన ర్ టెర్మినల్ పునరుద్ధరణ, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలపై మంత్రి చర్చించారు. ఎగుమతి, దిగుమతి సామర్థం పెంచే విధంగా పోర్టు విస్తరణ పనులు చేపట్టాలని మంత్రి సూచించారు.పోర్టు కార్యకలాపాలు పెరగడం ద్వారా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పోర్ట్ సీఈఓ జగదీష్ పటేల్, పలువురు కూటమి నేతలు, పోర్ట్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రచందనం స్మగ్లర్‌కు జైలు శిక్ష

**తిరుపతి, ఏప్రిల్ 15ప్రభాతవార్తప్రతినిధి:** ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో తిరుపతి జిల్లా ఆర్ఎస్ఎస్ ఏడిజె కోర్టు బుధవారం కీలక తీర్పును వెలువరించింది.తిరుపతి జిల్లా ఎర్ర వారి పాలెం మండలంకు చెందిన స్మగ్లర్ వాయలపాటి హరినాథ రెడ్డి (54) స్మగ్లర్‌కు 5 సంవత్సరం జైలుశిక్ష, 3 లక్షల రూపాయలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారని తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు తెలిపారు.

ఎర్ర వారి పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో 2016లో నమోదైన కేసు అవసరమైన సాక్ష్యాలను పోలీసులు న్యాయస్థానంకు అందజేసి శిక్షపడేలా చూశారు.

## ఎస్పీడిసిఎల్ డిప్యూటీ ఇఇ సస్పెన్షన్

**తిరుపతి, ఏప్రిల్ 15ప్రభాతవార్తప్రతినిధి:** ఎస్పీడీసీఎల్ పరిధిలోని సత్యసాయి సర్కిల్, మడకశిర సబ్‌డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గా విధులు నిర్వహిస్తున్న ఎం. రఘును విధుల నుంచి తొలగిస్తూ ఎస్పీడీసీఎల్ సిఎండి శివశంకర్ లోతేటి బుధవారం ఆదేశాలు జారీ చేశారు. అవినీతి ఆరోపణలు, విద్యుత్ పరికరాల దుర్వినియోగం, పాడైపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల రవాణాకు డిపార్ట్‌మెంటల్ వ్యాన్‌ను ఉపయోగించకపోవడం, రైతులతో దురుసుగా ప్రవర్తించడం, ఎస్‌ఎపిలో 262 వ్యవసాయ సర్వీసు దరఖాస్తులను ఉద్దేశపూర్వకంగా తొలగించడం, వివిధ ప్రదేశాల్లో విద్యుత్ లైన్లను అంచనాల అనుమతి లేకుండా మార్చడం, తదితర అంశాలపై క్రమశిక్షణా చర్యలు తీసుకున్నట్లు ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు.

## జూన్ నాటికి డంప్ యార్డులు క్లీన్ చేయాలి

### - లెగసీ వేస్ట్ తొలగింపుపై స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ ఆదేశం

**విజయవాడ ఏప్రిల్ 15 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలోని లెగసీ వేస్ట్‌ని వెంటనే తొలగించాలని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ప్రైవేటు ఏజన్సీలను ఆదేశించారు. అమరావతిలోని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ కార్యాలయంలో కార్పొరేషన్ మేనేజింగ్ బి.అనిల్ కుమార్ రెడ్డితో కలిసి ప్రైవేటు ఏజన్సీల ప్రతినిధులతో వివిధ పనులు జరుగుతున్న తీరును పట్టాభిరామ్ సమీక్షించారు. లెగసీ వేస్ట్ తొలగింపు. రవాణా సౌకర్యాలు, ఆర్టీఎఫ్ , ఫ్రెష్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్ల ఏర్పాటు, వాటి కోసం స్థలాల సేకరణ, ఆయా ప్రదేశాలలో మట్టిని ల్యాబ్ లకు పంపించడం..మొదలైన విషయాలను లోతుగా సమీక్షించారు. తిరుపతి, నెల్లూరు, కడప, కర్నూలు, అనంతపురం, ధర్మవరం, పుట్టపర్తి, రాజంపేట ,ఆదోని పార్వతీపురం, పాలకొల్లు, నిడదవోలు తదితర నగరాలు, పట్టణాలలో పరిస్థితులను ఏజన్సీల ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. ఏజన్సీలు మందకోడిగా పనులు చేయడం పట్ల చైర్మన్ పట్టాభిరామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు వేగవంతం చేయడానికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. రాష్ట్రంలో పారిశుధ్యంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టిపెట్టారని, పనులలో వేగం పెంచాలని ఆదేశించారు. కొన్ని చోట్ల లెగసీ వేస్ట్ పూర్తిగా తొలగించకుండా, దానిపైనే ఫ్రెష్ వేస్ట్ వేస్తున్నారని తెలుసుకుని, అది సరైన పద్ధతికాదని చెప్పారు. డంప్ యార్డుల నుంచి తొలగిస్తున్న లెగసీవేస్ట్ ని ఎక్కడికి తరలిస్తున్నారో ఆ వివరాలను కూడా రిపోర్ట్‌లో పొందుపరచాలన్నారు. ఎక్కడైతే ప్రాసెసింగ్ సెంటర్ల ఏర్పాటుకు భూముల లభ్యత సమస్య ఉందో, ఆయా జిల్లాల కలెక్టర్లతో , ఎమ్మెల్యేలతో తాను మాట్లాడతానని చైర్మన్ పట్టాభిరామ్ చెప్పారు. పలు చోట్ల ఏజన్సీలు లెగసీ వేస్ట్ తొలగింపు పనులు ప్రారంభించకపోవడం పట్ల కార్పొరేషన్ ఎండీ, బి.అనిల్ కుమార్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ నెల 21వ తేదీ లోపల పనులు ప్రారంభించని ఏజన్సీల ఒప్పందం రద్దుకు సిఫారసు చేయడానికి తాము వెనుకాడబోమన్నారు. జూన్ నాటికి పనులు మొత్తం పూర్తి చేయాలని, ఏవైనా సమస్యలు ఉంటే, వెంటనే తమకు తెలియజేయాలని ఆయన ఆదేశించారు. ఒక పక్క లెగసీవేస్ట్ ని తొలగిస్తూ మరోపక్క వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని అనిల్ కుమార్ రెడ్డి చెప్పారు.

# తెలుగుదేశం పార్టీలో రాయలసీమకు పెద్దపీట

### - జాతీయ, రాష్ట్ర కమిటీల్లో సీమలోనే 59 మందికి పదవులు - కడప, అనంతపురం జిల్లాలకు కీలక పదవులు

**రాజంపేట, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ జాతీయ, రాష్ట్ర కమిటీలలో రాయలసీమకు పెద్దపీట వేశారు. అత్యున్నత పదవులు ఇచ్చారు. గత ఎన్నికల్లో సీమ ప్రజలు తెలుగుదేశం పార్టీని ఎలా అక్కున చేసుకున్నారో పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు కూడా అదే రీతిలో పదవులను కట్టబెట్టి పార్టీ వైఖరిని స్పష్టం చేశారు. మొత్తం 245 పదవుల్లో పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు, కార్యనిర్వాహక అధ్యక్షుడుగా నూతనంగా ఎన్నికైన మంత్రి నారా లోకేష్ కాకుండా 59 పదవులు రాయల సీమలోని పార్టీ నేతలకే ఇచ్చారంటే విశేషం. పార్టీ రాష్ట్ర కమిటీలలో లోకేష్ బ్రాండ్ స్పష్టంగా కనిపిస్తోంది. ఇక్కడ కూడా పార్టీలో సీనియర్లకు ప్రాధాన్యత ఇస్తూనే ఆది నుంచి పార్టీని నమ్ముకుని ప్రయాణం కొనసాగిస్తున్న వారికి అగ్ర తాంబూలం ఇచ్చారు. వలసనేతలకు దాదాపు పార్టీలో మొండి చేయి చూపారు.29 మందితో ఏర్పాటుచేసిన రాష్ట్ర ఉన్నత స్థాయి పొలిట్ బ్యూరోలో హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, బనగానపల్లె నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులకు స్థానం కల్పించారు .గతంలో ఉన్న కడప శ్రీనివాసులు రెడ్డికి ఈ దఫా జోనల్ ఇన్చార్జిగా అవకాశం ఇచ్చారు. మరోవైపు31 మందితో ఏర్పాటైనజాతీయ కమిటీలో జాతీయ ప్రధాన కార్యదర్శిగా నందికొట్కూరు నియోజకవర్గంనుంచి బైరెడ్డి శబరికి అవకాశం కల్పించారు. జాతీయ ఉపాధ్యక్షులుగా కడప జిల్లాకి చెందిన కడప అసెంబ్లీకి సంబంధించి పార్టీ సీనియర్ నేత బాలిశెట్టి హరిప్రసాద్ ప్రస్తుతం ఎమ్మెల్సీ రామ్ గోపాల్ రెడ్డికి అవకాశం ఇచ్చారు. జాతీయ అధికార ప్రతినిధులలో దీపక్ రెడ్డి( రాయదుర్గం), బీకే పార్థసారథి (పెనుకొండ), ఎన్.విజయకుమార్ (తిరుపతి) ఎంపికయ్యారు.రాష్ట్ర ప్రధానకార్యదర్శులుగా 7 మంది నియ మించగా అందులో వి .ఎస్ ముక్తియార్ (కడప జిల్లా ప్రొద్దుటూరు) ఎన్ అమర్నాథరెడ్డి (పలమనేరు)కు చోటు కల్పించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా 16 మందిని ఎంపిక చేయగా అందులో సంజీవ్ కుమార్ (కర్నూల్), ఆకుపోగు ప్రభాకర్ (కోడుమూరు ),జి.తిప్పే స్వామి (మడకశిర)బి. నరసింహయాదవ్ (తిరుపతి) ఎంపికయ్యారు., రాష్ట్ర అధికార ప్రతినిధులుగా14 మందిని ఏర్పాటు చేయగా అందులో దీవి జయ నాగేశ్వరరెడ్డి (ఎమ్మిగనూరు) మద్దిపట్ల సూర్య ప్రకాష్ ( పీలేరు) లకు అవకాశం దక్కింది. రాష్ట్ర జోనల్ కో ఆర్డినేటర్లగా 10 మందిని ఏర్పాటు చేయగా అందులో నిన్నటి వరకు పొలిట్ బ్యూరో ఉన్న రెడ్డప్ప గారి శ్రీనివాసరెడ్డి ( వాసు కడప), బిటి నాయుడు ( ఆదోని) ఎంపికయ్యారు. రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులుగా59 మందిని నియమించగా అందులో యనమల సుధాకర్ (బద్వేల్) ఎస్. గోవర్ధన్ రెడ్డి (కడప) మాల్రా శివానందరెడ్డి (నందికొట్కూరు) తుగ్గలి నాగేంద్ర (పత్తికొండ), పి తిక్క రెడ్డి ( మంత్రాలయం), మాన్వి దేవేంద్రప్ప (ఆదోని), డాక్టర్ పత్తి హిమబిందు ( గుంతకల్ ),దావెళ్ల మురళి (అనంతపురం), కొండవీటి భావన (అనంతపురం) ,ముద్దాల రంగయ్య (రాప్తాడు) ,సామకోట ఆదినారాయణ (పుట్టపర్తి), పరిటాల శ్రీరామ్ (ధర్మవరం), పర్వీన్ భాను (కదిరి), గిరిజా శ్రీ అలియాస్ పర్వీన్ తాజ్ (తంబళ్లపల్లె), ఏ.రవి నాయుడు (తిరుపతి) భీమినేని చిట్టిబాబు (గంగాధర్ నెల్లూరు) ఎంపికయ్యారు. రాష్ట్ర కార్యదర్శులుగా 77 మందిని నియమిస్తే రాయలసీమలో( మోహన్ రెడ్డి (రాజంపేట) దుద్యాల అనిత దీప్తి ( రైల్వే కోడూరు), పి మునిశేఖర్ రెడ్డి (మైదుకూరు ),ధరూరు జేమ్స్ (కర్నూల్) ,కె పద్మలత రెడ్డి (కర్నూల్) ,వలసల రామకృష్ణ (డోన్,) దేవేల వెంకట రాముడు (అనంతపురం), డిపోలన్న (అనంతపురం), తేజస్విని (అనంతపురం) తలారి ఆదినారాయణ (అనంతపురం), పాల్యం రామసుబ్బమ్మ ( రాప్తాడు) ,నిమ్మల అమరీష్ (పెనుగొండ ), జెరిపిటి నరసింహులు (పుట్టపర్తి), పి.తులసి( మదనపల్లె), అనిత యాదవ్ (తిరుపతి ) పురిమెట్ల కుమారి (తిరుపతి), డాక్టర్ గుమ్మడిపూడి దశరధాచారి ( శ్రీకాళహస్తి) మాసారపు సుబ్బయ్య (శ్రీకాళహస్తి )పి. చందన స్రవంతి( సత్యవేడు )లక్ష్మీ మ్మ ప్రసన్న (నగిరి )ఆర్ మీరా( నగిరి) కర్జాల అరుణ (గంగాధర్ నెల్లూరు) ఎంపికయ్యారు.

## లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన (డిలిమిటేషన్) అంశంపై ఎపి సిఎం చంద్రబాబుకు టిజి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లేఖ



**విజయవాడ,ఏప్రిల్ 15,ప్రభాత ˇవార్తప్రతినిధి:** లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన (డిలిమిటేషన్) అంశంపై దక్షిణాది రాష్ట్రాల గళాన్ని వినిపిస్తూ టీజీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏపీ సీఎం చంద్రబాబుకు లేఖ రాసారు.నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ వల్ల దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ఉనికి ప్రశ్నార్థకంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేస్తూ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఏపీ సీఎం చంద్రబాబుతో పాటు స్టాలిన్, సిద్ధరామయ్య, పినరయి విజయన్ వంటి నేతలకు లేఖలు పంపించారు. జనాభా ప్రాతిపదికన మాత్రమే సీట్ల పెంపు చేపడితే, పార్లమెంట్‌లో దక్షిణాది రాష్ట్రాల ప్రాధాన్యత గణనీయంగా తగ్గిపోతుందని ఆయన హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్లు మరియు సీట్ల పెంపును ముడిపెడుతూ గందరగోళం సృష్టిస్తోందని, దీనివల్ల భవిష్యత్తులో దక్షిణాది రాష్ట్రాల మాటకు విలువ ఉండదని ఆయన అభిప్రాయపడ్డారు. సమాఖ్య స్ఫూర్తిని కాపాడేందుకు రాజకీయాలకు అతీతంగా దక్షిణాది రాష్ట్రాలన్నీ ఒకే తాటిపైకి రావాల్సి న సమయం ఆసన్నమైందని ఆయన ఈ లేఖల ద్వారా స్పష్టం చేశారుజ ప్రస్తుత లెక్కల ప్రకారం ఉత్తరాది రాష్ట్రాల్లో జనాభా పెరగడం, దక్షిణాదిలో జనాభా నియంత్రణ విజయవంతంగా అమలు కావడం రాజకీయంగా మనకు శాపంగా మారుతోందని విశ్లేషకులు చెబుతున్నారనే విషయం పరిగణనలోకి తీసుకోవాలన్నారు. లోక్‌సభ స్థానాలను 543 నుండి 850కి పెంచితే, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల సీట్లు 80 నుంచి ఏకంగా 120కి పెరిగే అవకాశం ఉండగా, దక్షిణాది రాష్ట్రాల వాటా ఆ నిష్పత్తిలో పెరగదు. అంటే, దేశాభివృద్ధికి భారీగా పన్నులు చెల్లిస్తూ, విద్యా, వైద్య రంగాల్లో పురోగతి సాధించినందుకు గాను దక్షిణాది రాష్ట్రాలకు రాజకీయ ప్రాతినిధ్యంలో ˇశిక్ష విధిస్తున్నట్లుగా ఉందని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కేవలం సీట్ల సంఖ్య సమస్య మాత్రమే కాదని, దేశ విధాన నిర్ణయాల్లో దక్షిణాది రాష్ట్రాల ప్రభావం కనుమరుగయ్యే ప్రమాదమని ఆయన నొక్కి చెప్పారు ఈ సంక్లిష్ట సమస్యకు పరిష్కారంగా సీఎం రేవంత్ రెడ్డి ఒక వినూత్నమైన ˛హైబ్రిడ్ మోడల్˛.ను ప్రతిపాదించారు. కేవలం జనాభానే ప్రాతిపదికగా తీసుకోకుండా, పెరిగే సీట్లలో సగభాగాన్ని మాత్రమే జనాభా ఆధారంగా కేటాయించాలని ఆయన సూచించారు. మిగిలిన సగం సీట్లను ఆయా రాష్ట్రాల ఆర్థిక సహకారం (జీఎస్‌డీపీ) పన్నుల చెల్లింపు, అక్షరాస్యత మరియు ఇతర అభివృద్ధి సూచికల ఆధారంగా కేటాయించాలని స్పష్టం చేశారు.

అప్పుడే బాధ్యతాయుతంగా వ్యవహరిస్తున్న రాష్ట్రాలకు న్యాయం జరుగుతుందని, దేశాభివృద్ధిలో పోటీతత్వం పెరుగుతుందని ఆయన పేర్కొ న్నారు.

ఈ హైబ్రిడ్ విధానంపై దక్షిణాది ముఖ్యమంత్రులంతా చర్చించి, కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని ఆయన తన లేఖలో కోరారు.

## అవకాశం.. నా అదృష్టం.. పార్టీ బలోపేతానికి కృషి

### - చంద్రగిరి నియోజకవర్గ టిడిపి కార్యకర్తల సమావేశంలో మంత్రి లోకేష్



**తిరుపతిరూరల్, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎంపికైన నారా లోకేష్ తనకు లభించిన అవకాశాన్ని అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. బుధవారం రామానాయుడు సమావేశ మందిరములో చంద్రగిరి నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ పార్టీ విజయానికి కార్యకర్తల త్యాగాలే కారణమని పేర్కొన్న లోకేష్...అన్యాయంగా కేసులు పెట్టిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. భక్తులపై దాడులు చేసినవారిని వదిలిపెట్టబోమని హెచ్చరించారు. తనపై కూడా 23 కేసులు నమోదైనట్లు తెలిపారు. 40వేల మంది కార్యకర్తలపై తప్పుడు 2వేలు కేసులు తొలగించినట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్ర రాష్ట్రంలో రూ.4వేల రుపాయాల పెన్సన్‌తో పాటు వికలాంగులకు రూ.6వేల రుపాయాల పెన్సన్ అందిస్తున్నట్లు తెలిపారు. స్త్రీ శక్తి పథకం కింద మహిళలకు రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత బస్సు ప్రయాణం కల్పించినట్లు తెలిపారు. డియస్సీ ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో మంత్రి అనగాని సత్యప్రసాద్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, జిడి నెల్లూరు ఎమ్మెల్యే థామస్, తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, తుడ చైర్మెన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కూటమి పాలనలో అభివృద్ధి పరుగులు : మంత్రి బిసి జనార్దన్ రెడ్డి



**ముత్తుకూరు (నెల్లూరు), ఏప్రిల్ 15, ప్రభాతవార్త :** కూటమి పాలనలో అభివృద్ధి పరుగులు తీస్తోందని, అప్పుడూ, ఇప్పుడూ రాష్ట్ర అభివృద్ధి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ముత్తుకూరు మండలం నేలటూరుపాలెంలో 30.59 లక్షల రూపాయలతో నిర్మించిన సిమెంట్ రోడ్లను సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డితో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధికి మారుపేరు తెలుగుదేశం పార్టీ అన్నారు. 2014-19 మధ్య టీడీపీ పాలనలో గ్రామగ్రామాన అభివృద్ధి పనులు జాతరలా జరిగాయన్నారు. అయితే 2019-24 మధ్య వైసీపీ పాలనలో అభివృద్ధి పూర్తిగా స్తంభించిందన్నారు.2024లో కూటమి అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పనులు మళ్లీ మొదలయ్యాయన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశీస్సులు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అండదండలతో సీఎం చంద్రబాబు నాయుడు అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారన్నారు. ప్రతి గ్రామంలో సీసీ రోడ్ల, డ్రైన్ల నిర్మాణంతో పాటు వివిధ రకాల అభివృద్ధి పనులు పెద్ద ఎత్తున జరుగుతున్నాయని తెలిపారు. అనంతరం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనలో అభివృద్ధిని విస్మరించి దోపిడీపైనే దృష్టి పెట్టారని ధ్వజమెత్తారు.కాలుష్యంతో అల్లాడుతున్న నేలటూరు గ్రామాన్ని తరలించేందుకు గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే చర్యలు చేపట్టామన్నారు.ప్రధాన గ్రామం కోసం మాదరాజుగూడూరు వద్ద భూమి కేటాయించి ఇళ్ల నిర్మాణం కూడా ప్రారంభించామన్నారు. మత్స్యకారుల కోసం చేపట్టిన ఇళ్ల నిర్మాణం వావిలేటిపాడు వద్ద పునాదుల స్థాయిలోనే నిలిచిపోయిందని గుర్తు చేశారు.ఎస్సీ కాలనీ వాసుల కోసం భూసేకరణ జరగాల్సివుందన్నారు. 2019కి ముందు కొన్ని ప్రాంతాలను పరిశీలించామని, ఎన్నికల కోడ్‌తో ఆ ప్రక్రియ ఆగిపోయిందన్నారు. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో నేలటూరు వాసులపై కక్షకట్టినట్టుగా ఇళ్ల నిర్మాణాన్ని అర్థాంతరంగా ఆపేశారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మొదట మాదరాజుగూడూరు వద్ద పనులను పూర్తి చేయిస్తున్నామన్నారు. ఆర్అండ్ ఆర్ కాలనీల నిర్మాణం పూర్తి చేయడానికి ఏపీ జెన్ కో తో పాటు సెయిల్ కంపెనీ నిధులు ఇవ్వాల్సివుందన్నారు. ఒప్పందం ప్రకారం నిధులు కేటాయిస్తే ఆర్ అండ్ ఆర్ కాలనీల నిర్మాణం త్వరితగతిన పూర్తవుతుందని తెలియజేశారు. గ్రామం తరలింపు పేరుతో నేలటూరులో అభివృద్ధి పనులు నిలిచిపోతున్నాయని, నేలటూరు తరలింపునకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. అలాగే ఫిషింగ్ జెట్టీ నిర్మాణంతో పాటు ఆర్ అండ్ ఆర్ కాలనీల నిర్మాణ బాధ్యత తనదే అని స్పష్టం చేశారు. కాగా నేలటూరు వాసులు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, ఏపీ ఇన్ లాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ డాక్టర్ జెడ్.శివప్రసాద్, ఏపీ కనీస వేతన సలహా మండలి చైర్మన్ పెళ్లకూరు శ్రీనివాసులు రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శీపారెడ్డి వంశీధర్ రెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బొబ్బేపల్లి సురేష్ నాయుడు తదితరులకు ఆత్మీయ ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు నీలం మల్లికార్జున యాదవ్, టిడిపి సీనియర్ నాయకులు ఈదూరు రామ్మోహన్ రెడ్డి, మండల తెలుగు యువత అధ్యక్షులు రాగాల శివకృష్ణ, కృష్ణపట్నం దేవస్థానాల చైర్మన్ మామిడాల శ్రీనివాసులు, వివిధ గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దుర్గమ్మ ఆలయంలో హుండీల ద్వారా రు.2కోట్ల 68 లక్షలు

**ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 15, ప్రభాతవార్త :** శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో భక్తులు శ్రీ అమ్మవారికి హుండీల ద్వారా రు.2కోట్ల 68 లక్షల 48వేల 521ల భారతీయ నగదుతో పాటు 249 యుఎస్ఎ డాలర్లు, 45 యూరోలు, 7 మలేషియన్ రింగేట్స్, 34 సింగపూర్ డాలర్స్, 130 యుఎఇ దిర్హమ్స్, 1.25 కువైట్ దినార్లు, 221 సౌదీ రియాల్స్, 20 న్యూజిలాండ్ డాలర్స్, 60 ఆస్ట్రేలియా డాలర్స్, 35 ఇంగ్లండ్ పౌండ్స్, 180 థాయ్‌లాండ్ (బిఎహెచ్‌టి) =, 200 ఒమన్ బైసాలు, 11 కతార్ రియాల్స్, 430 గ్రాముల బంగారం, 2కెజిల 755 గ్రాముల వెండి కానుకలుగా సమర్పించారని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. బుధవారం జరిగిన హుండీలెక్కింపులను ఆయన చైర్మన్ బొర్రా రాధాకృష్ణ పర్యవేక్షించారు.



హుండీ లెక్కింపులు పర్యవేక్షిస్తున్న ఇఓ

## ఇంటర్ ఫలితాల్లో ఎంజేపీ గురుకులాలు ప్రభంజనం: మంత్రి సవిత

**ˇవిజయవాడ ఏప్రిల్ 15 ప్రభాతవార్త ప్రతినిధి:** ఫస్ట్ ఇంటర్‌లో 97 శాతం, సెకండ్ ఇంటర్‌లో 94శాతంతో బీసీ గురుకులం విద్యార్థుల సత్తా. ఎంజేపీ ఫలితాలపై మంత్రి సవిత హర్షం. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు మంత్రి సవిత అభినందనలు. ఫలితాల సాధనలో ఎంజేపీ స్కూళ్ల సిబ్బంది పనితీరు అమోఘం. ఫలించిన సీఎం చంద్రబాబు , మంత్రి నారా లోకేశ్ కృషి. బీసీ గురుకులాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు వెచ్చించిన కూటమి ప్రభుత్వం. బీసీ విద్యార్థులకు ఆహార, ఆరోగ్య భద్రతతో కూడిన విద్య అందిస్తున్నాం. బీసీ బిడ్డల అత్యుత్తమ ఫలితాలతో నెరవేరిన కూటమి ప్రభుత్వం లక్ష్యం.

## సిఎం చంద్రబాబుపై అనుచిత పోస్టులు

### - రాప్తాడుకు చెందిన గిరీష్ అరెస్ట్.. ఆపై సొంత పూచీకత్తుపై బెయిల్ !

**కుప్పం, ఏప్రిల్ 15 ప్రభాతవార్త** సిఎం చంద్రబాబునాయుడుపై సోషియల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన అనంతపురం జిల్లా రాప్తాడు నియోజకవర్గం పంపనూరుకు చెందిన వైఎస్సార్సీ సోషియల్ మీడియా ఇన్‌చార్జ్ గిరీష్‌కుమార్‌రెడ్డి, మాజీ సిఎం వైఎస్ జగన్ మాజీ సిపిఆర్వో శ్రీహరిలపై తెదేపా నేతల ఫిర్యాదు మేరకు కుప్పం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. ఈకేసుకు సంబంధించి గిరీష్‌కుమార్‌రెడ్డిని బుధవారం కుప్పం పోలీసులు అరెస్ట్ చేసి కుప్పం కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి 25వేల రూపాయల సొంత పూచీకత్తుతో గిరీష్‌కుమార్‌రెడ్డికి బెయిల్ మంజూరు చేశారు. కాగా మాజీ సిపిఆర్వో శ్రీహరిని కుప్పం పోలీసులు అదుపులో తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. కాగా బుధవారం కుప్పం కోర్టుకు మాజీ అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వచ్చారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్సీ భరత్ పలువురు స్థానిక నేతలతో కలసి కుప్పం కోర్టు వద్దకు చేరుకుని పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, స్థానిక న్యాయవాదులతో మాట్లాడారు.

## లక్ష్మి దుర్గ పిటిషన్ డిస్మిస్

### డ్రైవర్ హత్యకేసులో ఎమ్మెల్సీ అనంతబాబు భార్య రెండో నిందితురాలుగా కొనసాగింపు

**రాజమహేంద్రవరం,ఏప్రిల్15, ప్రభాతవార్త** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి. దళిత వర్గానికి చెందిన డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం ను హత్యచేశారన్న కేసులో రెండో నిందితురాలు గా వున్న అనంత లక్ష్మీ దుర్గ ను ఆ కేసు నుంచి తొలగించాలని వేసిన పిటిషన్ ను స్పెషల్ కోర్టు డిస్మిస్ చేసింది. లక్ష్మీ దుర్గ పాత్ర ఆ కేసులో ప్రాథమికంగా నిర్ధారణ ఉన్నందున నిందితురాలుగా కొనసాగిస్తూ ప్రత్యేక న్యాయస్థానం విచారణలో ఆదేశించింది.డ్రైవర్ సుబ్రహ్మణ్యంని ఎంఎల్సీ అనంతబాబు హత్య చేశారన్న కేసులో రెండో నిందితురాలు గావున్న లక్ష్మీ దుర్గ ను ప్రమేయం లేదంటూ నిందితులు తరుపున వేసిన పిటిషన్ వాద ప్రతి వాదనలు విన్న జడ్జి గంధం సునీత ఈ మేరకు తీర్పు చెప్పారు. ఈనెల 17న తదుపరి హత్య కేసు విచారణకు ఇరువురు హాజరు కావలసిందిగా ఆదేశించారు.ఈవిచారణ రాజమహేంద్రవరం ప్రత్యేక కోర్టులో జరిగింది. ఎంఎల్సీ అనంతబాబు ప్రధాన నిందితుడిగా ఉన్న ఈ కేసులో ఆయన భార్య లక్ష్మీ దుర్గ కూడా రెండో నిందితురాలుగా పోలీసులు నమోదు చేశారు. దీనిపై ఎమ్మెల్సీ భార్య లక్ష్మీ దుర్గ కు ఈ హత్యకు సంబంధం లేదని పెట్టుకున్న పిటిషన్ పై వాద ప్రతి వాదనలు జరిగాయి.హత్యలో సంబంధంలేని లక్ష్మీ దుర్గ ను కేసు నుంచి తొలగించాలంటూ ఆమె తరపు న్యాయవాదులు వాదించగా హత్యా సమయంలో సిసి ఫుటేజ్ ను,

సెల్ఫోన్ రికార్డ్స్ తదితర ప్రాథమిక ఆధారాలు నేపథ్యంలో లక్ష్మీ దుర్గ పాత్ర ఉన్నదంటూ ప్రాసిక్యూషన్ వాదించింది.

16-4Pg7exHMNWJQE 11_16-4Pg7exHMNWJQE.qxd 16/Apr/26 12:01 AM Page 1



# లోకేష్‌కు కీలక బాధ్యతలు..

## టిడిపిలో నూతన ఉత్సాహం: పల్లా శ్రీనివాసరావు

**(ప్రభాతవార్త విశాఖపట్నం)**తెలుగుదేశం పార్టీలో కీలక పరిణామంగా యువనేత నారా లోకేష్ పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టడంపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. లోకేష్ నియామకం పార్టీకి నూతన ఉత్సాహాన్ని తీసుకొస్తుందని ఆయన పేర్కొన్నారు. పార్టీ క్షేత్రస్థాయిలో యంత్రాంగాన్ని బలోపేతం చేయడంతో పాటు యువతను ఏకతాటిపైకి తీసుకురావడంలో లోకేష్ కీలక పాత్ర పోషించారని పల్లా కొనియాడారు. ఆయన నాయకత్వం టీడీపీ చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా, తనను రెండోసారి రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించిన పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు పల్లా కృతజ్ఞతలు తెలిపారు. బీసీలకు రాజకీయంగా ప్రాధాన్యం కల్పించడంలో టీడీపీ ముందుంటుందని, తనలాంటి బీసీ నేతకు ఈ స్థాయి అవకాశం రావడం చంద్రబాబు దూరదృష్టికి నిదర్శనమని అన్నారు. 'యువగళం' పాదయాత్రతో ప్రజలతో మమేకమైన లోకేష్ నాయకత్వంలో, చంద్రబాబు మార్గదర్శకత్వంలో పార్టీని మరింత బలోపేతం చేస్తామని పల్లా స్పష్టం చేశారు. కార్యకర్తల సంక్షేమం, డిజిటల్ మెంబర్‌షిప్ ద్వారా భారీ స్థాయిలో సభ్యత్వ నమోదు వంటి కార్యక్రమాలతో పార్టీకి ఆధునిక నిర్మాణాన్ని తీసుకువచ్చారని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడమే తమ లక్ష్యమని, సీనియర్ల అనుభవాన్ని వినియోగించుకుంటూ యువతకు అవకాశాలు కల్పిస్తామని పల్లా పేర్కొన్నారు.



# కాకినాడ యాంకరేజ్ పోర్టులో పౌర సరఫరా, రెవెన్యూ అధికారులు సంయుక్త తనిఖీ

## రూ.3.54 కోట్లు విలువ చేసే పిడిఎస్ రైస్ సీజ్

**కాకినాడ , ఏప్రిల్ 15 ప్రభాతవార్త ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి:** కాకినాడ యాంకరేజ్ పోర్టులో పౌర సరఫరా, రెవెన్యూ అధికారులు రాష్ట్ర పౌర సరఫరా కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈతనిఖీలలో భాగంగా కాకినాడ యాంకరేజ్ పోర్టు దగ్గర భార్జీలలో, రైల్వే వ్యాగన్‌లలో ఉన్న బియ్యాన్ని పరిశీలించారు. తదుపరి చెక్‌పోస్ట్‌లోని రిజిస్టర్‌లను క్షుణ్ణంగా పరిశీలించి బాయిల్డ్ రైస్, రా రైస్, రా బ్రోకెన్స్ ఎగుమతి విధానాన్ని పరిశీలించారు. టెక్నికల్ సిబ్బంది రిజిస్టర్‌లో నమోదు చేసిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, వారికి పలుసూచనలు ఇచ్చారు. తదుపరి మానస ఎంటర్‌ప్రైజెస్ గోడౌన్‌లో స్టాకును పరిశీలించారు. ప్రాథమికంగా కొన్ని ఫోర్టిఫైడ్ కెర్నల్స్ ఉన్నట్లు గుర్తించారు. సత్య బాలాజీ, ఎస్ ఆర్ ట్రేడింగ్ వారు ఎగుమతి చేస్తున్నారని తేలింది. తదుపరి స్వార్టెక్స్ ప్లాంట్ ఎన్ డి ఆర్ గోడౌన్, చిత్ర ఆగ్రో ఎగ్జిట్స్, కొవ్వూరి ఆనంద్ రెడ్డి సార్టెక్స్ ప్లాంట్‌ను తనిఖీ చేశారు. తనిఖీ సమయంలో 10 లారీలు బియ్యంతో కలిగి ఉన్నాయని గుర్తించారు. టెక్నికల్ అసిస్టెంట్ ద్వారా శాంపిల్స్ తీసుకుని కెమికల్ అనాలసిస్ చేయగా, సదరు బియ్యంలో బాయిల్డ్ రైస్‌లో ఫోర్టిఫైడ్ కెర్నల్స్ ఉన్నాయని తేలింది. వెంటనే మిల్ ఆవరణలో తనిఖీ చేశారు. సార్టెక్స్ మిల్‌లోని బాయిల్డ్ రైస్‌లో కూడా ఫోర్టిఫైడ్ కెర్నల్స్ ఉన్నాయని గుర్తించారు. సదరు ప్రొప్రైటర్ శ్రీ కొవ్వూరి ఆనంద్ రెడ్డి మేనేజర్ శ్రీనివాసరావును విచారించగా, బాయిల్డ్ రైస్ బియ్యాన్ని ఒడిశా, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. ప్రజా పంపిణీకి సంబంధించిన ఫోర్టిఫైడ్ కెర్నల్స్ కలిగిన బాయిల్డ్ బియ్యాన్ని ఇతర రాష్ట్రాల్లో తక్కువ ధరకు బల్క్‌లో కొని, అక్రమంగా ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నారని తేలింది ప్రాథమికంగా ఇతర రాష్ట్రాల్లో కార్డు దారులకు సరఫరా చేసే బాయిల్డ్ పిడిఎస్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి, అక్రమంగా పోర్టు ద్వారా ఎగుమతి చేస్తున్నారని గుర్తించారు. 10 లారీలలో 260 టన్నులు, ప్లాంట్‌లో 650 టన్నులు మొత్తం 910 టన్నుల బాయిల్డ్ బియ్యం విలువ రూ.2.54 కోట్లు, 10 లారీల విలువ సుమారు రూ.1 కోటి, మొత్తం రూ.3.54 కోట్లకు సీజ్ చేశారని జిల్లా పౌర సరఫరా అధికారి రుద్రరాజు సత్యనారాయణ రాజు తెలిపారు. అనాలసిస్ రిపోర్టుల కోసం జిల్లా మేనేజర్ కి శాంపిల్స్ పంపారు. రేషన్ కార్డు దారులకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేసే బియ్యంలో ఫోర్టిఫైడ్ కెర్నల్స్ ఉంటాయి. ఇవి బహిరంగ మార్కెట్‌లో ఉండవు. కేంద్ర ప్రభుత్వం కొన్ని రాష్ట్రాల్లో బాయిల్డ్ రైస్‌లో కూడా ఫోర్టిఫైడ్ కెర్నల్స్ జోడించి బలవర్ధకమైన ఆహారం ప్రజలకు సరఫరా చేస్తోంది. కొంతమంది తక్కువ ధరకు కొని ఇతర దేశాలకు ఎగుమతి చేయడం నేరమని తెలిపారు. సదరు వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

# సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన కలెక్టర్ హిమాన్షుశుక్లా

### - జిల్లాలో ప్రతి వారం 'పల్లె వీక్షణం'



**ఆత్మకూరు (నెల్లూరు), ఏప్రిల్ 15, ప్రభాతవార్త :** ఆత్మకూరు మండలం నబ్బీనగరం, బోయిల చిరువెళ్ళ గ్రామాల్లో బుధవారం జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా జిల్లా యంత్రాంగంతో కలసి "పల్లె వీక్షణం" కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. నబ్బీనగరం, బి.చిరువెళ్ళ గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బి.చిరువెళ్ళలో రైతు సేవా కేంద్రం, విలేజ్ హెల్త్‌క్లినిక్, అంగన్‌వాడీ కేంద్రం, హౌసింగ్ కాలనీ, మినీ గోకులం లను సందర్శించారు. నబ్బీనగరంలో ఉపాధిహామీ పనుల వద్దకు నేరుగా వెళ్ళి కూలీలతో మాట్లాడారు. బోయిలచిరువెళ్ళ గ్రామంలోని వీధుల్లో నడుచుకుంటూ ప్రజల నుంచి సమస్యలను తెలుసుకొని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలోని ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి , స్థానిక అధికారుల పనితీరుపై స్వయంగా ఆరా తీశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వారం ఒక గ్రామంలో అధికార యంత్రాంగంతో కలసి సమగ్రంగా పర్యటించి నేరుగా ప్రజలతో మమేకమయ్యే కార్యక్రమే పల్లె వీక్షణమని కలెక్టర్ పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకాన్ని సమీక్షిస్తామని, ఏవైనా సమస్యలుంటే ప్రజలనడిగి తెలుసుకుంటామన్నారు. ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అమలవుతున్నాయా, గ్రామస్థాయిలో అధికారుల పనితీరు ఎలా ఉంది లోటుపాట్లను లోతుగా తెలుసుకుంటామన్నారు. గ్రామంలో ప్రతి సమస్యకు పరిష్కారం చూపడమే లక్ష్యంగా పల్లె వీక్షణ కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. రైతు సేవా కేంద్రంలో కలెక్టర్ మాట్లాడుతూ మొదటి పంట ధాన్యాన్ని మద్దతు ధరకంటే ఎక్కువగా విక్రయించడం సంతోషకరమన్నారు. రెండవ పంటకు కూడా పుష్కలంగా సాగునీరు అందిస్తామని భరోసా ఇచ్చారు. త్వరలోనే సాగునీటి సలహా మండలి సమావేశం నిర్వహించి జిల్లాలో రెండోపంటకు సాగునీటి విడుదలపై నిర్ణయం తీసుకుంటామన్నారు.

తొలుత బొయిల చిరువెళ్ళ గ్రామంలో రైతు సేవా కేంద్రంలో చాంపియన్ ఫార్మర్ ఈగ సుబ్బారెడ్డికి పశువుల దాణాను, పలువురు రైతులకు నవధాన్యాలను కలెక్టర్ పంపిణీ చేశారు. వేసవిలో పశువుల దాహం తీర్చేందుకు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన నీటి తొట్టెలను ఆయన పరిశీలించారు. జలజీవన్ మిషన్ ద్వారా నిర్మిస్తున్న ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణాన్ని పరిశీలించారు. అనంతరం బోయిలచిరువెళ్ళ ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ చిన్నారులతో ముచ్చటించారు. వారి అభ్యసన సామర్థ్యాలను నేరుగా పరిశీలించారు. పిల్లలకి అందిస్తున్న ఆహారం, పిల్లల హాజరు,నమోదు, బరువు, ఎత్తు తదితర విషయాలను తెలుసుకున్నారు. చిన్నారులను కంటికి రెప్పలా కాపాడుకంఉటూ విద్యాబుద్ధులు నేర్పించాలని అంగన్‌వాడీ నిర్వాహకులకు సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లాపరిషత్ సిఇఒ శ్రీధర్‌రెడ్డి, డిపిఒ డి.వసుమతి, జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, డిఎంఅండ్‌హెచ్ డాక్టర్ సుజాత, ఐసిడిఎస్ పిడి బి.హేనాసుజన్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ విజయభాస్కర్, పశుసంవర్ధక శాఖ జెడి రమేష్‌నాయక్, ఆత్మకూరుఆర్‌డిఒ బి.పావని, ఆత్మకూరు మండలాధ్యక్షులు కేతా వేణుగోపాల్‌రెడ్డి, తహసిల్దార్ పి.పద్మజాకుమారి, ఎంపిడిఒ పి.రఫీఖాన్, మండల వ్యవసాయాధికారికె.కిషోర్‌బాబు, ఉపాదిహామీ పథకం ఎపిఒ మధు, ఐసిడిఎస్ సిడిపిఓ పి.సునీలత, సూపర్‌వైజర్ జి.కస్తూరి, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ కొండయ్య, మాజీ సర్పంచ్‌లు కరేటి హజరత్‌రెడ్డి, రావూరు రత్నాకర్‌రెడ్డి, బొలిగర్ల వెంకటేశ్వర్లు, చెవుల వెంకటేశ్వర్లు, టిడిపి నాయకుడు షేక్ హుసేన్ వివిధ శాఖల అధికారులు, విఆర్‌ఒలు, సచివాలయ సిబ్బంది, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాల్లో గత 12 యేళ్లలో ఈ ఏడాదే అత్యధిక ఉత్తీర్ణతా శాతం

## మే 21 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ

**ఏప్రిల్ 15, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో :** ఏపీలో ఇంటర్ ఫలితాలను 15వ తేదీ బుధవారం విద్య శాఖామంత్రి నారా లోకేష్ విడుదల చేశారు. విద్యాశాఖా మంత్రిగా లోకేష్ పదవి చేపట్టాక విద్యా వ్యవస్థలో తీసుకువచ్చిన సంస్కరణలు, సమూలమైన మార్పుల ఫలితంగా గత 12 ఏళ్లలో ఎన్నడూ రాని ఉత్తీర్ణత శాతం ఈ సంవత్సరం నమోదయిందని గణాంకాలు చెబుతున్నాయి. ఈ సందర్భంగా విద్యా శాఖా మంత్రిగా లోకేష్ తన కృషితో పాసయ్యారని పలువురు అధికారులు, లోకేష్ అభిమానులు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాలు 77 సాధించగా ద్వితీయ సంవత్సరం ఇంటర్లో 81 తో గత రికార్డులను అధిగమించారు. 2020లో మొదటి సంవత్సరం 59 ఇప్పుడు 77 శాతానికి వృద్ధి చెందింది. ప్రభుత్వ జూనియర్ కాలేజీలలో ప్రథమ సంవత్సరం 54 ద్వితీయ సంవత్సరం 68 తో గత 12 ఏళ్లలో ఉన్న రికార్డును ప్రస్తుత ఫలితాలు తిరగరాసాయి. రాష్ట్రస్థాయిలో కృష్ణాజిల్లా 9 తో మొదటి స్థానంలో ఉండగా 88వ శాతంతో గుంటూరు రెండవ స్థానంలో ఉంది. విశాఖపట్నం ఎన్టీఆర్ జిల్లాలు ఆ తర్వాత స్థానాలు దక్కించుకున్నాయి. అయితే అన్నమయ్య జిల్లా వంటి కొన్ని జిల్లాలో తక్కువ ఉత్తీర్ణతతో చివరి స్థానాల్లో ఉన్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం పెరగటం గమనార్హం, దీనికి లోకేష్ తీసుకువచ్చిన సంస్కరణలు ప్రధాన కారణమని విద్యా వర్గాలు చెబుతున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ప్రథమ సంవత్సరం 69 నుంచి 76 వరకూ ఉత్తీర్ణత సాధించగా ద్వితీయ సంవత్సరంలో 77 నుంచి 80 వరకు ఉత్తీర్ణత సాధించారు. అయితే రాష్ట్ర సగటు ఉత్తీర్ణత శాతంతో పోలిస్తే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఉత్తీర్ణత శాతం సగటు తగ్గిందని తెలుస్తుంది. ఇదిలా ఉండగా ఏలూరు జిల్లా నుంచి సైన్స్ స్ట్రీమ్ లో రాష్ట్రస్థాయి టాప్ లిస్టులో విద్యార్థులు చోటు దక్కించుకోవడం కొంత ఊరటనిచ్చిందని అధికారులు చెబుతున్నారు. అంతేకాకవా ఏలూరు జిల్లా నూజివీడు కు చెందిన పంబ లాలిత్య బి పి సి స్ట్రీమ్ లో 989 మార్కులతో రాష్ట్రస్థాయి మూడవ స్థానంలోనూ, సీఈసీ స్ట్రీమ్ లో 976 మార్కులతో శీతల జాహ్నవి రాష్ట్ర టాపర్స్ లిస్టులో చోటు దక్కించుకున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ద్వితీయ సంవత్సరంలో రాష్ట్ర సగటుకు దగ్గరగా ఉండటం ఎదురు జిల్లా విద్యార్థులకు రాష్ట్రస్థాయి ర్యాంకులు రావడం ఊరటనిచ్చాయని చెప్పవచ్చు. గ్రామీణ మండలాల్లో సందేహాలు నివృత్తి చేసే అంశాలు, ప్రత్యేక ట్యూషన్, ల్యాబ్ సదుపాయాలు మెరుగుపరిచినట్లయితే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మిగతా జిల్లాలతో పోటీ పడుతుందని అధ్యాపకులు అభిప్రాయపడుతున్నారు.

# మరో ఆర్నెల్లలో అందుబాటులోకి నేలటూరు ఫిషింగ్ జెట్టీ

### - డిపిఆర్ ప్రకారం ప్రతి పని పూర్తి చేస్తాం

### - మంత్రి బిసి జనార్దన్ రెడ్డి

**ముత్తుకూరు (నెల్లూరు), ఏప్రిల్ 15, ప్రభాతవార్త :** నేలటూరు ఫిషింగ్ జెట్టీని మరో ఆర్నెళ్లలో అందుబాటులోకి తీసుకుని వస్తామని రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ నేలటూరు ఫిషింగ్ జెట్టీ నిర్మాణ పనులు పూర్తి చేసి మళ్ళీ ప్రారంభోత్సవానికి వస్తామన్న మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి స్పష్టం చేశారు. సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో నేలటూరు జెట్టీని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, ఏపీ ఇన్ లాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ డాక్టర్ జెడ్.శివప్రసాద్, ఏపీ కనీస వేతన సలహా మండలి చైర్మన్ పెళ్లకూరు శ్రీనివాసులు రెడ్డి, పోర్టు ప్రతినిధులు బుధవారం సందర్శించారు. 17 కోట్ల రూపాయలతో అదానీ కృష్ణపట్నం పోర్టు ఆధ్వర్యంలో పనులు చేసిన విషయంతో పాటు పెండింగ్ పనులు అత్యంత త్వరగా పూర్తి చేయడం జరుగుతుందన్నారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మత్స్యకారులు రెండో జెట్టీని కోరుతున్న అంశాన్ని మంత్రి, మారిటైం బోర్డు చైర్మన్ దృష్టికి తీసుకెళ్ళారు. నేలటూరు ఫిషింగ్ జెట్టీని పూర్తి చేయాలని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారన్నారు. మత్స్యకారులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని ఆయన చాలా పట్టుదలతో ప్రయత్నిస్తున్నారని తెలిపారు. డీపీఆర్ ప్రకారం ప్రతి పని పూర్తి చేస్తామని, ఆర్నెళ్లలో మత్స్యకారులకు జెట్టీని అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. మత్స్యకారుల వినతి మేరకు రెండో జెట్టీ నిర్మాణంపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి అధికారులకు సూచించారు. రెండో జెట్టీ నిర్మాణంపై సాధ్యాసాధ్యాలపై నివేదిక ఇవ్వాలని కూడా ఆదేశించామన్నారు. మత్స్యకారుల సూచనలన్నీ పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు శీపారెడ్డి వంశీధర్ రెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బొబ్బేపల్లి సురేష్ నాయుడు, మండల టిడిపి అధ్యక్షులు నీలం మల్లికార్జున యాదవ్, టిడిపి సీనియర్ నాయకులు ఈదూరు రామ్మోహన్ రెడ్డి, మండల తెలుగు యువత అధ్యక్షులు రాగాల శివకృష్ణ, కృష్ణపట్నం దేవస్థానాల చైర్మన్ మామిడాల శ్రీనివాసులు, మత్స్యకార నాయకులు, కూటమి పార్టీల నేతలు పాల్గొన్నారు.

# పేదల ఆకలి తీర్చడమే ధ్యేయం : ఎమ్మెల్యే కాకర్ల సురేష్

**వింజమూరు (నెల్లూరు), ఏప్రిల్ 15, ప్రభాతవార్త :** పేద ప్రజల ఆకలి తీర్చి, వారికి తక్కువ ధరకే నాణ్యమైన భోజనం అందించాలనే ఆశయంతో వింజమూరులో చిల్డ్రన్ పార్కు ఎదురు వ్యవసాయ కార్యాలయం తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్ ఘనంగా ప్రారంభమైంది. బుధవారం జరిగిన ఈ కార్యక్రమానికి ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్ ఉదయగిరి మాజీ శాసనసభ్యులు కంబ, జడ్పీ మాజీ చైర్మన్ పొన్నుబోయిన చంచల బాబు యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన నాయకులకు తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ గూడా నర్సారెడ్డి, మండల పరిషత్ అధ్యక్షురాలు వనిపెంట హైమావతి సొసైటీచైర్మన్ చల్లా వెంకటేశ్వర్లు యాదవ్ ఇతర నేతలు పూలమాలలు శాలువాలతో జిల్లా నాయకులను ఆహ్వానించారు. ఈ సందర్భంగా క్యాంటీన్‌ను ప్రారంభించాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అబ్దుల్ అజీజ్ కోరగా పార్టీసీనియర్లతో ప్రారంభిద్దామని అబ్దుల్ అజీజ్ ఎమ్మెల్యేకి సూచించగా వెంటనే ఎమ్మెల్యే స్థానిక తెలుగుదేశం పార్టీసీనియర్ నాయకులు సీఎం ఖాజావలి ప్రారంభించాలని చెప్పడంతో ఖాజావలి క్యాంటీన్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు పెద్దల పట్ల అపారమైన గౌరవం ఉందని అందుకే తనకు అవకాశం కల్పించారని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడే సీనియర్ నాయకులకు, మైనార్టీలకు తెలుగుదేశం పార్టీ ఇచ్చే ప్రాధాన్యతకు నిదర్శనం టీడీపీ సీనియర్ నాయకులు షేక్ సీఎం ఖాజావలి చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేయించి క్యాంటీన్‌ను ప్రారంభించడమే అన్నారు. ఒక సామాన్య కార్యకర్తకు, సీనియర్ నేతకు దక్కిన ఈ గౌరవం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. గతంలో నిలిపివేసిన అన్నా క్యాంటీన్లను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుమళ్ళీ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించారని తెలిపారు. వింజమూరులో రోజువారీ కూలీలు, పేదలు, బాటసారులకు ఐదు రూపాయలకే కడుపునిండా భోజనం లభిస్తుందని, ఇది నిరుపేదల పాలిట వరమని కొనియాడారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని వారు స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 269 అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేసి ప్రతి రోజు లక్షలాది మంది పేదల ఆకలి తీర్చడం జరుగుతుందన్నారు. అలాగే ఇప్పటి వరకు ప్రభుత్వం సబ్సిడీ రూపంలో వందల కోట్ల రూపాయలు ఖర్చు చేసి ప్రజల సంక్షేమానికి అంకితభావంతో పని చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గ్రామీణ ప్రాంతాలకు కూడా ఇలాంటి సేవలను విస్తరించడం ద్వారా ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వివరించారు. హరే కృష్ణ అక్షయ పాత్ర ఫౌండేషన్ సంస్థ అన్నా క్యాంటీన్లకు అల్పాహారం, భోజనం సరఫరా చేస్తూ సమాజానికి అమూల్యమైన సేవలను అందిస్తుందని ప్రశంసించారు. వారి సహకారం వలెనే ఈ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ముస్లిం మైనార్టీ సోదరులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. అనంతరం అతిథులు స్వయంగా వడ్డించి, ప్రజలతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత డీఎం అండ్ హెచ్ఓ మాశిలామణి, తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు గురజాల గోపి, టెలికాం బోర్డు డైరెక్టర్ తాడికొండ అనూష, కలిగిరి మండల పార్టీ కన్వీనర్ పూసల వెంగప్ప నాయుడు, ప్రధాన కార్యదర్శి కొప్పోలు కొండలరావు, కొండాపురం కన్వీనర్ మామిళ్ళపల్లి ఓంకార్, పోలినేని చంద్రబాబునాయుడు, మాజీ జడ్పీటీసీ సభ్యులు దామా మహేష్, కొండాపురం తెలుగుదేశం పార్టీ మహిళా అధ్యక్షురాలు చిమ్మిలి శ్రీదేవి, ఎస్టీ సెల్ నాయకురాలు నూతలపాటి జయలక్ష్మీ, వనిపెంట వెంకట సుబ్బారెడ్డి, చల్లా శ్రీనివాసులు, బయన్న, కోడూరు నాగిరెడ్డి, దుద్దిగుంట శ్రీనివాసులురెడ్డి, పాములపాటి సుబ్బరాయుడు, మంచాల శ్రీనివాస నాయుడు, సొసైటీ డైరక్టర్ కోడూరు నాగిరెడ్డి, వరికుంటపాడు మాజీ ఏఎంసీ నాయకులు చంద్ర మధుసూదన్, గురవారెడ్డి, ఇతర మండలాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నీటి భద్రత కోసం జలధార కార్యాచరణ ప్రణాళిక

**- పర్యాటక కేంద్రంగా పోలవరం ప్రాజెక్టు.. - నేరడి బ్యారేజ్, చింతలపూడి మెయిన్ కెనాల్‌కు త్వరలో టెండర్లు.. - జూన్ చివరి కల్లా వెలిగొండ స్టేజ్ 1 పనులు పూర్తి కావాలి..-జల వనరుల శాఖ పై సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు..**



జల వనరుల శాఖ పై సమీక్ష నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, సమావేశంలో మంత్రి డాక్టర్ నిమ్మల, అధికారులు

**విజయవాడ,ఏప్రిల్ 15,ప్రభాత వార్తప్రతినిధి:** నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తి చేసి జాతికి అంకిత మిస్తామని ఏపీ సీఎం చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఆ క్రమంలోనే పోలవరం ప్రాజెక్టు పూర్తి కాగానే గోదావరి జలాలను కుడి, ఎడమ కాలువల ద్వారా తరలించి వాటిని ఏయే అవసరాలకు, ఎంత మేర వినియోగించుకోవాలనే దానిపై ఓ నిర్దుష్టమైన యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. కుడి, ఎడమ ప్రధాన కాలువలకు అనుసంధానంగా ఉన్న రిజర్వాయర్లు, చెరువులు నింపేలా ప్రణాళిక చేయాలని సీఎం సూచించారు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై క్యాంపు కార్యాలయంలో జల వనరుల శాఖ అధికారులతో బుధవారం ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. పోలవరం ప్రాజెక్టు పనులతో పాటు...వెలిగొండ, హంద్రీనీవా సుజల స్రవంతి, పోలవరం నల్లమల సాగర్ లింక్, చింతలపూడి ఎత్తిపోతల పథకం, వరికెపూడిశిల, ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో భూగర్భజలాల పెంపు, జల ధార, జల హారతి కార్యక్రమాలపైనా సమీక్షి ంచారు. ఉత్తరాంధ్ర ప్రాజెక్టులైన తారక రామ, మహేంద్ర తనయ, తోటపల్లి బ్యారేజ్, మద్దువలస, జంఝావతి, హీరమండలం లిఫ్ట్ పనుల్లో వేగం పెంచాలని సీఎం సూచించారు. డిసెంబర్ నాటికి వంశధారనాగావళి అనుసంధానం, జూలై నాటికి నాగావళిచంపావతి అనుసంధానం పూర్తి చేయాలన్నారు. శ్రీకాకుళం జిల్లా వంశధార నదిపై నిర్మించ తలపెట్టిన ప్రతిష్టాత్మక ప్రాజెక్టు నేరడి బ్యారేజ్‌కు అడ్డంకులు తొలగడంతో త్వరితగతిన టెండర్లు పిలవాలని స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టును ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని... హోటల్స్, షాపింగ్ ఏరియా ఉండాలని సీఎం అన్నారు. ప్రాజెక్టు సమీప ప్రాంతాల సుందరీకరణకు సంబంధించిన డిజైన్లను సీఎం పరిశీలించారు. పోలవరంపాపికొండలుభద్రాచలం వరకు బోటింగ్ సౌకర్యం కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. వాటర్, రాక్, ఫారెస్ట్, స్పోర్ట్స్ థీమ్‌తో పర్యాటకుల్ని ఆకట్టుకోవాలని సూచించారు. గోదావరి పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి ప్రారంభించేలా పనుల్లో వేగం పెంచాలని అధికారులను సీఎం ఆదేశించారు.

# తిరుపతిని స్పోర్ట్స్ హబ్ గా తీర్చిదిద్దాం

**-రూ.10.10 కోట్ల నిధులతో ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవంలో మంత్రి లోకేశ్**

**తిరుపతి క్రీడ,ఏప్రిల్ 15ప్రభాతవార్త:** రాయలసీమలోనే తిరుపతిని స్పోర్ట్స్ హబ్ గా తీర్చిదిద్దుతామనే యువగళం హామీ కార్యరూపం దాల్చిందని ,10.10కోట్ల రూపాయలతో అధునాతనంగా నిర్మించిన ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవంలో రాష్ట్రమంత్రి నారాలోకేశ్ వెల్లడించారు. తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ఏడాదిలో 35 కోట్లకు పైగా నిధులు కేటాయించడం జరిగిందన్నారు..తిరుపతి నగరంలో గొల్లవానిగుంటలో నూతనంగా నిర్మించిన ఎన్టీఆర్ క్రికెట్ పెవిలియన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, అకాడమీలను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. శాప్, తుడా సహకారంతో 10.10 కోట్ల రూపాయలు నిధులు వెచ్చించి ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను నిర్మించామన్నారు. ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ తో పాటు క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, ఆర్చరీ అకాడమీలను మంత్రి లోకేష్ ప్రారంభించారు. క్రీడా ప్రాంగణం మొత్తం కలియతిరిగారు. ఈ సందర్భంగా క్రికెట్, కబడ్డీ, కోకో, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, ఆర్చరీ క్రీడాకారులతో గ్రూప్ ఫోటో దిగారు. కొద్దిసేపు వాలీబాల్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. అనంతరం ఎన్టీఆర్ క్రికెట్ స్టేడియంతో పాటు ఎన్టీఆర్ క్రికెట్ పెవిలియన్ ను ప్రారంభించారు. భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాల్ రాజ్, ఇతర క్రీడాకారులతో కలిసి కొద్దిసేపు క్రికెడ్ ఆడారు. ఈ సందర్భంగా స్కూల్ విద్యార్థులతో సంభాషించి వారిని ఉత్సాహపరిచారు. క్రీడా ప్రాంగణంలో ప్రణీత్ ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటుచేసిన వాటర్ ప్లాంట్ ను మంత్రి ప్రారంభించారు. ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను క్రికెట్ మైదానం, ఖోఖో, కబడ్డీ, ఖఖో, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, ఆర్చరీ కోర్టులతో పాటు పలు క్రీడా సౌకర్యాలతో అభివృద్ధి చేశారు. ఈ సముదాయం క్రీడా సంస్కృతిని ప్రోత్సహించడంతో పాటు ఈ ప్రాంత భవిష్యత్ క్రీడాకారులను తీర్చిదిద్దడంలో కీలకపాత్ర పోషించనుందని మంత్రి తెలిపారు. అంతకుముందు క్రీడా ప్రాంగణానికి చేరుకున్న మంత్రి నారా లోకేష్ కు శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు ఘనస్వాగతం పలికారు. అంతకుముందు ఇదే ప్రాంగణంలో తిరుపతిలోని శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో 5.35 కోట్ల వ్యయంతో కరణం మల్లీశ్వరి వెయిట్ లిఫ్టింగ్ అకాడమీ, 200 మంది క్రీడాకారులకు వసతి సదుపాయం నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు.

# ఉదయనిధి స్టాలిన్ ఆస్తులపై ఐటి విచారణ

**చెన్నై, ఏప్రిల్ 15:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల వేళ డిఎంకె కీలక నేత, మంత్రి ఉదయనిధి స్టాలిన్‌కు మద్రాస్ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఆయన సమర్పించిన ఎన్నికల అఫిడవిట్‌లోని ఆస్తుల వివరాల్లో తీవ్రమైన వ్యత్యాసాలు ఉన్నాయన్న ఆరోపణలపై ప్రాథమిక విచారణ జరపాలని ఆదాయపు పన్ను (ఐటి) శాఖను ఉన్నత న్యాయ స్థానం ఆదేశించింది. ఈ నెల 23న పోలింగ్ జరగనున్నందున, ఓట ర్లకు అభ్యర్థుల ఆర్థిక విషయాలపై కచ్చితమైన సమాచారం తెలుసుకునే హక్కు ఉందని స్పష్టం చేసింది. ఈ మేరకు ఏప్రిల్ 20వ తేదీలోగా నివేదిక సమర్పించాలని ఐటీ శాఖ డైరెక్టర్ జనరల్‌కు గడువు విధించింది.

ఉదయనిధి స్టాలిన్ పోటీ చేస్తున్న చేపాక్‌తిరువల్లికేణి నియోజకవర్గానికి చెందిన ఆర్. కుమార్వేల్ అనే వ్యక్తి ఈ పిల్ దాఖలు చేశారు. వాదనలతో ఏకీభవించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుశ్రుత్ అరవింద్ ధర్మాధికారి, జస్టిస్ జి. అరుణ్ మురుగన్‌లతో కూడిన ధర్మాసనం, ఐటీ శాఖ నివేదిక కోసం కేసు విచారణను ఏప్రిల్ 20కి వాయిదా వేసింది.

# రైతు ఆత్మహత్యల్లో 80 శాతం కౌలురైతులవే

## రైతు స్వరాజ్య వేదిక సర్వే

**హైదరాబాద్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:** తెలంగాణలో జరుగుతున్న రైతు ఆత్మహత్యల్లో అధికం కౌలు రైతులేనని రైతు స్వరాజ్యవేదిక సర్వేలో తేలింది. రాష్ట్రవ్యాప్తంగా రైతుల ఆత్మహత్యల్లో 80 శాతం కౌలు రైతులే నని తేల్చింది. తెలంగాణలో 22 లక్షలకు పైగా (మొత్తం రైతుల్లో 36శాతం) కౌలు రైతులు ఉన్నారు. వీరంతా భూములను కౌలుకు తీసు కొని సాగు చేస్తున్నారు. అయితే రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా, రైతు భీమా, పంట రుణాలు, రుణమాఫీ తదితర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు ఏవి వీరి దరి చేరడం లేదు. కనీసం సాగుచేసిన పంట ప్రకృతి వైపరిత్యాల కారణంగా నష్టపోయి నప్పుడు నష్టపరిహారం కూడా అందడం లేదు. చివరకు పండించిన పంటను కొనుగోలు కేంద్రాల్లో కనీస మద్దతు ధరకు అమ్ముకునేందుకు కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోందని రైతు స్వరాజ్య వేదిక చెబుతోంది. కౌలు రైతులను గుర్తించకపోవడంతో ప్రభుత్వం అందిం చిన బోనస్ డబ్బులు కౌలు రైతులకు దక్కడం లేదని రైతు సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈ నేపథ్యంలో భూమిలేని కౌలు రైతులను సర్వే చేసి గ్రామసభల్లో గుర్తించి, వారిని ఆదుకునేందుకు ప్రభుత్వాలు చట్టాలు తీసుకురావాలని రైతు స్వరాజ్యవేదికతోపాటు పలు రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# పార్కింగ్ కారులో చిక్కుకుని బాలిక మృతి

## నార్కెట్‌పల్లిలో విషాదం

**నార్కెట్‌పల్లి, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:** నార్కెట్‌పల్లి మండల కేంద్రంలో అత్యంత విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఆడుకుంటూ వెళ్లిన ఐదేళ్ల చిన్నారి అనుకోకుండా పార్కింగ్ చేసిన కారులో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయింది. ఘటన సంబంధించిన వివరాల ప్రకారం, చరణ్య అనే ఐదేళ్ల బాలిక ఇంటి వద్ద ఆడుకుంటూ ఉండగా సమీపంలో పార్క్ చేసిన కారులోకి ఎక్కింది. అయితే లోపలికి వెళ్లిన తర్వాత కారు డోర్లు లాక్ కావడంతో బయటకు రావడానికి వీలు లేకపోయింది. ఎండ తీవ్రత కారణంగా కారు లోపల ఉష్ణోగ్రత పెరగడం, గాలి అందకపోవడంతో చిన్నారి స్పృహ కోల్పోయినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, చరణ్య ఎక్కువసేపటికీ ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు చుట్టుపక్కల వెతకడం ప్రారంభించారు. అనంతరం అనుమానం వచ్చి పార్క్ చేసిన కారులో చూడగా, చిన్నారి అపస్మారక స్థితిలో కనిపించింది. వెంటనే ఆసుపత్రికి తరలించినప్పటికీ, అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. చిన్నారి మృతి స్థానికులను కలచివేసింది. సెలవు లేకున్నా నా కూతురు బ్రతికేది చిన్నారి కన్నతండ్రి మంగళవారం రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి పురస్కరించుకొని పాఠశాలలకు సెలవు ఇవ్వడం వల్ల పిల్లలు ఇంటి వద్దనే ఆడుకుంటున్నారు కాగా నేడు సెలవు రాకపోయినా నా కూతురు బ్రతికి ఉండేదేమో అని ఆ కన్నతండ్రి చేస్తున్న ఆర్తనాదాలు అందరి హృదయాలను కలచివేశాయి. బడిలో ఉన్నా బ్రతికేదేమో అంటూ విలపిస్తూ తన కూతురు మృతదేహం వద్ద తల్లిదండ్రుల రోదనలు ప్రతి ఒక్కరి హృదయంలో బాధ కలిగించాయి.

15-04pg10 12 ONG_15-04pg10.qxd 15/Apr/26 10:51 PM Page 1





బార్సిలోనా ఓపెన్‌లో

# విర్టానెన్‌పై అల్కరాజ్ విక్టరీ

**న్యూఢిల్లీ:** బార్సిలోనా ఓపెన్-2026లో విర్టానెన్‌పై కార్లోస్ అల్కరాజ్ విజయం సాధించాడు. ప్రపంచ నంబర్ టూ కార్లోస్ అల్కరాజ్ ఫిన్నిష్ క్వాలిఫయర్ ఒట్టో విర్టానెన్‌పై 6-4, 6-2 తేడాతో సునాయాస విజయం సాధించి, తన మూడవ బార్సిలోనా ఓపెన్ టైటిల్ వేటను ప్రారంభించాడు. ప్రపంచ 130వ ర్యాంకర్ విర్టానెన్ బలంగా ప్రారంభించి అల్కరాజ్ సర్వ్‌ను గట్టిగా ఎదుర్కొంటూనే, తన స్థానాన్ని సాపేక్షంగా సునాయాసంగా నిలబెట్టుకున్నాడు. అయితే, మొదటి సెట్‌లోని 10వ మరియు చివరి గేమ్‌లో అల్కరాజ్ ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసి ఆధిక్యం సాధించాడు. రెండవ సెట్‌లో, ఆటగాళ్లు ఒకరి తర్వాత ఒకరు బ్రేక్‌లు సాధించగా, చివరకు అల్కరాజ్ లవ్‌తో బ్రేక్ చేసి 4-1 ఆధిక్యాన్ని పటిష్టం చేసుకున్నాడు. విర్టానెన్ సర్వ్‌పై అల్కరాజ్ ట్రిపుల్ మ్యాచ్ పాయింట్‌ను సంపాదించి, వాటిలో మొదటిదాన్ని సద్వినియోగం చేసుకుంటూ క్రాస్‌కోర్ట్ విన్నర్‌ను కొట్టాడు. అంతకుముందు, రెండో సీడ్ లొరెంజో ముసెట్టి, మార్టిన్ లండలూస్‌ను 7-5, 6-2 తేడాతో ఓడించి, ఆస్ట్రేలియన్ ఓపెన్ తర్వాత తన తొలి విజయాన్ని నమోదు చేశాడు. ఆస్ట్రేలియాకు చెందిన అలెక్స్ డి మినార్, సెబాస్టియన్ ఓఫ్నర్‌ను 7-6 (9/7), 6-4 తేడాతో ఓడించగా, కరెన్ ఖచనోవ్ కామిలో ఉగో కారబెల్లి చేతిలో 6-3, 6-4 తేడాతో అనూహ్యంగా ఓటమి చవిచూశాడు. కాగా ఏడుసార్లు గ్రాండ్ స్లామ్ విజేత రెండో రౌండ్‌లో చెక్ దేశస్థుడైన టోమాస్ మచాక్‌తో అల్కరాజ్ తలపడనున్నాడు.



# దీప్తికి విజ్డెన్ క్రికెటర్ అవార్డు

## తొమ్మిది విభాగాల్లో 7 టీమిండియాకే..

**న్యూఢిల్లీ:** విజ్డెన్ అల్మానాక్ 2026 అవార్డుల్లో భారత క్రికెటర్లు పూర్తి ఆధిపత్యం ప్రదర్శించారు. తొమ్మిది విభాగాల్లో ఏడింటిని కైవసం చేసుకున్నారు. స్వదేశం వేదికగా ముగిసిన వన్డే ప్రపంచకప్‌లో ఆల్‌రౌండర్ దీప్తి శర్మ అద్భుత ప్రదర్శన కనబరుస్తూ 22 వికెట్లు పడగొట్టడంతో పాటు, 215 రన్స్ చేసింది. ఈ విధంగా అటు బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లో రాణించిన దీప్తి టీమ్‌ఇండియా వరల్డ్‌కప్ గెలువడంలో కీలకంగా వ్యవహరించింది. వీటిని పరిగణనలోకి తీసుకున్న విజ్డెన్ దీప్తిని వుమెన్స్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ అవార్డుకు ఎంపిక చేసింది. టీ20 క్రికెటర్ ఆఫ్ ద ఇయర్‌గా అభిషేక్‌శర్మ ఎంపిక కాగా, ఫైవ్ క్రికెటర్స్ ఆఫ్ ద ఇయర్ అవార్డు జాబితాలో టీమ్‌ఇండియా నుంచి గిల్, సిరాజ్, పంత్, జడేజా చోటు దక్కించుకున్నారు. గతేడాది ఇంగ్లండ్ టూర్లో అత్యుత్తమ ప్రదర్శన చేసిన హైదరాబాద్ స్టార్ పేసర్ మహ్మద్ సిరాజ్, శుభ్‌మన్ గిల్, రిషబ్ పంత్, రవీంద్ర జడేజా విజ్డెన్ ఫైవ్ క్రికెటర్స్ ఆఫ్ ద ఇయర్ అవార్డులను సొంతం చేసుకున్నారు.

ఇంగ్లండ్ బ్యాటర్ హసీబ్ హమీద్ ఈ జాబితాలో చోటు దక్కించుకున్న ఏకైక విదేశీ ప్లేయర్‌గా ఉన్నాడు. మెన్స్ విభాగంలో అభిషేక్ శర్మకు టీ20 క్రికెటర్ ఆఫ్ ద ఇయర్త్ అవార్డు లభించింది. గత సీజన్లో అభిషేక్ 21 మ్యాచ్లో 193 స్ట్రయిక్ రేట్తో 859 రన్స్ సాధించాడు. ఇందులో ఓ సెంచరీ, ఐదు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఆల్‌రౌండర్ దీప్తి శర్మ విమెన్స్ క్రికెటర్ ఆఫ్ దఇయర్త్‌గా ఎంపికైంది. ఇంగ్లండ్‌తో జరిగిన అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీలో సిరాజ్ 23 వికెట్లతో ఇంగ్లిష్ జట్టును వణికిస్తే, గిల్ 754 రన్స్ చేశాడు. రిషబ్ పంత్ కాలివేలి గాయంతోనూ పోరాడి కీలకపరుగులు సాధించిజట్టుకు అండగానిలిచాడు. పంత్, జడేజాల పోరాటంతో టీమిండియా ఆ సిరీస్ను 2-2తో డ్రా చేసుకోగలిగింది. మిచెల్ స్టార్క్‌కు మెన్స్ క్రికెటర్ ఇన్ ద వరల్డ్ పురస్కారం లభించింది.



## మహిళల ప్రపంచ కప్ క్వాలిఫైయర్..

# స్పెయిన్ పై ఇంగ్లండ్ విజయం

**న్యూఢిల్లీ:** మహిళల ప్రపంచ కప్ క్వాలిఫైయర్‌లో స్పెయిన్‌ను 1-0 తేడాతో ఓడించిన ఇంగ్లండ్ మరోసారి విజయం సాధించింది. లండన్‌లోని వెంబ్లీ స్టేడియంలో స్పెయిన్‌తో జరిగిన మహిళల ప్రపంచ కప్ క్వాలిఫైయర్‌లో లారెన్ హెంప్ మూడవ నిమిషంలో కొట్టిన గోల్ ఆట ఫలితాన్ని తేల్చి చెప్పింది. దీంతో యూరోపియన్ ఛాంపియన్ ఇంగ్లాండ్ 100 శాతం రికార్డుతో గ్రూప్ ఎ3లో అగ్రస్థానంలో నిలిచింది. ఇది గత ఏడాది జరిగిన యూరోస్ ఫైనల్, 2023 ప్రపంచ కప్ ఫైనల్‌కు పునరావృతం కాగా, మహిళల క్రీడలోని ఈ దిగ్గజాల మధ్య జరిగిన తాజా ముఖాముఖి పోరు కావడం విశేషం. యూరోస్‌లో ఇంగ్లాండ్ విజయం సాధించి వరుసగా రెండు టైటిళ్లను గెలుచుకున్నప్పటికీ, 2023లో స్పెయిన్ ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచింది. ప్రపంచంలో 4వ ర్యాంకులో ఉన్న ఇంగ్లాండ్, ఆట ఆరంభంలోనే లభించిన కార్నర్ కిక్‌ను హెంప్ గోల్‌గా మలచడంతో, 1వ ర్యాంకులో ఉన్న స్పెయిన్‌పై విజయాన్ని ఖాయం చేసుకుంది. స్పెయిన్ క్రీడాకారిణి అలెక్సియా పుటెల్లాస్ ఆ బంతిని క్లియర్ చేశానని భావించినప్పటికీ, అది గోల్ లైన్ దాటకుండా ఆపలేకపోయింది. ఇక 2027 మహిళల ప్రపంచ కప్ బ్రెజిల్‌లో జరగనుంది.

## వన్డే వరల్డ్ కప్ నుండి..

# టీమిండియాలో 8 మంది ఔట్

### భవిష్యత్ సారథిగా శుభ్‌మన్ గిల్!.. బరిలో యువరక్తం, అనుభవం కలసిన కొత్త టీం



**న్యూఢిల్లీ:** దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా వేదికలుగా జరగనున్న 2027 వన్డే ప్రపంచకప్ కోసం భారత క్రికెట్ నియంత్రణ మండలి ఇప్పుడే ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. 2026 టీ20 ప్రపంచకప్‌లో న్యూజిలాండ్‌ను ఓడించి కప్పు గెలిచిన జోరులో ఉన్న భారత్, వన్డే ఫార్మాట్‌లో మాత్రం సమూల మార్పులకు శ్రీకారం చుట్టనుంది. వన్డే క్రికెట్ అనేది సహనం, సుదీర్ఘ ఇన్నింగ్స్‌లు ఆడే సామర్థ్యంపై ఆధారపడి ఉంటుంది. ఈ నేపథ్యంలో కేవలం మెరుపు దాడి చేసే ఆటగాళ్లను కాకుండా, ఇన్నింగ్స్‌ను నిర్మించే వారిపై క్రికెట్ బోర్డు మొగ్గు చూపుతోంది. టీ20 ప్రపంచకప్‌లో మెరిసిన సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్, అభిషేక్ శర్మ, శివమ్ దూబే, రింకూ సింగ్, వాషింగ్టన్ సుందర్ వంటి ఆటగాళ్లకు 2027 వన్డే వరల్డ్ కప్‌లో పాల్గొనే టీమిండియా జట్టులో చోటు దక్కకపోవచ్చు. వీరంతా ప్రధానంగా టీ20 స్పెషలిస్టులుగా ముద్రపడటం, వన్డే ఫార్మాట్‌కు అవసరమైన నిలకడ లేకపోవడం వీరి ఎంపికపై ప్రభావం చూపుతోంది. అయితే, రాబోయే దేశవాళీ, ద్వైపాక్షిక సిరీస్‌లలో వీరు అద్భుతంగా రాణిస్తే తప్ప పునరాగమనం కష్టమే అన్న చర్చ జరుగుతోంది. భవిష్యత్తు సారథిగా శుభ్‌మన్ గిల్‌ను సిద్ధం చేయాలని సెలక్టర్లు ఒక అంచనాకు వచ్చినట్లు సమాచారం. గిల్ ఇప్పటికే తన బ్యాటింగ్, నాయకత్వ లక్షణాలతో అందరినీ ఆకట్టుకున్నాడు. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ సిరీస్‌లలో ఆశించిన ఫలితాలు రాకపోయినప్పటికీ, సుదీర్ఘ కాలం పాటు జట్టును నడిపించే సామర్థ్యం గిల్‌కు ఉందని యాజమాన్యం నమ్ముతోంది. ఓపెనర్‌గా గిల్ ఇచ్చే ఆరంభాలు జట్టుకు అత్యంత కీలకం కానున్నాయి. ఇక వయసుపైబడుతున్నా, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల ఫామ్ జట్టుకు కొండంత అండగా ఉంటుందనే దిశగా ఆలోచన చేస్తున్నారు. వన్డేల్లో కోహ్లీ స్థిరత్వం, రోహిత్ దూకుడు 2027లోనూ భారత్‌కు అవసరమని భావిస్తున్నారు. వీరిద్దరూ ఫిట్‌నెస్ కాపాడుకుంటే జట్టులో ఉండటం ఖాయం. మరోవైపు కేఎల్ రాహుల్ వికెట్ కీపర్ బ్యాటర్‌గా, జస్ప్రీత్ బుమ్రా ప్రధాన బౌలర్‌గా జట్టుకు వెన్నెముకలా నిలవనున్నారు. ప్రపంచకప్ 2027 కోసం టీమిండియాలో శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, రిషబ్ పంత్, కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, రవీంద్ర జడేజా, జస్ప్రీత్ బుమ్రా, ప్రసిద్ధ్ కృష్ణ, కుల్దీప్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, యశస్వి జైస్వాల్ ఉండే అవకాశాలు ఉన్నాయి.



## జవోఖిర్‌కు ఫిడే కాండిడేట్స్

# టైటిల్

### వైశాలి డ్రా, దివ్య ఓటమి

**న్యూఢిల్లీ:** ఉజ్బెకిస్తాన్‌కు చెందిన జవోఖిర్ సిందరోవ్ ఒక రౌండ్ మిగిలి ఉండగానే 2026 ఫిడే కాండిడేట్స్ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. ఈ ఏడాది చివర్లో జరిగే ప్రపంచ ఛాంపియన్‌షిప్ టైటిల్ కోసం అర్హతను సంపాదించుకున్నాడు. టోర్నమెంట్‌లో ఆరంభంలోనే ఆధిక్యం సాధించిన సిందరోవ్, చివరికి ముందు రౌండ్‌లో తన సమీప ప్రత్యర్థి అనీష్ గిరితో నల్ల పావులతో డ్రా చేసుకుని, టైటిల్ విజయాన్ని ఖాయం చేసుకున్నాడు. 20 ఏళ్ల సిందరోవ్ ప్రస్తుతం 13 రౌండ్ల తర్వాత 9.5 పాయింట్లతో ఉన్నాడు. ఇందులో నాలుగు మ్యాచ్‌ల విజయ పరంపరతో సహా ఆరు విజయాలు ఉన్నాయి. క్యాండిడేట్స్ టోర్నమెంట్‌లో ఇప్పటివరకు నమోదైన అత్యుత్తమ ప్రదర్శనలలో ఒకటిగా నిలిచిన ఈ టోర్నమెంట్‌లో అతను ఇప్పటికీ అజేయంగా కొనసాగుతున్నాడు. కాగా భారత్ గ్రాండ్ మాస్టర్ వైశాలి రమేష్‌బాబు, చైనాకు చెందిన టాన్ జోంగ్యీతో జరిగిన సెమీఫైనల్ రౌండ్‌లో డ్రా చేసుకోవడంతో, 2026 మహిళా అభ్యర్థుల పోటీ మరింత ఉత్కంఠభరితంగా మారుతోంది. నల్ల పావులతో ఆడుతున్న వైశాలి, టాన్ డ్రాతో బయటపడటానికి అవకాశం ఇచ్చే ముందు బలహీనమైన స్థితిలో ఉంది. 13 రౌండ్ల తర్వాత ఆమెకు ఇప్పుడు 7.5 పాయింట్లు ఉన్నాయి. ఇంతలో, అగ్రగాములు వైశాలి. జు జినెర్‌ల కంటే అర పాయింట్ వెనుకబడి చివరి రౌండ్‌కు ముందు రౌండ్‌ను ప్రారంభించిన బిబిసారా అసాబాయేవా, తెల్ల పావులతో అన్నా ముజిచుక్‌ను ఓడించి, 13 రౌండ్ల తర్వాత 7.5 పాయింట్లకు ఎగబాకింది. మరోవైపు, నల్ల పావులతో ఆడిన కేటెరీనా లాగ్నో చేతిలో ఓడిపోవడంతో దివ్య దేశ్‌ముఖ్ పట్టికలో అట్టడుగున నిలిచింది. ఈ భారత యువ క్రీడాకారిణి ఇప్పటివరకు 5 పాయింట్లు సాధించింది.


వాణిజ్యం

# ఆగని లేఆఫ్‌లు

### 231 టెక్ కంపెనీలు.. 91 వేల మందికిపైగా తొలగింపు

### వణుకుతున్న ఉద్యోగులు.. ప్రతి ఐదుగురిలో ఒకరికి ఉద్వాసన

### స్నాప్‌ఇంక్‌లో 20%, డిస్నీలో 1000 మంది ఉద్యోగులపై వేటు




**ముంబై, ఏప్రిల్ 15:** ప్రస్తుత రోజుల్లో ఉద్యోగం ఎప్పటివరకు ఉంటుందో.. ఎప్పుడు ఊడుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. పెద్ద కంపెనీల్లో కూడా ఉద్యోగాలు పిట్టల్లా రాలిపోతున్నాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, ఆర్థిక మాంద్యం భయాలు పారిశ్రామిక రంగాన్ని కుదిపేస్తున్నాయి. మరోవైపు ఎఐ వినియోగం పెరిగిపోతున్న నేపథ్యంలో ఐటి రంగంలో పెనుమార్పులు చోటు చేసుకుంటున్నాయి. వందలాది కంపెనీలు ఎఐ వినియోగంపై దృష్టి సారించి, ఉద్యోగులను తొలగిస్తున్నాయి. కొవిడ్ సంక్షోభం నుంచి బయటపడిన సమయంలో అవసరానికి మించి చేసుకున్న నియామకాల్ని ఇప్పుడు సర్దుబాటు చేసుకుంటున్నాయి. ఇక 2026 సంవత్సరంలో దాదాపు 231 టెక్ కంపెనీలు సుమారు 91 వేల మందికిపైగా ఉద్యోగుల్ని తొలగించినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

ఇప్పటికే ఒరాకిల్, అమెజాన్, మెటా, యుపిఎస్ ఇలా పెద్ద పెద్ద కంపెనీలు వేల సంఖ్యలో ఉద్యోగుల్ని తొలగించగా.. వీటిల్లో ఒరాకిల్ ఒక్కటే ప్రపంచవ్యాప్తంగా ఏకంగా 30 వేల మంది వరకు ఉద్యోగులపై వేటు వేసింది. ఏఐ డేటా సెంటర్లకు నిధుల కోసం ఈ కోతలు విధించినట్లు తెలిసింది. ఇంకా అమెజాన్ కూడా గత అక్టోబర్ నుంచి వేల సంఖ్యలో ఉద్యో గుల్ని తొలగిస్తూ వస్తోంది. మెటా తన రియాల్టీ ల్యాబ్స్, ఇతర విభాగాల నుంచి దాదాపు 1500 మంది ఉద్యోగులపై వేటు వేసింది. డెల్, క్రిప్టో.కామ్, యుపిఎస్, ఇ బే, వైస్‌టెక్ ఇలా పలు టెక్ సంస్థలు ఇదే బాటలో 2026లో ఉద్యోగాల కోతల్ని ప్రకటించాయి. ప్రధానంగా ఏఐ ద్వారా కార్యకలాపాల్ని పెంచుకు నేందుకు సంస్థలు లేఆఫ్స్ ప్రకటిస్తున్నాయి.

**స్నాప్ ఇంక్‌లో 20 శాతం సిబ్బందిపై వేటు!**

ఇప్పుడు టెక్ రంగానికే చెందిన మరో కంపెనీ అదే బాటలో పయనిస్తోంది. అదే స్నాప్‌చాట్ పేరెంట్ కంపెనీ, అమెరికన్ టెక్ సంస్థ స్నాప్ ఇంక్. ఇది ఏప్రిల్ 16నే ఉద్యోగుల్ని తొలగించేందుకు ప్లాన్ చేస్తున్నట్లు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. స్నాప్ మొత్తం ఉద్యోగుల సంఖ్య సుమారు 5 వేలుగా ఉండగా.. ఇందులో 15-20 శాతానికి సమానమైన దాదాపు 750 నుంచి 1000 మంది వరకు ఉద్యోగుల్ని తొలగించనున్నట్లు తెలుస్తోంది.

అంటే ఈ లెక్కన ప్రతి ఐదురుగు ఉద్యోగుల్లో ఒక ఉద్యోగిని తొలగించనున్నారని చెప్పొచ్చు. ఇంకొన్ని టీమ్‌ల్లో ఉద్యోగుల సంఖ్యను దాదాపు సగానికి తగ్గించనున్నారని రిపోర్ట్స్ ద్వారా తెలిసింది. అయితే కచ్చితంగా ఎంత మంది ఉద్యోగులపై ఈ లేఆఫ్స్ ప్రభావం చూపిస్తుందన్న దానిపై సరైన స్పష్టత లేదు. ఇక్కడ కంపెనీ ప్రధానంగా పాత స్నాప్‌చాట్ వ్యాపారం నుంచి నిధుల్ని తగ్గించి.. కొత్త సబ్సిడరీ స్పెక్స్ విభాగంపై (ఆగ్మెంటెడ్ రియాల్టీ) దృష్టి సారించాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. అవసరమైతే దీని కింద ఉద్యోగుల్ని నియమించుకోవాలని ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. స్పెక్స్ విభాగం కోసం పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టేందుకు సంస్థ యోచిస్తోంది. ఇదే సమయంలో ఇటీవల పర్‌ప్లెక్సిటీ ఏఐతో స్నాప్‌ను విలీనం చేయాలనుకున్న సుమారు 400 మిలియన్ డాలర్ల విలువైన డీల్ రద్దు కావడం కూడా లేఆఫ్స్‌కు కారణంగా తెలుస్తోంది.

**డిస్నీలో 1,000 మంది తొలగింపు**


ఐటి, ఈ-కామర్స్, వినోద రంగాల్లోనూ లేఆఫ్‌ల పరంపరం కొనసాగుతోంది. తాజాగా ప్రముఖ హాలీవుడ్ వినోద సంస్థ 'ద వాల్ట్ డిస్నీ కంపెనీ' భారీ స్థాయిలో ఉద్యోగాల కోతను ప్రకటించింది. సుమారు 1,000 మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు సిఇఓ జోష్ డి అమారో తెలిపారు. ఈ మేరకు ఉద్యోగులకు ఒక మెమో పంపారు. మార్కెటింగ్ విభాగం, స్టూడియోలు, టీవీ వ్యాపారాలు, ఈఎస్‌పీఎన్, ప్రొడక్ట్ అండ్ టెక్నాలజీతో పాటు కొన్ని కార్పొరేట్ విభాగాల్లో ఈ కోతలు ఉండబోతున్నాయి. మార్కెటింగ్ విభాగాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అసద్ అయ్యాజ్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన 'యూనిఫైడ్ మార్కెటింగ్ స్ట్రక్చర్'లో భాగంగా ఈ మార్పులు చేస్తున్నట్లు కంపెనీ వర్గాలు తెలిపాయి. వినోద రంగంలో వేగంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా, సాంకేతికతతో కూడిన శ్రామిక శక్తిని నిర్మించేందుకు, కార్యకలాపాలను క్రమబద్ధీకరించేందుకు ఈ నిర్ణయం అవసరమైందని డి అమారో తన మెమోలో పేర్కొన్నాడు.

# ట్రంప్ ప్రకటనతో మార్కెట్లు జోష్

### సెన్సెక్స్ 1,264 పాయింట్లు పెరుగుదల

### నిఫ్టీ 388.65 పాయింట్లు వృద్ధి

**ముంబై, ఏప్రిల్ 15:** ఇరాన్‌తో ఘర్షణ ముగింపు దశకు చేరుకుంటోందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటనతో, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తగ్గుముఖం పడతాయనే ఆశావాదంతో భారత ఈక్విటీ మార్కెట్లు భారీగా పుంజుకున్నాయి. ఇది పెట్టుబడిదారుల సెంటిమెంట్‌ను, రిస్క్ తీసుకునే ధైర్యాన్ని పెంచింది. బెంచ్‌మార్క్ సూచీలు లాభాలతో సెషన్‌ను ముగించాయి. నిఫ్టీ 1.63 శాతం, అంటే 388.65 పాయింట్లు పెరిగి 24,231.30 వద్ద ముగిసింది. సెన్సెక్స్ కూడా 1.64 శాతం, అంటే 1,264 పాయింట్లు పెరిగి 78,111.24 వద్ద స్థిరపడింది. దీంతో బిఎస్ఇలో లిస్టెడ్ కంపెనీల విలువ దాదాపు రూ.10 లక్షల కోట్ల మేరపెరిగింది. ఈర్యాలీకేవలం హెవీవెయిట్ షేర్లకే పరిమితం కాలేదు. మిడ్ క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలుకూడా ప్రధాన సూచీలను మించి రాణించాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 2.20 శాతం, నిఫ్టీ స్మాల్ క్యాప్ 2.35 శాతం మేర లాభపడ్డాయి. రంగాలవారీగా చూస్తే, నిర్మాణ రంగ షేర్లు అత్యధికంగా లాభపడ్డాయి. ఐటీ, మీడియా రంగాల్లోనూ కొనుగోళ్ల ఆసక్తి కనిపించింది. అయితే, ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సూచీ మాత్రం వెనుకబడింది. సాంకేతిక విశ్లేషకుల ప్రకారం, నిఫ్టీకి 24,300- 24,400 స్థాయిలు కీలక నిరోధక జోన్‌గా ఉన్నాయి. ఈ స్థాయిని నిఫ్టీ బలంగా దాటితే 24,800- 25,000 వైపు ర్యాలీ కొనసాగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. కిందకు వస్తే, 24,000 వద్ద తక్షణ మద్దతు ఉండగా, 23,900-23,800 మధ్య బలమైన మద్దతు లభించవచ్చని తెలిపారు. ఇదిలా ఉండగా, అమెరికా- ఇరాన్ రెండో విడత చర్చల తర్వాత మెరుగుపడిన సెంటిమెంట్ మద్దతుతో రూపాయి 93.36 వద్ద స్వల్పంగా బలపడింది. ఈ చర్చల ఫలితంగా రెండు సెషన్లుగా ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టాయి. "ప్రస్తుతం 94-95 డాలర్ల శ్రేణికి చేరువవుతున్న తక్కువ ముడి చమురు ధరలు, భారతదేశ దిగుమతుల బిల్లుపై ఒత్తిడిని తగ్గిస్తూ, కరెన్సీకి స్వల్పకాలిక ఉపశమనాన్ని అందిస్తున్నాయి" అని ఒక విశ్లేషకుడు పేర్కొన్నారు.



# భారత్- అమెరికా మధ్య మళ్లీ వాణిజ్య చర్చలు

### -వచ్చేవారం అగ్రరాజ్యానికి ఇండియన్ అధికారులు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 15:** భారత్-అమెరికా మధ్య మళ్లీ వాణిజ్య చర్చలు ప్రారంభం కానున్నాయి. అమెరికాతో కీలక వాణిజ్య చర్చల కోసం భారత అధికారుల బృందం ఏప్రిల్ 20 నుంచి వాషింగ్టన్‌ను సందర్శించనున్నట్లు అదనపు కార్యదర్శి దర్పణ్ జైన్ పేర్కొన్నారు. భారత్- అమెరికా మధ్య ఇప్పటికే తాత్కాలిక వాణిజ్య ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. తాజా చర్చల్లో ఈ ఒప్పందంపై ఇరుదేశాలు ఫ్రేమ్ వర్క్‌ను ఖరారు చేయనున్నాయని అధికార వర్గాలు తెలిపాయి. భారత్, అమెరికా మధ్య మధ్యంతర వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన ముసాయిదా ఇప్పటికే ఖరారైన నేపథ్యంలో ఈ ద్వైపాక్షిక భేటీ అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. వాస్తవానికి ఈ ఒప్పందంపై ఈ ఏడాది మార్చిలోనే సంతకాలు జరగాల్సి ఉంది. అయితే, అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన ఒక తీర్పుతో అక్కడి టారిఫ్ విధానాల్లో అనూహ్య మార్పులు జరిగాయి. అమెరికా నూతన గ్లోబల్ టారిఫ్ విధానం పూర్తిగా అమల్లోకి వచ్చిన తర్వాతే ఈ ఒప్పందంపై సంతకాలు జరిగే అవకాశం ఉందని అధికారిక వర్గాలు గతంలోనే స్పష్టం చేశాయి. మరోవైపు, అమెరికా సెక్షన్ 301 కింద రెండు వేర్వేరు దర్యాప్తులు చేపడుతున్న తరుణంలో వచ్చే వారం వాషింగ్టన్‌లో జరగనున్న భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది.



## పట్టాలెక్కనున్న నాన్ ఎసి

# క్లోజ్డ్ డోర్ లోకల్ రైలు

### -త్వరలో ముంబయిలో అందుబాటులోకి..

**ముంబై, ఏప్రిల్ 15:** రైలు ప్రయాణికులకు భారతీయ రైల్వే శుభవార్త అందించింది. నాన్ ఎసి క్లోజ్డ్ డోర్ లోకల్ రైలును త్వరలోనే ముంబైలో ప్రవేశపెట్టనుంది. దేశంలోనే మొట్ట మొదటి సారిగా నాన్‌ఎసి, ఆటోమేటిక్ డోర్లు మూసుకునే సదుపాయం ఉన్న లోకల్ రైలును ప్రవేశపెట్టేందుకు సిద్ధమైంది. రద్దీగా ఉండే రైళ్ల నుంచి ప్రయాణికులు జారిపడి జరిగే ప్రమాదాలను నివారించడంతో పాటు తీవ్రమైన వేడి నుంచి ఉపశమనం కల్పించడం ఈ కొత్త రైలు రూపకల్పన వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం. ప్రస్తుతం ముంబైలో కేవలం ఖరీదైన ఎసి లోకల్ రైళ్లకు మాత్రమే ఆటోమేటిక్ క్లోజ్డ్ డోర్ వ్యవస్థ ఉంది. అయితే, సాధారణ తరగతి ప్రయాణికులకు కూడా ఎసి రైళ్ల తరహా భద్రతను తక్కువ ధరకే అందించాలనే లక్ష్యంతో ఈ వినూత్న రైలును రూపొందించారు. ఇందులో ఎసి లేనప్పటికీ, ప్రయాణికులకు సౌకర్యంగా ఉండేలా 'ఫోర్స్డ్ వెంటిలేషన్ సిస్టమ్' అనే అధునాతన సాంకేతికతను అమర్చారు. ఈ వ్యవస్థ రైలు డోర్లు మూసి ఉన్నా కూడా కోచ్‌లలోకి నిరంతరం స్వచ్ఛమైన గాలిని పంపింగ్ చేస్తుంది. తద్వారా సాధారణ రైళ్ల కంటే ఎక్కువ గాలి ప్రసరణ జరిగి, లోపల వాతావరణం చల్లగా ఉంటుంది.

ఈ సరికొత్త రైలు రేక్‌ను చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసిఎఫ్)లో తయారు చేశారు. త్వరలోనే ముంబై సబర్బన్ ట్రాక్‌లపై దీని ట్రయల్స్ ప్రారంభం కానున్నాయి. ప్రయాణికుల భద్రత, సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఇందులో మరిన్ని ఆధునిక సదుపాయాలు కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో గార్డు లేదా మోటార్‌మ్యాన్‌తో మాట్లాడేందుకు 'టాక్‌బ్యాక్' సిస్టమ్, మెరుగైన సీటింగ్ అమరిక, ఎల్ఇడి లైటింగ్, రాబోయే స్టేషన్ల వివరాలను ప్రదర్శించే జిపిఎస్ ఆధారిత ప్యాసింజర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ వంటివి ఇందులో ఉన్నాయి.

ఈ రైలు టికెట్ ధరలపై ఇంకా అధికారిక ప్రకటన రానప్పటికీ, ఎసి లోకల్ రైలు ఛార్జీల కంటే గణనీయంగా తక్కువగా, సాధారణ ఫస్ట్ క్లాస్ లేదా సెకండ్ క్లాస్ ధరలకు దగ్గరగా ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. ఈ ట్రయల్స్ విజయవంతమైతే, ముంబై రైల్వే నెట్‌వర్క్‌ను ఆధునీకరించే ప్రణాళికలో భాగంగా ఇలాంటి మరిన్ని రైళ్లను ప్రవేశపెట్టాలని రైల్వే బోర్డు యోచిస్తోంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps